

'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 310

బుధవారం 31-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కేవలం శ్రీమంతుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉన్న ఇంగ్లీష్ మీడియంలో బోధన, ప్రీ లోడెడ్ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలతో కూడిన డిజిటల్ క్లాస్ రూమ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు, కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఆధునిక మౌలిక సౌకర్యాలు, స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంచే టోఫెల్ వంటి పరీక్షలను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చి..

నేడు ధనిక, పేద విద్యార్థుల మధ్య ఉన్న విద్యాంతరాలను రూపుమాపేలా అంతర్జాతీయ విద్యాబోధన IBని సైతం ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్న జగనన్న ప్రభుత్వం..

మన ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడేలా, నెగ్గేలా తీర్చిదిద్దడంలో మరో కీలక అడుగు..

ఇకమీదట రాష్ట్ర ప్రభుత్వ SCERTలో అంతర్జాతీయ విద్యాబోర్డు IB భాగస్వామ్యం..

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో IB (ఇంటర్నేషనల్ బకలారియేట్),
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ SCERT (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్) ల మధ్య నేడు ఒప్పందం..



క్రమ పద్ధతిలో IB బోధన వైపు..

దేశంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా IBని మన పాఠశాల విద్యాశాఖ SCERTలో
భాగంగా చేస్తూ ప్రభుత్వ బడుల్లో IB విద్యా విధానం.. 2024-25 లో టీచర్ల సామర్థ్యం, నైపుణ్యం పెంచేలా శిక్షణ..!
జూన్, 2025 నుండి ఒకటవ తరగతికి IB లో విద్యాబోధన..
జూన్ 2026 నుండి రెండో తరగతికి IB లో విద్యాబోధన..
ఇలా క్రమంగా ఒక్కో ఏడాది ఒక్కో తరగతికి పెంచుకుంటూ పోతూ
2035 నాటికి 10వ తరగతికి, 2037 నాటికి 12వ తరగతికి IB, రాష్ట్ర బోర్డుల జాయింట్ సర్టిఫికేషన్..



విద్యారంగానికి సంబంధించి ఏ సమస్యలున్నా
జగనన్నకు చెబుదాం
1902
టోల్ ఫ్రీ నంబర్



శ్రీ. బొత్స సత్యనారాయణ, విద్యా శాఖామాత్యులు

మరిన్ని వివరాలకు త్రిప్పి చూడండి..

గమనిక : రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో 31 జనవరి, 2024 నాడు సాయంత్రం 4 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీస్ లో " రాష్ట్ర ప్రభుత్వ SCERT, అంతర్జాతీయ విద్యా బోర్డు IB మధ్య ఒప్పందం". ఈ కార్యక్రమాన్ని అన్ని ముఖ్య ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు.

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



మన ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడేలా, నెగ్గేలా తీర్చిదిద్దడంలో మరో కీలక అడుగు..


ఇకమీదట రాష్ట్ర ప్రభుత్వ SCERTలో అంతర్జాతీయ విద్యాబోర్డు IB భాగస్వామ్యం..



మన విద్యార్థులను IB విధానానికి సన్నద్ధులను చేస్తూ.. గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దే ప్రక్రియకు 2019 నుండే శ్రీకారం చుట్టిన జగనన్న ప్రభుత్వం.. దీనిలో భాగంగా ఇప్పటికే..

1. ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన - సీబీఎస్ఈ మొదలు IB దాకా ప్రయాణం.. మూడో తరగతి నుండి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్..
2. 9 వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్‌లో భాగంగా బైలింగువల్ టెక్స్ట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ.. విద్యార్థులకు సులభంగా ఇంగ్లీష్ పాఠాలు అర్థమయ్యేలా..
3. 4వ తరగతి నుండి 12వ తరగతి వరకు ఉచిత బైజూస్ కంటెంట్..
4. 8వ తరగతి విద్యార్థులకు, బోధించే టీచర్లకు బైజూస్ ప్రీ లోడెడ్ కంటెంట్ తో కూడిన ఉచిత ట్యాబ్ లు..
5. నాడు-నేడు ద్వారా IBకి అనుగుణంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన..
6. 6వ తరగతి ఆపైన ప్రతి తరగతిలోను డిజిటల్ బోధన.. ఇందుకోసం 6వ తరగతి ఆపైన ప్రతి తరగతి గదిలో ఉండేలా 62వేల ఐఎఫ్‌పీలు.. ఆధునిక డిజిటల్ విద్యాబోధనకు ఊతమిస్తూ..
7. 1 నుండి 5వ తరగతి వరకు ప్రతి స్కూల్ లో ఉండేలా 45,000 స్మార్ట్ టీవీలు.. ఇంగ్లీష్ ల్యాబ్‌లకు ఊతమిస్తూ..
8. TOEFL: ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ లో నైపుణ్యం సాధించేలా ఈ ఏడాది నుండే ప్రతి స్కూల్లో 3వ తరగతి నుండి TOEFL ను ఒక సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టి, తర్ఫీదు ఇస్తూ, TOEFL జూనియర్, ఇంటర్‌లో TOEFL సీనియర్ పరీక్షలు కూడా నిర్వహించి ఆ అమెరికన్ సర్టిఫికెట్ అందజేత.. ఈ మేరకు ఈటీఎస్ తో ఒప్పందం..
9. జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద తదితర విప్లవాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల ఉన్నతికి ఊతం..
10. ఈ 56 నెలల్లో రూ.73,417 కోట్ల వ్యయంతో విద్యారంగంలో సంస్కరణలు..
11. నేడు IBతో ఒప్పందం..
12. 2024-25 విద్యా సంవత్సరంలో 'IB' పై అవగాహన, నైపుణ్యం, సామర్థ్యం పెంచేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, SCERT, DIET సిబ్బంది, SSC, ఇంటర్మీడియట్ బోర్డుల సిబ్బందికి శిక్షణ అందించి IB సర్టిఫికెట్లు అందజేత.. ఈ విధంగా IB శిక్షణ పొందిన టీచర్లు ప్రతిష్ఠాత్మక "IB గ్లోబల్ టీచర్ నెట్‌వర్క్" లో భాగం..





ఐఎఫ్‌పీలు



జగనన్న విద్యాకానుక కిట్ తో బడికెళ్తున్న విద్యార్థులు

ప్రీలోడెడ్ బైజూస్ కంటెంట్ తో కూడిన ట్యాబ్ లు

IB విద్యాబోధన ప్రత్యేకతలు..

- ప్రపంచంలోనే అత్యుత్తమ బోధనా పద్ధతి..
- బట్టీ చదువులకు స్వస్తి చెబుతూ థియరీతో పాటు ప్రాక్టికల్ అప్లికేషన్ పద్ధతిలో విద్యా బోధన..
- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలకు ప్రోత్సాహం
- ప్రస్తుత, భావి తరాల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపకల్పన, బోధనా విధానం, మూల్యాంకనం..
- క్లాస్ రూమ్ బోధనతో పాటు నైపుణ్యాలు (స్కిల్స్), ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, ప్రాక్టికల్స్ కు సమ ప్రాధాన్యత..
- ఇంటర్ డిసిప్లీనరీ కాన్సెప్ట్.. (నిజ జీవిత అంశాలు వివిధ సబ్జెక్టుల దృష్టికోణంలో అధ్యయనం చేయుట)..

- IB విధానంలో విద్యనభ్యసించిన వారికి ఇతరులతో పోలిస్తే ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్శిటీల్లో ప్రవేశం దొరకడం మూడు రెట్లు అధికం..
- IB విధానంలో విద్యనభ్యసించిన వారికి ప్రపంచస్థాయి ఉద్యోగ అవకాశాలు..



బైలింగువల్ టెక్స్ట్ బుక్స్



టోఫెల్ సర్టిఫికెట్

ఐక్యరాజ్యసమితిలో మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు..






నాడు-నేడు తో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి

శ్రీ. బొత్స సత్యనారాయణ, విద్యా శాఖా మాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 310

బుధవారం 31-1-2024



214 పరుగుల తేడాతో...

అండర్–19 ప్రపంచకప్ టోర్నీలో కివీస్‌పై భారత్ విజయం -స్పోర్ట్స్‌లో



పడగొట్టిన రిలయన్స్..

ఒక శాతం పతనమైన స్టాక్ సూచీలు సెన్సెక్స్ 802 పాయింట్ల నష్టం -బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

బిజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగారు.

వివరాలు 6లో ▸



ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు

అధికార పత్రాల లీకేజీ కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు, మాజీ విదేశాంగ మంత్రి ఖురేషీకి కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



సోరెన్ నివాసంలో ఈడీ సోదాలు

జార్ఖండ్ సీఎం హేమంత్ ఢిల్లీ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేసి రూ.36 లక్షల నగదు, కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 6లో ▸



నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

పార్లమెంట్ సమావేశాలు నేడు ప్రారంభం కానున్నాయి. గురువారం ఆర్థిక మంత్రి నిర్మల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

వివరాలు 6లో ▸



నవయుగంపై జగన్ సంతకం

ఇది పేదింటి మహిళల శిరస్సులపై వైఎస్ జగన్ ప్రభుత్వం అలంకరిస్తున్న ఆత్మగౌరవ కిరీటం. సాధికారతా పథంలో మహిళలను ముందడుగు వేయించే ఉజ్వల ఘట్టం. ఒకేసారి 30.61 లక్షల మందికి ఇళ్లస్థలాల పట్టాలివ్వడం ఒక జాతీయ రికార్డు. అందునా వారంతా మహిళలే కావడం ఒక సామాజిక విప్లవం. ఇస్తున్నవి కంటితుడుపు 'డీ' పట్టాలు కావు.. గుండె బలమిచ్చే రిజిస్ట్రేషన్ పత్రాలు. ఈ కన్వేయన్స్ డీడ్స్ పదేళ్లలో సేల్‌డీడ్స్‌గా మారుతాయి.

అక్కాచెల్లెళ్లకు ఆస్తి పత్రాలు.. 30.61 లక్షల మంది మహిళలకు పక్కా రిజిస్ట్రేషన్‌తో ఇళ్లస్థలాలు

- నేటి నుంచి మహిళల పేరుతో రిజిస్ట్రేషన్.. కన్వేయన్స్ డీడ్స్ కూడా
- పట్టా పొందిన నాటి నుంచి పదేళ్ల తర్వాత సర్వ హక్కులు
- ఎన్‌ఓసీ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు
- పదేళ్లకు ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌గా మారనున్న కన్వేయన్స్ డీడ్
- పేదలకు పూర్తి భరోసా... విలువైన స్థిరాస్తి సమకూరుస్తున్న ప్రభుత్వం
- గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు.. యుద్ధప్రాతిపదికన పూర్తికి సన్నాహాలు
- పంచాయతీ కార్యదర్శులను సబ్ రిజిస్ట్రార్‌గా గుర్తించి రిజిస్ట్రేషన్ చేసే అధికారాలు
- ప్రభుత్వం తరఫున రిజిస్ట్రేషన్ చేయనున్న వీఆర్వోలు
- గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన ఇళ్లకు జారీ చేసింది 'డి' పట్టాలు మాత్రమే
- తొలిసారిగా రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ ఇస్తున్న సర్కారు సీఎం జగన్‌దే

2లో

ఫ్యాక్ట్‌చెక్

చిన్నారుల భవితను చిదిమేసే యత్నం

- ప్రభుత్వ విద్యపై మరోసారి విషం కక్కిన రామోజీ
- ప్రభుత్వ బడిలో ఇంగ్లిష్ చదివితే వెనుకబడిపోతున్నారట..
- ప్రభుత్వ స్కూళ్లను ఉన్నతంగా తీర్చి దిద్దిన జగన్ ప్రభుత్వం
- అంతర్జాతీయ స్థాయిలో పేదల పిల్లలు పోటీ పడేలా సౌకర్యాలు, బోధన
- ఇంగ్లిష్ మీడియంతో పిల్లల బంగారు భవితకు బాటలు
- ఇదే చంద్రబాబు, రామోజీ, ఎల్లో మీడియాకు నచ్చడంలేదు

వివరాలు 3లో ▸

ఆదాయం పెరిగినా ఏడుపేనా!?

- రిజిస్ట్రేషన్లపై రామోజీ ద్వంద్వ రాతలు.. వాటి ద్వారా వచ్చే ఆదాయం పెరగడాన్ని వక్రీకరించిన ఈనాడు
- తెలంగాణలో రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగితే వృద్ధి అని గతంలో కథనాలు
- ఆ రాష్ట్రంతో పోల్చి ఆదాయం తగ్గడంవల్ల వృద్ధి లేదని రాతలు
- ఇప్పుడు అందుకు విరుద్ధంగా మార్కెట్ విలువలు పెంచేసి ఆదాయం పెంచుకున్నట్లు అడ్డగోలు వాదన

వివరాలు 10లో ▸

'ఈనాడు' కథనానికి ఇంజనీరు బలి!



- ప్రభుత్వ భవనాలకు సిమెంట్ సరఫరాపై ఎల్లో మీడియా వక్రభాష్యం
- రాజాం పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణ ఆత్మహత్యపై పోలీసుల విచారణ

వివరాలు 4లో ▸

సీమకు ఇం'ధనం'

రాష్ట్రంలోకి రూ.22,302 కోట్లు పెట్టుబడుల రాక

రాయలసీమలో భారీగా సోలార్, విండ్ ప్రాజెక్టులు

ప్రత్యక్షంగా 5,300 మందికి ఉద్యోగాలు

సీఎం జగన్ అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సంబంధించిన పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు) ఆమోద ముద్ర వేసింది. ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలో ఇంధన రంగంలో భారీ పెట్టుబడులు తరలి రానున్నాయి. ఇంధన రంగంలో పలు ప్రాజెక్టుల ద్వారా రూ.22,302 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. తద్వారా ప్రత్యక్షంగా 5,300 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులివీ

- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ దాదాపు రూ.12,065 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలో 3,350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట వద్ద 400 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బవద్ద 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడుల్లో 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లాలో డి.హీరేహాల్, బొమ్మనహాళ్‌లో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ప్లాంట్ల ఏర్పాటు ద్వారా 3,300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.
- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద రెండు విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. రూ.1,287 కోట్ల పెట్టుబడితో 171.60 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు సాకారం కావడం ద్వారా 200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.
- శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లెలో 1,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్‌ను ఆక్వా గ్రీన్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.4,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. తద్వారా 1,000 మందికి

మిగతా 2వ పేజీలో ▶

15 మంది

- బీజేపీ నేత హత్య కేసు..

పీఎఫ్ఐ కార్యకర్తలకు మరణశిక్ష

6లో



దోషులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

2021లో జరిగిన బీజేపీ ఓబీసీ విభాగం నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన 15 మంది కార్యకర్తలకు కేరళ కోర్టు మరణశిక్ష విధించింది. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న శ్రీనివాసన్‌ను 2021 డిసెంబర్ 19న ఆయన ఇంట్లో తల్లి, భార్య, కుమార్తె కళ్లెదుటే పీఎఫ్ఐ కార్యకర్తలు మారణాయుధాలతో దారుణంగా చంపారు. ఈ తీర్పుపై శ్రీనివాసన్ కుటుంబంతోపాటు బీజేపీ హర్షం వ్యక్తం చేసింది.



... సోరెన్ కోసం జల్లెడ పడుతున్నారు !!

చంద్రబాబులో అణువణువూ విషమే..

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఓటమి ఖాయం



- వాళ్లు సర్దుకుని హైదరాబాద్ వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు
- చేసిందేమిటో చెప్పుకోలేని దౌర్భాగ్యం చంద్రబాబుది
- బాబు సభలకు జన స్పందనే లేదు
- చంద్రబాబు అంత విషపూరిత రాజకీయ నేత దేశంలోనే లేరు
- మంత్రి అంబటి రాంబాబు ఫైర్

4లో

నేడు కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం (జనవరి 31) ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్‌లో మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఇందులో 2024–25వ ఆర్థిక సంవత్సరానికిగాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అలాగే, పలు ఇతర కీలక అంశాలపై మంత్రి వర్గ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఆమోదించిన పలు పెట్టుబడుల ప్రాజెక్ట్‌లను కూడా మంత్రి వర్గ సమావేశంలో ఆమోదించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

424 అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్య పోస్టుల భర్తీ

- మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్
- వాక్–ఇన్ రిక్రూట్‌మెంట్ ద్వారా 169 పోస్టులు భర్తీ
- సాధారణ ప్రక్రియలో 255 పోస్టుల భర్తీ



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 424 క్లినికల్, నాన్ క్లినికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 255 పోస్టులు బ్రాడ్ స్పెషాలిటీలు, 169 సూపర్ స్పెషాలిటీల్లో ఉన్నాయి. డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ విధానాల్లో పోస్టులను భర్తీ చేస్తారు. సూపర్ స్పెషాలిటీ పోస్టుల భర్తీకి వచ్చే నెల ఆరో తేదీన వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నట్టు బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. కార్డియాలజీ 15, న్యూరాలజీ 19, నెఫ్రాలజీ 23, న్యూరో సర్జరీ 13, యూరాలజీ 30, మెడికల్ ఆంకాలజీలో 21 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

రేపటి నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

బ్రాడ్ స్పెషాలిటీల్లో 255 పోస్టుల భర్తీకి గురువారం (ఫిబ్రవరి 1) నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు

మిగతా 3వ పేజీలో ▶



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బతుకులు బాగుపడ్డాయి



మాది చాలా పేద కుటుంబం. కూలి పని ద్వారా నా భర్త భాస్కరరావు తెచ్చే ఆదాయంతోనే కుటుంబ పోషణ సాగుతోంది. వచ్చిన అరకొర ఆదాయంతో బాపట్ల జిల్లా చినగంజాం జిల్లా సాపిరాలకు చెందిన మాకు.. ఉన్న ఒక్క కుమారుడిని బాగా చదివించగలమా.. అన్న భయం వెంటాడేది. అలాంటి పరిస్థితిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన వెంటనే అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి రూ.15 వేలు చొప్పున నా ఖాతాలో నగదు జమ చేశారు. ఆ మొత్తంతో పిల్లాడిని చక్కగా చదివించుకోగలిగాం. ఈ ఏడాదే బీటెక్ మొదటి సంవత్సరంలో చేరాడు. ఈ ఏడాది జగనన్న విద్యా దీవెన పథకం వర్తించింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాకు ఇప్పటి వరకు రూ.2 లక్షలు అందింది. జగనన్న కాలనీలో మాకు స్థలం మంజూరు చేశారు. ఇల్లు కూడా మంజూరైంది. త్వరలో నిర్మాణ పనులు చేపడతాం. మా పరిస్థితి ఇప్పుడు బాగా మెరుగు పడింది. మమ్మల్ని ఈ పరిస్థితికి చేర్చిన ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– పర్వతరెడ్డి శివపార్వతి, సాపిరాల
(వల్లపోలు శ్రీనివాసరావు, విలేకరి, చినగంజాం)

ఇంటికల సాకారమైంది



రోజూ పనికి వెళ్తే తప్ప మాకు పూట గడిచేది కాదు. ప్రకాశం జిల్లా కొనకమిట్ల మండలం గొట్లగట్టులో ఇల్లు కట్టుకోవాలనేది మా చిరకాల కోరిక. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఇల్లు కట్టుకోవాలన్న ఆశతో స్థలం మంజూరు చేయాలని ఎన్నో మార్లు విజ్ఞాపన పత్రాలు అందించాం. కానీ మంజూరు కాలేదు. స్థానిక నాయకులను ఎన్నిసార్లు ప్రాధేయపడినా మాపై జాలి చూపలేదు. ఈ సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రభుత్వం నియమించిన వలంటీర్ మా దగ్గరకు వచ్చి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోమని చెప్పారు. సచివాలయంలో దరఖాస్తు చేశాము. నెల రోజులు గడవక ముందే నా పేరున స్థలం, ఇల్లు మంజూరైందని సమాచారం వచ్చింది. నా సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. ఇల్లు మంజూరు పత్రాన్ని స్వయంగా నాకు అందించారు. వెంటనే ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయానికి మేము కొంత డబ్బు జమ చేసుకుని సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాం. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాకు ఏటా రూ.18,750 వంతున అందుతోంది. నా కుమారుడికి చదువుకు అమ్మ ఒడి పథకం ఏటా రూ.15 వేలు ఇస్తున్నారు. ఇన్ని విధాలుగా మేలు చేసిన ఈ ప్రభుత్వాన్ని ఎప్పటికీ మరచిపోము.

– సుంకేసుల కళావతి, గొట్లగట్టు
(నాగం వెంకటేశ్వర్లు, విలేకరి, కొనకనమిట్ల)

బిడ్డ పెళ్లికి చేసిన అప్పు తీర్చాం



నా భర్త కూలి పని చేస్తుంటాడు. పని లేనప్పుడు చేపలు పట్టుకోవడానికి వెళ్తుంటాడు. మాకు ఇద్దరు అమ్మాయిలు. మాకు వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. పిల్లల పెళ్లిళ్లు ఎలా చేయాలా అని ఎంతో సతమతం అయ్యాం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు సంక్షేమ పథకాలు వరమయ్యాయి. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున మూడు విడతల్లో రూ.56,250 వచ్చింది. పెద్ద కుమార్తెకు గతంలోనే పెళ్లయింది. చిన్నమ్మాయికి ఈ మధ్యే పెళ్లి చేశాం. పెళ్లికి ముందు ఆ పాపకు అమ్మఒడి ద్వారా రెండేళ్లపాటు రూ.15 వేల చొప్పున లబ్ధి చేకూరింది. పెళ్లిచేసే సమయంలో బంధువులు, వలంటీర్లు జగనన్న ప్రభుత్వంలో కళ్యాణమస్తు ద్వారా సాయం లభిస్తుందని చెప్పారు. దీంతో కల్యాణమస్తుకు దరఖాస్తు చేశాం. పెళ్లయిన మూడు నెలల్లోనే కల్యాణమస్తు ద్వారా రూ.లక్ష వచ్చింది. ఆ మొత్తంతో పెళ్లికి చేసిన అప్పు తీర్చేశాం. త్వరలో టిడ్కో ఇల్లు చేతికి రానుంది. ప్రస్తుతం హాయిగా జీవిస్తున్నాం. ఇంతలా ఆదుకున్న జగనన్న ప్రభుత్వం పదికాలాల పాటు చల్లగా ఉండాలి.

– గెడ్డం రత్నం, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా
(తోట రాంబాబు, విలేకరి, పాలకొల్లు సెంట్రల్)

గాంధీ సిద్ధాంతాలు ఆదర్శనీయం: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్



మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: జాతిపిత మహాత్మా గాంధీ ప్రవచించి ఆచరించిన శాంతి, అహింస సిద్ధాంతాలే అందరికీ సదా ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకమని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రాజ్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రబోధించిన సత్యం, అహింస విధానాలు ప్రపంచ శాంతికి దిక్సూచివంటివని పేర్కొన్నారు.

మహాత్మాగాంధీకి సీఎం జగన్ ఘన నివాళి



గాంధీ చిత్రపటానికి నమస్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సీఎం జగన్ ఘన నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం గాంధీ చిత్రపటానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. సత్యం, అహింస తన ఆయుధాలుగా స్వతంత్ర పోరాటం చేసి, జాతిపితగా గాంధీ నిలిచారని సీఎం అన్నారు. 'గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని మన ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశాం. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పిస్తున్నాను' అంటూ మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నవయుగంపై జగన్ సంతకం



అక్కాచెల్లెళ్లకు ఆస్తి పత్రాలు.. 30.61 లక్షల మంది మహిళలకు పక్కా రిజిస్ట్రేషన్‌తో ఇళ్లస్థలాలు

సాక్షి, అమరావతి: దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 30.61 లక్షల ఇళ్ల పట్టాలను ఇచ్చి పేదల సొంతింటి కలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని అక్కచెల్లెమ్మల పేరు మీద రిజిష్టర్ చేసి మరో చరిత్ర సృష్టించనుంది. తద్వారా పేదలకు ఇచ్చిన ఇళ్లను రిజిష్టర్ చేసిన తొలి ప్రభుత్వంగా సీఎం జగన్ సర్కారు రికార్డుకెక్కనుంది. దీనివల్ల పట్టాలు పొందిన పేదలకు తమ ఇళ్లపై పూర్తి భరోసా దక్కుతుంది. రిజిస్ట్రేషన్ తర్వాత లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్‌లు అందచేస్తారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం నేడో రేపో పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది. ఒకేసారి 30.61 లక్షల రిజిస్ట్రేషన్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ ప్రభుత్వం 30.61 లక్షల ఇళ్ల స్థలాలను ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకోసం రూ.31,832 కోట్ల విలువైన 71,811 ఎకరాల భూమిని సేకరించి 17 వేలకుపైగా లేఅవుట్లు నిర్మించింది. అందులో భాగంగా 25,374 ఎకరాల ప్రైవేటు భూమిని రూ.11,343 కోట్లు ఖర్చు పెట్టి భూసేకరణ ద్వారా సేకరించింది. ఇళ్ల పట్టాల కోసం ప్రైవేట్ భూమిని సేకరించడం, రూ.వేల కోట్లు వెచ్చించి పేదల ఇంటి కలను నెరవేరుస్తున్న తొలి ప్రభుత్వం ఇదే కావడం గమనార్హం.

ఇప్పటివరకు 'డి' పట్టాలే..

ఇప్పటివరకు ప్రభుత్వాలేవీ ఇళ్ల పట్టాలను పేదల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయలేదు. 1977 అసైన్డ్ భూముల చట్టం (పీఓటీ) ప్రకారం గత ప్రభుత్వాలు పేదలకు 'డి' పట్టాలు మాత్రమే జారీ చేసేవి. అది కూడా చాలా స్వల్ప సంఖ్యలోనే ఉండేవి. సీఎం జగన్ ప్రభుత్వం మొదటిసారిగా లక్షల మందికి ఒకేసారి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇప్పుడు వాటిని మహిళలకు సర్వ హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనుంది. వాస్తవానికి 2020 ఉగాది నాడే ఇళ్లతోపాటు రిజిస్ట్రేషన్లు కూడా చేసి ఇవ్వాలని సీఎం జగన్ భావించారు. ఇందుకోసం పదేళ్ల తర్వాత ఇళ్ల పట్టాలపై లబ్ధిదారులు యాజమాన్య హక్కులు పొందేలా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించారు. కానీ అప్పట్లో కొందరు రాజకీయ స్వార్థంతో పేదలకు మేలు చేసే ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో అప్పటికి తాత్కాలికంగా 'డి' పట్టాల ప్రకారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

మాటకు కట్టుబడి రిజిస్ట్రేషన్లు

అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం సర్వ హక్కులతో వారి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసేందుకు అసైన్డ్ భూముల చట్టాన్ని ప్రభుత్వం ఇటీవల సవరించింది. దాని ప్రకారం 2021లో 'డి' పట్టాలు ఇచ్చిన 30.61 లక్షల మందికి ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి ఆ స్థలాల లబ్ధిదారులైన అక్క చెల్లెమ్మలకు కన్వేయన్స్ డీడ్‌లు అందించనుంది. ఈ డీడ్‌లు పదేళ్ల గడువు ముగిసిన తర్వాత ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌లుగా మారతాయి. అప్పుడు ప్రభుత్వ జోక్యం లేకుండానే నేరుగా ఆ స్థలాలను అమ్ముకోవడానికి, ఇతర ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చు.

సంక్లిష్ట ప్రక్రియకు తెర

ప్రస్తుతం గడువు ముగిసిన 'డి' పట్టాలను క్రమబద్ధీకరించుకోవడం ఎంత కష్టమో అందరికి తెలిసిన విషయమే. దానికి రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌ఓసీ, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించడం క్లిష్టమైన ప్రక్రియ. పేద మహిళలు అలాంటి అవస్థలు పడకుండా వారికిచ్చిన ఇళ్ల స్థలాలను వారి పేరుతోనే ప్రభుత్వం రిజిష్టర్ చేసి కన్వేయన్స్ డీడ్‌లు ఇస్తోంది. ఈ డీడ్‌ల వల్ల ఆ స్థలాలు విలువైన స్థిరాస్తిగా వారికి సమకూరనున్నాయి. ఆ ఆస్తిపై బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశం కలుగుతుంది. ప్రైవేట్ ఆస్తి మాదిరిగానే లబ్ధిదారులు, వారి వారసులు అనుభవించే అవకాశం ఏర్పడుతుంది. ఆ ఆస్తి వివాదంలో చిక్కుకునే అవకాశం ఉండదు. తద్వారా పేద మహిళలకు వారు పొందిన ఇళ్ల పట్టాలపై పూర్తి భరోసా లభిస్తుంది. పదేళ్ల తర్వాత ఎవరితోనూ సంబంధం లేకుండా ఆ స్థలాలపై వారికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. తహశీల్దార్ల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఆ స్థలాలు వారి పేరు రిజిష్టర్ అయి ఉండడం, కన్వేయన్స్ డీడ్‌లు కూడా ఇస్తున్నందున వాటిని ఆస్తిపత్రాలు (సేల్ డీడ్స్)గా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.

ఇప్పటికే డమ్మీ రిజిస్ట్రేషన్లు..

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టేందుకు నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. మంగళవారం కొన్ని డమ్మీ రిజిస్ట్రేషన్లు కూడా చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల కోసం ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం రాష్ట్రంలోని 15 వేలకుపైగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తించారు. అక్కడి వీఆర్‌ఓలను ప్రభుత్వం తరపున రిజిస్ట్రేషన్ చేసే ప్రతినిధులుగా నియమించారు. రిజిస్ట్రేషన్ల శాఖ ఇందుకోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో 30.61 లక్షల ఇళ్ల పట్టాలు పొందిన వారి డేటాను పొందుపరిచింది. లక్షల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరగనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా సర్వర్ల సామర్థ్యాన్ని కూడా పెంచారు.

ప్రసవాల్లో తిరుపతి బోధనాస్పత్రి టాప్

- ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు డీఎంఈ ఆస్పత్రుల్లో 83,493 ప్రసవాలు
- అత్యధికంగా తిరుపతిలో 9,952 ప్రసవాలు
- లక్ష్య ఛేదనలో రాజమండ్రి జీజీహెచ్ ముందంజ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బోధనాస్పత్రుల ప్రసూతి సేవల్లో తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రి మొదటి స్థానంలో నిలిచింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు అన్ని బోధనాస్పత్రుల్లో 83,493 ప్రసవాలు జరగ్గా.. అత్యధికంగా తిరుపతిలో 9,952 ప్రసవాలు చేశారు. 7,426 ప్రసవాలతో విజయవాడ జీజీహెచ్ రెండో స్థానంలో, 7,424 ప్రసవాలతో కర్నూలు జీజీహెచ్ మూడో స్థానంలో ఉన్నాయి. బోధనాస్పత్రుల్లో రోగుల సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు ఎక్కువ మందికి సేవలందించేలా ప్రతి ఆస్పత్రికి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. ఇందులో భాగంగా ఆస్పత్రుల్లోని మెటర్నిటీ వార్డుల్లో పడకల సామర్థ్యం ఆధారంగా నిర్వహించాల్సిన ప్రసవాలపై లక్ష్యాలను నిర్దేశించారు. 2023–24వ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బోధనాస్పత్రుల్లో 1.08 లక్షల ప్రసవాలు నిర్వహించాలని లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటి వరకు 77.3 శాతం ప్రసవాలు చేశారు. రాజమండ్రి జీజీహెచ్‌లో 2,063 ప్రసవాలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. 3,227 ప్రసవాలను నిర్వహించి లక్ష్య ఛేదనలో రాష్ట్రంలోనే ముందంజలో నిలిచింది. అలాగే 4,125 ప్రసవాలకు గాను 5,523 ప్రసవాలు నిర్వహించి లక్ష్య ఛేదనలో కడప జీజీహెచ్ రెండో స్థానంలో, 2,063కు గాను 2,683 ప్రసవాలతో మచిలీపట్నం జీజీహెచ్ మూడో స్థానంలో నిలిచాయి.

మహిళలకు అండగా ప్రభుత్వం

మాత, శిశు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.. మారుమూల గ్రామాల్లో ప్రసవ వేదనతో ఉన్న గర్భిణులను 108 అంబులెన్స్‌లలో సకాలంలో బోధనాస్పత్రులకు తరలిస్తోంది. విశ్రాంత సమయానికి రూ.5 వేలు చొప్పున ఆరోగ్య ఆసరా అందిస్తోంది. అంతేకాకుండా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తల్లీ, బిడ్డలను.. వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో క్షేమంగా స్వగ్రామాలకు చేరుస్తోంది.

'కమాండో కాంపిటీషన్స్'లో సత్తా చాటిన ఏపీ

- తొలిసారిగా ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం
- ఆర్పీఎఫ్‌కు ఛీతారన్, బీఎస్ఎఫ్‌కు రణ్‌నీతి ట్రోఫీలు



ఏపీ జట్టుకు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందిస్తున్న ఏడీజీపీ మహేష్ దీక్షిత్

విశాఖ స్పోర్ట్స్: 14వ ఆల్‌ఇండియా పోలీస్ కమాండో కాంపిటీషన్స్ (ఏఐపీసీసీ)లో ఏపీ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. 300 పాయింట్లకు గాను 267.20 పాయింట్లతో ఏపీ పోలీస్ కమాండో జట్టు విజయకేతనం ఎగురువేసింది. ఈ పోటీల్లో 8 ట్రోఫీలకు గానూ నాలుగింట చాంపియన్‌గా నిలిచింది. విశాఖలోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయ మైదానంలో మంగళవారంతో ముగిసిన ఈ పోటీల్లో విజేతలకు ఇంటెలిజెన్స్ బ్యూరో ఏడీజీపీ మహేష్ దీక్షిత్ ట్రోఫీలను అందజేశారు. 9 రోజుల పాటు 23 ప్రత్యేక దళ కమాండో (16 స్టేట్, 7 పారా మిలిటరీ ఫోర్స్) జట్లు.. 5 దశల్లో జరిగిన పోటీల్లో సత్తాచాటాయి. ఆర్పీఎఫ్‌కు చెందిన కమాండో బిజేంద్ర 9.05 (12 నిమిషాలకు) నిమిషాల్లోనే పూర్తి చేసి ఛీతా రన్ ట్రోఫీని కై వసం చేసుకున్నాడు. కమాండో కాంపిటీషన్స్ విజేతగా ఏపీ నిలిచి స్వర్ణాలను అందుకుంది. రన్నరప్‌గా మహారాష్ట్ర నిలిచి రజతాన్ని, సెకండ్ రన్నరప్‌గా రాజస్థాన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాన్ఫిడెన్స్ కోర్స్ బెస్ట్ జట్టుగా 10 నిమిషాల 10 సెకన్ల వ్యవధితో ఏపీ జట్టు నిలిచింది. బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో జట్టుగా 300కు గానూ 267.20 మార్కులతో ఏపీ జట్టు కైవసం చేసుకుంది. స్మాల్ టీమ్ ఆపరేషన్స్‌కు ఇచ్చే రణ్‌నీతి ట్రోఫీని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కైవసం చేసుకోగా.. చక్రవ్యూహ (గ్రామీణ) ట్రోఫీని ఏపీ జట్టు, చక్రవ్యూహ (పట్టణ) ట్రోఫీని మహారాష్ట్ర జట్టు కైవసం చేసుకుంది. బ్లాక్ హాక్ ఫైరింగ్ ట్రోఫీని 93 మార్కులతో(110కిగానూ) ఏపీజట్టు అందుకుంది. ఏపీ జట్టులోని 13 మంది (11+2) సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ప్రోత్సాహంతో పాటు 3 అదనపు ఇంక్రిమెంట్లను సర్వీస్ బోర్డ్ ప్రకటించింది.

ఇంటర్ విద్యలో డిజిటల్ సేవలు

- ఫీజు చెల్లింపు నుంచి ప్రాక్టికల్ మార్కుల వరకు ఆన్‌లైన్‌లోనే..
- 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్.. పూర్తయిన వెంటనే వెబ్‌సైట్‌లో మార్కుల నమోదు
- మార్చి 1 నుంచి రాత పరీక్షలు.. 1,559 సెంటర్ల ఏర్పాటు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించేందుకు బోర్డు డిజిటల్ విధానాలను అనుసరిస్తోంది. ఇప్పటికే డిజి లాకర్‌లో 2006 నుంచి 2023 మధ్య ఇంటర్మీడియట్ పాసైన 68.73 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచగా, ఈ ఏడాది నుంచి ఫీజు చెల్లింపు నుంచి ప్రాక్టికల్స్ మార్కుల నమోదు వరకు అన్ని అంశాలను ఆన్‌లైన్ విధానంలోకి మార్చింది. దీంతో విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలకు సమయాభావం తగ్గడంతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి వచ్చినట్లయింది. గతంలో చలాన్ రూపంలో ఫీజు చెల్లించగా, వాటిని పరిశీలించి మదింపు చేసేందుకు బోర్డుకు చాలా సమయం పట్టేది. కానీ, ఈ ఏడాది ఫీజులను, నామినల్ రోల్స్‌ను కూడా ఆన్‌లైన్ చేయడంతో గత ఇబ్బందులన్నీ తొలగించినట్లయింది.

ఇంటర్ పరీక్షలకు 9,59,933 మంది..

ఇక మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరంలో 5,17,591 మంది, రెండో ఏడాది 4,45,342 మంది మొత్తం 9,59,933 మంది పరీక్ష రాయనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 1,559 పరీక్షా కేంద్రాలను సిద్ధంచేశారు. ఇప్పటికే ఆయా జూనియర్ కాలేజీల్లోని పరీక్ష జరిగే గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అలాగే, ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలకు 2,130 సెంటర్లను సిద్ధం చేశారు. ఈసారి ప్రాక్టికల్స్ పూర్తయిన వెంటనే మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం ఇంటర్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఎగ్జామినర్ రెండుసార్లు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసేలా చర్యలు తీసుకున్నామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుబ్బారావు 'సాక్షి'కి తెలిపారు. ఇకపై ఇదే ఆన్‌లైన్ విధానం కొనసాగుతుందన్నారు.

డిజిలాకర్‌లో 68.73 లక్షల సర్టిఫికెట్లు..

రాష్ట్రంలో ఇంటర్ పాసైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో సులభంగా పొందే వెసులుబాటును ఇంటర్ బోర్డు అందుబాటులోకి తెచ్చింది. పాస్ సర్టిఫికెట్, మైగ్రేషన్, ఈక్వి లెన్సీ, జెన్యూనెస్ సర్టిఫికెట్లు ఎప్పుడు కావాలన్నా తీసుకునేలా 'డిజిలాకర్'(https://digilocker.gov.in)లో ఉంచింది. ఇందుకోసం 'జ్ఞానభూమి'ని డిజిలాకర్‌కు అనుసంధానించింది. ఇందులో ఇప్పటివరకు 2006 నుంచి 2023 వరకు ఇంటర్ పూర్తిచేసిన 68,73,752 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచారు. సర్టిఫికెట్లలో తప్పుపడిన పేరును సరిదిద్దేందుకు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీలను సవరించడం వంటి ఇతర సేవలను కూడా ఆన్‌లైన్‌లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా విద్యార్థులు పొందవచ్చు. డిజి లాకర్‌గా పిలుస్తున్న 'డిజిటల్ డాక్యుమెంట్స్ రిపోజిటరీ'లో ఇంటర్ పరీక్షలు పూర్తిచేసిన విద్యార్థులు తమ పత్రాలను పొందవచ్చు. గతంలో సర్టిఫికెట్లు పోగొట్టుకున్న వారు 'డూప్లికేట్' పొందాలంటే పోలీసు విభాగం ఎన్‌ఓసీ, నోటరీ అఫిడవిట్‌తో దరఖాస్తు చేయడంవంటి వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఈ ప్రక్రియకు స్వస్తి పలుకుతూ డిజి లాకర్‌తో జ్ఞానభూమిని అనుసంధానం చేయడంతో విద్యార్థి తన మొబైల్ ఫోన్‌లోని డిజిలాకర్ యాప్ ద్వారా సర్టిఫికెట్లను ఎప్పుడైనా, ఎక్కడైనా పొందే విధానాన్ని బోర్డు అందుబాటులోకి తెచ్చింది.

ఎగుమతుల్లో దువ్వాడ
వీఎస్ఈజెడ్ రికార్డు

9 నెలల్లో రూ.1,62,211 కోట్ల ఎగుమతులు





శ్రీనివాసరావు

అగనంపూడి (గాజువాక): గత 9 నెలల కాలానికి దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ కార్యాలయ పరిధిలో అంచనాలకు మించి ఎగుమతులు సాధించినట్లు వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాసరావు తెలిపారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.1,62,211 కోట్ల విలు వైన వస్తువులను ఎగుమతి చేసినట్లు చెప్పారు. గతే డాదితో పోల్చితే 23% వృద్ధి రేటు సాధించామన్నారు. సేవా విభాగంలో రూ.1,17,300 కోట్లు, వాణిజ్య విభాగంలో రూ.44,911 కోట్ల మేరకు ఎగు మతులు నమోదైనట్లు చెప్పారు. ఇది దువ్వాడ వీఎస్ఈజెడ్‌కు ఆల్‌టైం రికార్డు అని చెప్పారు. వీఎస్ఈజెడ్ పరిధిలో రూ.1,04,961 కోట్ల పెట్టుబడులతో 6,61,579 మందికి ఉపాధి కల్పించామన్నారు.

దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు

- దివ్యాంగులు హోం ఓటింగ్ కోరితే ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా



సాక్షి, అమరావతి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 'అందరికీ అందుబాటులో ఎన్నికలు' రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దివ్యాంగులందరికీ ఓటు హక్కు ఉండాలి. వారు సానుకూల వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని వసతులు ఉండాలి' అనే నినాదంతో ఎన్నికల కమిషన్ పని చేస్తోందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద వారి కోసం ర్యాంపులు ఏర్పాటు చేసే ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. దివ్యాంగులు కోరుకుంటే వారి ఇంటివద్దే 'హోమ్ ఓటింగ్' చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ హక్కు వినియోగించుకోవాలనుకునే వికలాంగులు బీఎల్‌వో ద్వారా ఆర్వోకు ఫారమ్–12డి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ మంది వికలాంగులు ఉన్న పోలింగ్ స్టేషన్లలో రెడ్ క్రాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి సంస్థల నుంచి వలంటీర్లను నియమించి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన సహాయం అందిస్తామన్నారు. దివ్యాంగ ఉద్యోగులు, నిండు గర్భిణులు, బాలింత ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వనున్నామన్నారు. అందుకు తగ్గట్టుగానే ఉద్యోగుల సమాచారమివ్వాలని అన్ని శాఖలను కోరామన్నారు. సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎస్ హరేందిర ప్రసాద్, కమిటీ నోడల్ ఆఫీసర్ మల్లిబాబు, రాష్ట్ర అంధ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీంద్రబాబు, రాష్ట్ర బధిర సంఘం ప్రధాన కార్యదర్శి శశికుమార్, రోడ్లు భవనాల శాఖ అదనపు కార్యదర్శి బి.నరసింహారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి మురళీకృష్ణ, స్త్రీ,శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, పాఠశాల విద్య అదనపు కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

సీమకు ఇం'ధనం'



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యక్షంగా ఉద్యోగాలు దక్కుతాయి.

- కర్నూలు జిల్లా ఆస్పరి వద్ద 200 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును ఎక్రోన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1350 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయి.
- శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులను రెన్యూ విక్రం శక్తి ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. తద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు..

సమావేశంలో ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాల నాయుడు, ఆర్థిక, ప్రణాళిక, శాసనసభా వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యుత్, అటవీ, పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిశ్రమలు, ఐటీ, పెట్టుబడుల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, గృహ నిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, పర్యాటకశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, జీఏడీ స్పెషల్ సీఎస్ కె.ప్రవీణ్ కుమార్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత, రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం 'నవరత్నాలు'

తెలంగాణ రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ సలహాదారు జి.జయపాల్‌రెడ్డి



కర్నూలు(అర్బన్): ఏపీలో అమలు చేస్తున్న 'నవరత్నాలు', ఇతర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రిటైర్డు జెడ్పీసీఈఓ, తెలంగాణ రాష్ట్ర పీఆర్‌అండ్‌ఆర్‌డీ సలహాదారు జి.జయపాల్ రెడ్డి అన్నారు. ఈ పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనువుగా ఉన్నాయని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు నిర్దేశించుకున్న 17 లక్ష్యాల్లో అతి ముఖ్యమైన పేదరిక నిర్మూలన, ఆకలిని నిర్మూలించడం, ఆహార భద్రత, నాణ్యమైన విద్య, వైద్యం, అసమానతల తొలగింపు తదితర కార్యక్రమాలకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారని తెలిపారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కొన్ని వర్గాలు పనికట్టుకుని బురద చల్లడం సమంజసం కాదని పేర్కొన్నారు. గ్రామ, వార్డు వలంటీరు, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శ ప్రాయంగా ఉందని తెలిపారు.

'ఉపకారవేతనాల' దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

సాక్షి, అమరావతి: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునే గడువు బుధవారం (జనవరి 31)తో ముగియనుందని, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి కమిషనర్ సౌరభ్ గౌర్ కోరారు. కళాశాల, వర్సిటీ విద్యార్థులకు అందించే ఈ స్కాలర్‌షిప్ కోసం http:// scholarships.gov.in లో చూడవచ్చన్నారు. విద్యార్థుల వివరాలు జ్ఞానభూమి పోర్టల్‌లో ఉన్నాయని, డీవీఈఓలు, ఆర్‌ఐవోలు తమ పరిధిలోని కళాశాలలకు సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

3 నుంచి తిరుమలలో సనాతన ధార్మిక సదస్సు



మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యాన సనాతన ధార్మిక సదస్సు నిర్వహించనున్నట్లు ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించి ఈ సదస్సుకు ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈవో మాట్లాడుతూ ఈ సనాతన ధార్మిక సదస్సులో దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు పాల్గొంటారని చెప్పారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టీటీడీ నిర్వహిస్తున్న ధర్మప్రచార కార్యక్రమాలపై ఎస్వీబీసీ వీడియో రూపొందించాలని చెప్పారు. ఇందుకోసం సనాతన ధార్మిక సదస్సులో పాల్గొనే స్వామీజీల సలహాలు, సూచనలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, వేద విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి, డీపీపీ కార్యదర్శి సోమయాజులు, ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు పాల్గొన్నారు.


యశస్వి అమెరికా వెళ్లేందుకు షరతులతో కోర్టు అనుమతి

సాక్షి, అమరావతి: పచ్చ మంద అండతో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌పై నిత్యం సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్న ఎన్నారై బొద్దులూరి యశస్వికి హైకోర్టు పలు షరతులతో ఊరటనిచ్చింది. అతనిపై జారీ చేసిన లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)ని రద్దు చేసింది. మరోసారి తప్పు చేస్తే ఎల్‌వోసీ జారీ చేసేందుకు సీఐడీకి హైకోర్టు అనుమతినిచ్చింది. దర్యాప్తునకు అందుబాటులో ఉంటానని హామీ ఇస్తూ ఫిబ్రవరి 2న రెండు అఫిడవిట్లు దాఖలు చేయాలని యశస్విని ఆదేశించింది. రూ.5 లక్షల పూచీకత్తుతో ఒక అఫిడవిట్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద, చిరునామా, మొబైల్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్ తదితర వివరాలతో దర్యాప్తు అధికారి వద్ద మరో అఫిడవిట్ దాఖలు చేయాలంది. ఒకవేళ మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీని మార్చితే వెంటనే ఆ విషయాన్ని దర్యాప్తు అధికారికి తెలియజేయాలని స్పష్టంచేసింది. ఈ షరతులతో యశస్విపై సీఐడీ జారీ చేసిన ఎల్‌వోసీని హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీభానుమతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్నారుల భవితను చిదిమేసే యత్నం

- ప్రభుత్వ బడిలో ఇంగ్లిష్ చదివితే వెనుకబడిపోతున్నారట..
- ప్రభుత్వ స్కూళ్లను ఉన్నతంగా తీర్చి దిద్దిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- అంతర్జాతీయ స్థాయిలో పేదల పిల్లలు పోటీ పడేలా సౌకర్యాలు, బోధన
- ఇంగ్లిష్ మీడియంతో పిల్లల బంగారు భవితకు బాటలు
- ఇదే చంద్రబాబు, రామోజీ, ఎల్లో మీడియాకు నచ్చడంలేదు

ప్రభుత్వ విద్యపై మరోసారి విషం కక్కిన రామోజీ



సాక్షి, అమరావతి: పేదలకు మంచి చదువు అందించి, వారిని ఉన్నత స్థాయికి చేర్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ప్రపంచ పోటీని తట్టుకుని, విజయం సాధించేలా పేదల పిల్లలకు చదువు, సదుపాయాలు అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా రూపుదిద్దారు. బడుగుల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి బోధన అందిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంతో పిల్లల బంగారు భవితకు బాటలు పడుతున్నాయి. ఇదే చంద్రబాబుకు, రామోజీరావుకు, ఇతర ఎల్లో మీడియాకు నచ్చడంలేదు. ఇంగ్లిష్ మీడియంతో విద్య నాశనమైపోయిందంటూ మరోసారి విషాన్ని చిమ్మింది రామోజీ విషపుత్రిక ఈనాడు. గత చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలకు దన్నుగా నిలిచినా ప్రశ్నించలేదు రామోజీరావు. ప్రభుత్వ స్కూళ్లలో సరైన బెంచీలు, మరుగుదొడ్లు, చివరకు చాక్‌పీస్‌లు లేకపోయినా చంద్రబాబు, రామోజీ పట్టించుకోలేదు. ఇప్పుడు పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పడం తప్పంటున్నారు. చిన్నారుల భవితను చిదిమేసే యత్నమే తప్ప మరొకటి కాదు.

సిలబస్ ఒక్కటే

సిలబస్‌తో సర్కస్ అంటూ రాసిన రాతల్లో వాస్తవమే లేదు. రాష్ట్రంలోని 1,000 స్కూళ్లు సీబీఎస్‌ఈ బోర్డుకి అనుసంధానించారు. 44,478 స్కూళ్లలోనూ ఎన్సీఈఆర్టీ సిలబస్ మాత్రమే బోధిస్తున్నారు. పరీక్షలు నిర్వహించే బోర్డులు వేరయినా, సిలబస్ మాత్రం ఒకటే. ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇదే విధానం అమల్లో ఉంది. మొదటగా వచ్చే ఏడాది పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సీబీఎస్‌ఈ పరీక్షలు రాస్తారు.

ఇంగ్లిష్ చదవలేని పరిస్థితి ఎక్కడ ఉంది?

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఇంగ్లిష్ మీడియంపై గల ఆసక్తి, వారి అభిప్రాయం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పిల్లల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని పెంచేందుకు బైలింగ్యువల్ పుస్తకాలు, డిక్షనరీలు అందించారు. ఇటీవల ముగిసిన ఫార్మేటివ్‌తో పాటు సమ్మేటివ్-1 పరీక్షలను 93 శాతం పైగా విద్యార్థులు ఇంగ్లిష్‌లోనే రాశారు. మరి ఇంగ్లిష్ చదవలేని పరిస్థితి ఎక్కడుంది? టోఫెల్‌లో కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇంగ్లిష్ స్పీకింగ్ స్కిల్స్, లిజనింగ్ స్కిల్స్‌ను స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా శిక్షణనిస్తోంది. ఇందుకోసం స్కూళ్లలో ప్రత్యేకంగా పీరియడ్ కేటాయించారు. బోధనను ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు అప్పగించారు. ఆంగ్లం డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్హత ఉన్న ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా టోఫెల్ బోధించవచ్చు. తెలుగు ఉపాధ్యాయులకు ఈ బాధ్యత అప్పగించలేదు.

ఐబీ సుదీర్ఘ ప్రక్రియ

ఐబీ కరిక్యులమ్‌లో విద్యార్థులకు కరిక్యులమ్‌తో పాటు కో-కరిక్యులమ్ అంశాలను కూడా నేర్పిస్తారు. ఇది 2025 జూన్ నుంచి ఏటా ఒక తరగతికి పెంచే 10 సంవత్సరాల సుదీర్ఘ ప్రక్రియ. ఒకేసారి ఉపాధ్యాయులు, విద్యార్థులపై భారం పడేది కాదు. ఐబీ విద్యతో విద్యార్థుల నైపుణ్యాలను అంతర్జాతీయ స్థాయికి పెరుగుతాయి. ఐబీ సర్టిఫికెట్లకు అంతర్జాతీయంగా విలువ ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడానికి పటిష్టమైన ప్రణాళిక, సమర్థవంతమైన భాగస్వాముల సహకారం విద్యా శాఖ తీసుకుంది. ట్యాబ్స్ ద్వారా విద్యార్థులకు ఉత్తమమైన ఈ కంటెంట్‌ను అందిస్తున్నారు. వీటిలో భాగంగా బైజూస్ ఈ కంటెంట్‌ను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందించింది. పాఠ్య పుస్తకాల్లోని కాన్సెప్టులను సులభ శైలిలో దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో బోధిస్తోంది. దీనివల్ల ఉపాధ్యాయులకు బోధన సులభం అవడంతో పాటు విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి.

తల్లిదండ్రులకు సర్వే వివరాలు

సర్వేలు వ్యవస్థ బలాబలాలను తెలుసుకుని, మెరుగైన విధానాలు రూపొందించేందుకు ఉద్దేశించినవి. గత సర్వేల ఆధారంగా టీచింగ్ ఎట్ రైట్ లెవెల్, లిప్, సాల్ట్ తదితర కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారు. విద్యార్థుల ఫలితాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఎక్కడా ఉంచరు. టెస్ట్‌లో కూడా విద్యార్థుల వ్యక్తిగత ఫలితాలు వెబ్‌సైట్‌లో ఉంచరన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రతి పాఠశాలలో ప్రభుత్వం చేసిన సర్వే వివరాలు వారి తల్లిదండ్రులకు అందుబాటులో ఉంచారు.

సర్వే రిపోర్టులతో శాస్త్రీయంగా సంస్కరణలు

గత ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రభుత్వ పాఠశాలలకు ఇవ్వకపోవడంతో విద్యా వ్యవస్థ దిగజారిందని ఆసర్, నాస్ వంటి సర్వేలు తేల్చాయి. దాంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యతను పెంచుతోంది. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కార్యక్రమాలు వీటిలో కొన్ని. ఆసర్ నివేదిక ఆధారంగా రూపొందించిన టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమంలో విద్యా బోధనలో నూతన విధానాలను అవలంభిస్తున్నారు. ఇందుకోసం ప్రథమ్ సంస్థతో కలిసి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను అన్ని స్కూళ్లకు అందించారు. ఇది సత్ఫలితాలనిస్తోంది. ఎంపిక చేసిన కొన్ని జిల్లాల్లో ప్రాథమికోన్నత స్థాయిలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు 'లిప్' ప్రోగ్రాం అందిస్తున్నారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్స్‌కు 'కేంద్రీకృత ప్రశ్న పత్రాల తయారీ' విధానం ద్వారా అన్ని పాఠశాలల్లో ఒకే తరహా ప్రశ్నపత్రాలు విద్యార్థులకు అందిస్తున్నారు. విద్యార్థుల తప్పులను శాస్త్రీయంగా విశ్లేషించి నిపుణులతో వీడియోలను రూపొందించి అందజేస్తున్నారు.

వ్యక్తికి గుండెపోటు... రక్షించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'



నూకయ్యను 104 వాహనంలో ఈసీజీ తీసేందుకు తీసుకువెళ్తున్న సిబ్బంది

గార: కుమార్తెను చూసేందుకు వచ్చి గుండెపోటుతో కుప్పకూలిపోయిన ఓ వ్యక్తిని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం కాపాడింది. అతనికి వైద్య శిబిరంలోని డాక్టర్లు అత్యవసర వైద్యం అందించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం పెద్దాస్పత్రికి పంపారు. శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని తోణంగి గ్రామానికి చెందిన గొంప నూకయ్య(63) కుమార్తె పైడమ్మ కొర్ని గ్రామంలో ఉంటున్నారు. కుమార్తెను చూసేందుకు నూకయ్య మంగళవారం ఉదయం కొర్ని గ్రామానికి వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అతనికి చెమటలు పడుతుండటం, చేతులు, మెడ లాగుతున్నట్టు అనిపిస్తుందని చెప్పడంతో భయపడిన పైడమ్మ పక్కింటి వారికి తెలియజేసింది. స్థానికులు వెంటనే గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్దకు నూకయ్యను తీసుకువచ్చారు. అప్పటికే 250 మందికిపైగా ఉన్న గ్రామస్తులకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షబ్నం, కిమ్స్ స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తున్నారు. అయితే, వైద్య శిబిరం వద్ద నూకయ్య ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో వెంటనే వైద్యులు 104 వాహనంలో ఈసీజీ తీయించారు. గుండెపోటు అని తేలడంతో అక్కడికక్కడే వైద్యం చేశారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు.

424 అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్య పోస్టుల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన వైద్యులు https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ అభ్యర్థులు రూ.వెయ్యి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.500 చొప్పున అప్లికేషన్ ఫీజు చెల్లించాలి. రెండు విభాగాల పోస్టుల పూర్తి నోటిఫికేషన్‌లను https:// dme.ap.nic.in, http://apmsrb.ap.gov.in/ msrb/ వెబ్‌సైట్‌లలో ఉంచారు.

ఒక్క పోస్టు ఖాళీ ఉంచకుండా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాస్పత్రుల్లో మానవ వనరుల కొరతకు చెక్ పెట్టారు. ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 2019 నుంచి ఇప్పటివరకూ ఒక్క వైద్య శాఖలోనే ఏకంగా 53 వేలకు పైగా పోస్టులను భర్తీ చేస్తున్నారు. వైద్య శాఖలో నియామకాల కోసం ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేశారు. వైద్య శాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులకు పెద్ద ఎత్తున ప్రమోషన్లు ఇచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు ఇవ్వడం వల్ల ఏర్పడ్డ ఖాళీలు, అన్ని జీజీహెచ్‌లలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చే ప్రక్రియలో మంజూరు చేసిన కొత్త పోస్టుల భర్తీకి తాజా నోటిఫికేషన్‌ను జారీ చేశారు.

బ్రాడ్ స్పెషాలిటీల్లో ఖాళీలు ఇలా



విభాగం	ఖాళీలు	విభాగం	ఖాళీలు
అనస్తీషియా	34	పీడియాట్రిక్స్	16
డెర్మటాలజీ	6	సైకియాట్రీ	15
ఎమర్జెన్సీ మెడిసిన్	16	రేడియో డయగ్నోసిస్	26
ఈఎన్‌టీ	3	రేడియోథెరపీ	2
జనరల్ మెడిసిన్	30	టీడీ, సీడీ	2
జనరల్ సర్జరీ	18	ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్	3
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్	5	ఆప్తమాలజీ	11
న్యూక్లియర్ మెడిసిన్	2	ఫోరెన్సిక్ మెడిసిన్	8
ఓబీజీ	24	పాథాలజీ	12
ఆర్థోపెడిక్స్	8	ఎస్పీఎం	14
		మొత్తం	255

12 ప్రభుత్వ స్కూళ్లకు 'నేషనల్ గ్రీన్' అవార్డులు



సీఎస్‌ఈ డైరెక్టర్ సునీత నుంచి అవార్డులు అందుకున్న ఏపీ ప్రతినిధులు

'ఉత్తమ గ్రీన్ స్టేట్'గా ఏపీకి మూడో స్థానం

సాక్షి, అమరావతి: కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ పరిధిలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్‌ఈ) అందించే ప్రతిష్టాత్మక 'నేషనల్ గ్రీన్' అవార్డులను రాష్ట్రంలోని 12 ప్రభుత్వ పాఠశాలలు దక్కించుకున్నాయి. ఉత్తమ గ్రీన్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలవగా, జాతీయ స్థాయిలో ఉత్తమ ల్యాండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో అన్నమయ్య జిల్లా గండబోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవార్డును దక్కించుకుంది. మరో 11 పాఠశాలలు 'గ్రీన్' అవార్డును అందుకున్నాయి. ఏటా సీఎస్‌ఈ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ నిర్వహణ విధానాలు, పర్యావరణ పద్ధతులకు 19 ఏళ్లగా అవార్డులను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 199 స్కూళ్లకు అవార్డులు ప్రకటించగా, అందులో ఏపీకి చెందిన 12 ప్రభుత్వ పాఠశాలలతో పాటు వ్యక్తిగత విభాగంలో ముగ్గురు ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. జాతీయ స్థాయిలో గ్రీన్ స్కూల్ ప్రోగ్రాంలో ఉత్తమ ప్రదర్శన చేసిన ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ తరఫున స్టేట్ కోఆర్డినేటర్ పి.నీలకంఠయ్య కూడా అవార్డును అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వర్షపు నీటి నిర్వహణ, వేస్ట్ కంపోస్ట్, బయోడైవర్సిటీపై అవగాహన, జంక్‌ఫుడ్ నిరోధం, విద్యుత్ వినియోగం తగ్గించడం వంటి అంశాలపై ఈయన అవగాహన కల్పిస్తున్నారు. గండబోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి తక్కువ స్థలంలో మియవాకీ విధానంలో చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుతున్నారు. దీంతో పక్షులు, నెమళ్ల ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. విజేతలకు మంగళవారం ఢిల్లీలోని సీఎస్‌ఈలో సీఎస్‌ఈ డైరెక్టర్ సునీతా నారాయణ్ అవార్డులు ప్రదానం చేశారు.

కేంద్ర విధానాలకు తలొగ్గొద్దు

ఏపీఈఆర్సీకి పలువురి విజ్ఞప్తి

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో కేంద్రం దోచుకునేందుకు సిద్ధమవుతోందని..కేంద్ర విధానాలకు తలొగ్గొద్దంటూ డిస్కమ్‌లకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. 2024–25కి సంబంధించి విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో రెండో రోజు కొనసాగింది. గాంధీ వర్ధంతి సందర్భంగా కార్యాలయ ఆవరణలో బాపూజీ కాంస్య విగ్రహానికి ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్, పీవీఆర్ రెడ్డి, డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్ ఇమ్మడి, కె.సంతోషరావు, సంస్థ డైరెక్టర్లు రమేష్ ప్రసాద్, చంద్రం, సూర్యప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి 20 మంది వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని వారి అభిప్రాయాలను చెప్పారు. విద్యుత్ సంస్కరణల్ని కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తుంటే.. ఏపీ మొగ్గు చూపడం తగదని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల విషయంలో కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వినియోగదారులు ఏపీఈఆర్సీ దృష్టికి తీసుకువచ్చిన సూచనలు, అభ్యంతరాల్ని, వాటిపై విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు బుధవారం చెప్పే సమాధానాలను పరిగణనలోకి తీసుకొని టారిఫ్ నిర్ణయిస్తామని జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి చెప్పారు.

'ఖేలో ఇండియా'లో అదరగొడుతున్న ఆంధ్ర



సూర్య చరిష్మా (బ్యాడ్మింటన్-స్వర్ణ పతకం)



పి. త్రినాథ్ చౌదరి, కె. శరణ్య (ఆర్చరీ మిక్స్‌డ్-రజత పతకం)



వై. చైతన్య కుమారి (వెయిట్ లిఫ్టింగ్ - రజత పతకం)

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఏపీ క్రీడాకారులు వరుస పతకాలతో దూసుకెళ్తున్నారు. చెన్నైలో మంగళవారం జరిగిన పోటీల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సూర్య చరిష్మా స్వర్ణ పతకంతో మెరిసింది. స్విమ్మింగ్ 800 మీటర్స్ ఫ్రీ స్టయిల్ వ్యక్తిగత విభాగంలో తీర్థు సాందేవ్ స్వర్ణం, సంపత్ కుమార్ యాదవ్ రజతంతో అదరగొట్టారు. మహిళల వెయిట్ లిఫ్టింగ్ 81 కేజీల విభాగంలో వై.చైతన్య కుమారి రజత పతకాన్ని గెలుపొందగా, ఏపీ మహిళల వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఆర్చరీ కాంపౌండ్ కేటగిరీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కెంగం శరణ్య, పెండ్యాల త్రినాథ్ చౌదరి బృందం రజత పతకాన్ని సాధించింది. మహారాష్ట్రతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ చాంపియన్ అదితి గోపిచంద్‌స్వామి, గణేష్‌రావు జాదవ్ చేతిలో 153–150 పాయింట్ల తేడాతో పోరాడి ద్వితీయ స్థానంలో నిలిచారు. సెమీఫైనల్స్‌లో ఢిల్లీపై రసవత్తర పోరు నడిచింది. కుముద్‌సైని, ఆర్యన్‌యాదవ్ బృందంతో తలపడగా 153–153తో స్కోర్ సమమైంది. రెండు యారోస్ షూటవుట్‌లో ఏపీ 20 పాయింట్లు, ఢిల్లీ 19 పాయింట్లు సాధించడంతో ఫైనల్స్‌కు చేరుకుంది. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో భార్గవ్‌రామ్, విశ్వతేజ కాంస్య పతకం సాధించారు. ప్రస్తుతం ఏపీ 27 మెడల్స్‌తో పతకాల పట్టికలో 12వ స్థానంలో కొనసాగుతోంది. వీటిల్లో 7 స్వర్ణ, 9 రజత, 11 కాంస్య పతకాలున్నాయి.



తీర్థు సాందేవ్ (స్విమ్మింగ్-స్వర్ణ పతకం) | సంపత్ కుమార్ యాదవ్ (స్విమ్మింగ్-రజత పతకం)

నేటినుంచి జిల్లా స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'

- సుమారు 19వేల మంది క్రీడాకారుల ప్రాతినిధ్యం
- 1,740కుపైగా మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు
- ఆన్‌లైన్‌లోనే జట్ల మధ్య పోటీకి షెడ్యూల్

సాక్షి, అమరావతి: 'ఆడుదాం ఆంధ్రా' మెగా టోర్నీలో కీలక దశ పోటీలకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీలతో క్రీడా సందడి నెలకొననుంది. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు 26 జిల్లాల్లో ఒక్కొక్కటిండు చొప్పున క్రీడామైదానాలు/ఇండోర్ స్టేడియాలను గుర్తించారు. ఈ క్రీడాకారులకు వసతి, రవాణా, భోజన సౌకర్యాల విషయంలో ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా ఆన్‌లైన్‌లోనే జట్ల మధ్య పోటీల షెడ్యూల్‌ను పూర్తి చేశారు. మ్యాచ్ జరిగే స్థలం, తేదీ, సమయం వంటి వివరాలు టెక్స్ట్ మెసేజ్ రూపంలో క్రీడాకారులకు పంపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉండే ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు మంగళవారం రాత్రికే క్రీడా వేదికల వద్దకు చేరుకున్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు చెందిన పురుషులు, మహిళల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ డబుల్స్, వాలీబాల్‌లో విజేతలు జిల్లాస్థాయిలో పోటీపడనున్నారు. సుమారు 19వేల మంది క్రీడాకారులు ప్రదర్శన ఇచ్చేలా 1,740 మ్యాచ్‌లకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఒక్కో జిల్లాకు పురుషులు, మహిళల నుంచి 10 విజేత జట్లకు నగదు బహుమతులు ఇవ్వనున్నారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా నియోజకవర్గ స్థాయి పోటీలను దిగ్విజయంగా పూర్తిచేసిన విషయం తెలిసిందే.

జిల్లాస్థాయి విజేతలకు నగదు బహుమతులు ఇలా..

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలో..

ప్రథమ	ద్వితీయ	తృతీయ
60,000	30,000	10,000

బ్యాడ్మింటన్ డబుల్స్‌కు..

ప్రథమ	ద్వితీయ	తృతీయ
35,000	20,000	10,000



నేడు జేఎన్‌టీయూకే, నన్నయ వర్సిటీ స్నాతకోత్సవాలు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ)/రాజానగరం: కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూకే) 10వ, తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ 13, 14, 15వ స్నాతకోత్సవాలు బుధవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు కులపతి హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

గిరిజన గృహాల్లో విద్యుత్ వెలుగులు

రూ.140 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో విద్యుదీకరణ

- గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రూ. 24 కోట్లతో 1982 గృహాలకు విద్యుత్
- నంద్యాల జిల్లాలో రూ.5 కోట్లతో 213 గృహాల విద్యుదీకరణ
- ఉత్తరాంధ్రలో 8,819 గిరిజన కుటుంబాలకు విద్యుత్.. రూ.33.49 కోట్లతో డీపీఆర్
- గిరిజనుల నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా విద్యుత్ కనెక్షన్

సాక్షి, అమరావతి: అడవులు, కొండల్లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతి గిరిజన గృహానికీ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ.140 కోట్లను వెచ్చిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు గత నెలలో రాష్ట్రంలో విద్యుత్ సదుపాయం లేని గిరిజన గ్రామాలపై అధ్యయనం చేశాయి. అడవులు, కొండ ప్రాంతాల్లోని గిరిజనుల గృహాలకు విద్యుత్ లైన్లు వేయడానికి సాంకేతికంగా, ఆర్థికంగా ఉన్న సాధ్యాసాధ్యాలను వీరు అధ్యయనం చేశారు. గిరిజనుల నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పిస్తోంది. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నంద్యాల జిల్లాలో 213 గిరిజన ఆవాసాల విద్యుదీకరణకు రూ.5 కోట్లు కేటాయించింది. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రూ.24 కోట్లతో 1982 గిరిజనుల ఇళ్లకు విద్యుత్ సర్వీసులు అందిస్తోంది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 8,819 గిరిజన గృహాల విద్యుదీకరణకు రూ.33.49 కోట్లతో డీపీఆర్ సిద్ధమైంది. ఇంకా ఏవైనా విద్యుత్ అందని గిరిజన గృహాలను కూడా డిస్కంలు గుర్తిస్తున్నాయి. అలాగే గిరిజన ప్రాంతాల విద్యుదీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎంజేఏఎస్ఎంఏఎన్) పథకానికి కూడా మన రాష్ట్రం ఎంపికైంది. ఈ పథకం ద్వారా విద్యుత్ లైన్లు వేయడం సాధ్యం కాని ప్రాంతాల్లో సౌర విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుంది.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

అర్హులైన గిరిజన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం సబ్సిడీతో నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇంధన వినియోగ చార్జీలు, ట్రూ–అప్, ఎఫ్‌పీపీసీఏ చార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. గత ప్రభుత్వం చెల్లించాల్సిన ఎస్టీ వినియోగదారుల రాయితీ బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది. గత ప్రభుత్వ హయాంలో 0–75 యూనిట్ల పరిమితి ఉండేది. 100 యూనిట్ల పరిమితి దాటిన వినియోగదారుల సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేసేవారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ బకాయిలను కూడా చెల్లించడంతో పాటు యూనిట్ల పరిమితిని కూడా 200కు పెంచింది. ఎస్టీల విద్యుత్ సబ్సిడీ గత ప్రభుత్వంతో పోలిస్తే రెట్టింపునకు పైగా పెరిగింది. దీంతో సర్వీసులూ పెరిగాయి. 5 లక్షలకు పైగా ఎస్టీ కుటుంబాలకు ఇప్పుడు ఉచిత విద్యుత్ అందుతోంది.



గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేని ఆవాసాల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్న ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ బృందం

ప్రతి ఆవాసానికీ విద్యుత్

ఈపీడీసీఎల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో విద్యుత్ సదుపాయం లేని 271 గిరిజన మారుమూల హాబిటేషన్స్‌ను గుర్తించాం. 4944 గిరిజన కుటుంబాలకు విద్యుదీకరణ చేయడానికి రూ.29.96 కోట్లతో గతంలో ప్రతిపాదనలు రూపొందించాం. తాజాగా 1,474 గిరిజన ఆవాసాల్లో 8,819 గిరిజన గృహాల విద్యుదీకరణకు రూ. 33.49 కోట్లతో డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధమైంది. ఇంకా విద్యుదీకరణ చేయని 245 హాబిటేషన్స్‌లో 1,544 గృహాల విద్యుదీకరణకు పాడేరు డివిజన్‌లోని గిరిజన ప్రాంతాల్లో సర్వే చేశాం. ప్రతిపాదనలు కూడా రూపొందించాం.

–ఎల్ మహేంద్రనాథ్, ఎస్ఈ, విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్, ఏపీఈపీడీసీఎల్

అర్హులందరికీ రాయితీ విద్యుత్



రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో కూడా విద్యుత్ సదుపాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంకా విద్యుత్ అందని గృహాలపై సర్వే ఏజెన్సీ గ్రామాల్లో సర్వే చేశాం. అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఉన్న పలు ఆవాసాలకు ఏ విధంగా విద్యుత్ సరఫరా చేయాలో నివేదిక రూపొందించాం. ఆరు పాయింట్ల వేలిడేషన్ ప్రక్రియ ద్వారా అర్హులైన గిరిజన లబ్ధిదారులందరికీ నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తోంది.

– కె.విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఎస్టీల గృహ విద్యుత్‌పై గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీ (రూ.కోట్లలో)

కేటగిరీ	201415	2015-16	2016-17	2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
ఎస్టీ	18.54	16.13	21.23	47.83	51.25	73.31	95.81	102.82	108.29

ఈనాడు కథనానికి ఇంజనీరు బలి!

- ప్రభుత్వ భవనాలకు సిమెంట్ సరఫరాపై ఎల్లో మీడియా వక్రభాష్యం
- రాజాం పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణ ఆత్మహత్యపై పోలీసుల విచారణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రభుత్వ భవనాల నిర్మాణానికి తెచ్చిన సిమెంట్‌ను అవసరమైన చోట్ల వాడామని, బిల్లులు వచ్చిన తర్వాత వెనక్కి తెప్పిస్తున్నామని 'ఈనాడు' పత్రికకు వివరణ ఇచ్చినా పట్టించుకోకుండా వక్రభాష్యాలు చెబుతూ కథనాలను ప్రచురించింది. దీంతో ఒత్తిడికి గురైన విజయనగరం జిల్లా రాజాం పంచాయతీరాజ్ జేఈ (కాంట్రాక్ట్ ఉద్యోగి) వి.రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ నాయకులకు ముడిపెడుతూ ఈనెల 30వతేదీన **ఈనాడు** తప్పుడు కథనాలను ప్రచురించింది. ఈనెల 29న ఉదయం రేగిడి మండల జేఈ (కాంట్రాక్టు) వి.రామకృష్ణ రాజాం పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై పోలీసులు మంగళవారం విచారణ ప్రారంభించారు.



గ్రామ సచివాలయాల వారీగా వచ్చిన సిమెంట్ బస్తాలు, వినియోగంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లను రాజాం సీఐ ఎస్.శ్రీనివాస్ ఆరా తీశారు. అవసరాన్ని బట్టి ఒక సచివాలయం నుంచి మరో సచివాలయం పరిధిలో భవనాల నిర్మాణానికి సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈనెల 25న 'ఆ సిమెంట్ బస్తాల మాటేమిటి?' శీర్షికతో ఈనాడులో కథనం వచ్చినప్పటి నుంచి తన భర్తపై ఒత్తిళ్లు ప్రారంభమైనట్లు రామకృష్ణ భార్య ఉమాదేవి వాపోతున్నారు.



ఆ సిమెంటు బస్తాల మాటేంటి?

తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, సిమెంట్ బస్తాలు వేరే సచివాలయం పరిధిలోని భవనాలకు సరఫరా చేశామని రామకృష్ణ మొత్తుకున్నా 'ఈనాడు' కథనంపై వివరణ ఇవ్వాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించడంతో రామకృష్ణ మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

సీఎం జగన్‌కి రుణపడి ఉంటాం

- కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల సాయం
- అన్న కోసం కాలేయంలో 60 శాతం దానం చేసిన తమ్ముడు

పాలకొల్లు అర్బన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ యువకుడి ప్రాణాన్ని నిలిపింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన గంధం వెంకట సురేష్ విశాఖపట్నంలోని ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నాడు. అతనికి అనుకోని ఆపద వచ్చింది. అతని కాలేయానికి కేన్సర్ సోకింది. దీంతో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స వెంటనే చేయాలని వైద్యులు నిర్ధారించారు. వైద్యం నిమిత్తం రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన.. రాజంపేట ఎంపీ, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి అత్యవసరంగా రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. దీంతో హైదరాబాద్ గ్లోబల్ ఆసుపత్రిలో వెంకట సురేష్‌కి శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేశారు. సురేష్ తమ్ముడు సాయిరామ్‌కుమార్ తన కాలేయంలో 60 శాతం అన్నకు దానం చేశాడు. ఆపరేషన్ విజయవంతమయింది. మంగళవారం పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయానికి సాయిరామ్‌కుమార్ వచ్చి గుడాల గోపికి ధన్యవాదాలు తెలిపారు. వెంకట సురేష్ తండ్రి పద్మారావు చిరు వ్యాపారి.



అన్న కోసం 60శాతం కాలేయం దానం చేసిన తమ్ముడు సాయిరామ్‌కుమార్



కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న వెంకట సురేష్

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి దౌర్జన్యం

- మైనింగ్ సిబ్బందిపై 'ఏలూరి' అనుచరుల దాడి
- విచక్షణారహితంగా కొట్టి గదిలో బంధించిన వైనం
- అధికారులను దుర్భాషలాడిన ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, బాపట్ల/మార్టూరు: నోవా అగ్రిటెక్ మాటున అక్రమాలకు పాల్పడిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మరింత రెచ్చిపోతున్నారు. మంగళవారం మార్టూరులో గ్రానైట్ ఫ్యాక్టరీలను తనిఖీ చేసేందుకు వచ్చిన మైనింగ్ విజిలెన్స్ అధికారులపై తన అనుచరులతో పాటు ఏకంగా దాడికి పాల్పడ్డారు. గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీలు చేయనిచ్చేది లేదంటూ తొలుత అధికారులను అడ్డగించారు. తనిఖీకి వచ్చిన మైనింగ్ ఏడీ తోపాటు మిగిలిన అధికారులనూ దుర్భాషలాడారు. మైనింగ్ అధికారులతో వచ్చిన డ్రైవర్ శ్రీనివాసరావుపై దాడికి తెగబడ్డారు. గౌరవప్రదమైన శాసనసభ్యుడి హోదాలో ఉండి పరిశ్రమలను తనిఖీ చేసేందుకు వచ్చిన అధికారులపై బరితెగించి తన అనుచరులతో దౌర్జన్యానికి దిగారు. విచారణ జరిగితే అక్రమాలు వెలుగుచూస్తాయన్న భయంతోనే ఏలూరి దౌర్జన్యానికి పాల్పడినట్లు తెలుస్తుంది. వివరాల్లోకి వెళితే మార్టూరు గ్రానైట్ పరిశ్రమల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులతో నెల్లూరు మైనింగ్ విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్, మచిలీపట్నం మైనింగ్ ఏడీ ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం తనిఖీల నిమిత్తం మార్టూరుకు వచ్చారు. బాలాజీనాయక్ బృందం బల్లికురవ మండలం వేమవరం వద్ద ఉన్న ఎమ్మెల్యే ఏలూరి అనుచరుడు కోటపాటి సురేష్‌కు చెందిన రెండు ఫ్యాక్టరీల్లో తనిఖీలు నిర్వహించగా మచిలీపట్నం ఏడీ ప్రతాప్‌రెడ్డి మార్టూరులోని ఏలూరి మరో అనుచరుడు కామినేని జనార్దన్‌కు చెందిన ఫ్యాక్టరీలో తనిఖీ చేసేందుకు వెళ్లారు. ఈ విషయాన్ని మార్టూరులోనే ఉన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తెలియజేయడంతో అనుచరులతో సహా ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న ఏడీ ప్రతాప్‌రెడ్డిని ఎలా తనిఖీలు చేస్తారంటూ నిలదీశారు. తనిఖీలు చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదంటూ గొడవకు దిగాడు. అనుచరులతో కలిసి అధికారులను దుర్భాషలాడారు. వారిపై జులుం ప్రదర్శించారు. ఏడీ ప్రతాప్‌రెడ్డిపై జరుగుతున్న దౌర్జన్యం చూసి అడ్డుకోబోయిన డ్రైవర్ శ్రీనివాసరావుపై ఏలూరి అనుచరులు దాడికి దిగారు. అతనిని ఇష్టానుసారం కొట్టారు. ఫ్యాక్టరీ ఆవరణలోని ఓ గదిలో బంధించారు.



అధికారులను నిలదీస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఎమ్మెల్యే, అనుచరులపై కేసులు నమోదు

ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ నరసింహారావు మంగళవారం రాత్రి తెలిపారు. ఏలూరి సాంబశివరావు, ప్రత్తిపాటి సురేష్, చల్లగుండ్ల కృష్ణ, దివ్య ప్రసాద్, షేక్ అబ్దుల్ రజాక్, మిన్నెకంటి రవి, అడుసుమల్లి శ్రీనివాసరావు, నడింపల్లి హనుమాన్ ప్రసాద్, మరికొందరిపై మైనింగ్ ఏడీ ఆర్ ప్రతాప్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. వీరిపై ఐపీసీ 341, 353, 323, 324, 427, 386, 506 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

మదనపల్లి రేసులో బిల్డప్ బాబాయ్

- టీడీపీ నేత అమరనాథ్ మోసాలను బయటపెట్టిన అనుచరుడు గణి

మదనపల్లె: మదనపల్లె టీడీపీ రేసులో ఉన్న బిల్డప్ బాబాయ్ కోడికొళ్ల అమరనాథ్ అసలు గుట్టు బయటపడింది. అతని ప్రధాన అనుచరుడు రాయల్ గణి మీడియా సమావేశం పెట్టి అతని చిట్టా బయటపెట్టాడు. అరచేతిలో స్వర్గం చూపించే రకం అమర్‌నాథ్.. గోబెల్స్ ప్రచారంలో చంద్రబాబునే మించిపోయి నియోజకవర్గ ప్రజలను మోసగించేందుకు పలు గిమ్మిక్కులకు పాల్పడ్డాడు. వీటన్నింటిని అతని అనుచరుడు రాయల్ గణి మంగళవారం మీడియాకు వెల్లడించాడు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం పీటీఎం మండలం రంగసముద్రానికి చెందిన వ్యక్తి కోడికళ్ల అమరనాథ్ గతంలో రైతుల నుంచి చీనీ, మామిడి, వేరుశెనగ కొనుగోలు వ్యాపారం చేసేవాడు. రైతులకు డబ్బులివ్వకుండా మోసం చేయడంతో మదనపల్లెతో పాటు కర్నాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో పలు స్టేషన్లలో అతనిపై 420, చెక్‌బౌన్స్ కేసులు నమోదయ్యాయి. ఎనిమిదేళ్ల క్రితం మదనపల్లె వన్‌టౌన్‌లో కేసు నమోదయ్యాక బెంగళూరు పారిపోయి కొన్నాళ్లు అజ్ఞాతంలో ఉన్నాడు. ఎన్నికలు దగ్గర పడడంతో ఇప్పుడు బెంగళూరు నుంచి అద్దె గన్‌మెన్‌లు, బౌన్సర్లను వెంటేసుకుని హఠాత్తుగా మదనపల్లెలో ప్రత్యక్షమయ్యాడు. పట్టణానికి చెందిన రాయల్ గణిని వెంటేసుకుని టీడీపీ నాయకుడిగా ప్రచారం చేసుకుంటూ ఎల్లో మీడియాలో పబ్లిసిటీ చేసుకున్నాడు. ఆదికేశవులునాయుడు కుటుంబానికి సన్నిహితుడినని, బలిజ సామాజికవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని టీడీపీ ముఖ్యనాయకుల్ని కలిసి అభ్యర్థించాడు. చంద్రబాబు దృష్టిలో పడేందుకు గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టాడు. బాబు సీఎం కావాలని 10 వేల మంది ముస్లింలకు అజ్మీర్ యాత్ర చేయిస్తున్నానని, దానికి రూ.కోటి చెక్కు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. 20 వేల మంది హిందువులను కాశీయాత్రకు సొంత ఖర్చులతో పంపుతానని, పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చాడు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీకి సీతారామ లక్ష్మణ పంచలోహ విగ్రహాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గంలో హడావుడి చేశాడు. ఇటీవల పీలేరులో జరిగిన 'రా కదలిరా' సభలో చంద్రబాబు దగ్గరకు వెళ్లి చెవిలో ఏదో చెబుతున్నట్లు నటించి, ఫొటోలు తీయించుకుని, బాబుకు అత్యంత సన్నిహితుడినని ప్రచారం చేసుకున్నాడు. అయితే రాయల్‌గణితో అతనికి తేడా రావడంతో మీడియా ముందు అతని శిష్యుడే అక్రమాల్ని వెల్లడించాడు. అమర్‌నాథ్ పెద్ద మోసగాడని, ఆదికేశవులునాయుడు కుటుంబానికి, అతనికి ఏమీ సంబంధం లేదని గణి తెలిపాడు. అంబానీ, అదానీ, అమిత్‌షాతో తనకు వ్యాపార లావాదేవీలున్నాయని చెప్పడం పచ్చి అబద్ధమని, అతడిపై పలు రాష్ట్రాల్లో కేసులున్నాయని వెల్లడించాడు. అజ్మీర్ యాత్ర పేరుతో రూ.కోటి చెక్కు డ్రామా అని తెలిపాడు. అతని విషయం తెలిసిన టీడీపీ శ్రేణులు ముక్కున వేలేసుకుంటున్నాయి.



ఇటీవల పీలేరులో సభలో బాబుతో అమరనాథ్

బాబులో అణువణువూ విషమే

మంత్రి అంబటి రాంబాబు ఫైర్

సాక్షి, అమరావతి : వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు–పవన్ బృందానికి ఓటమి ఖాయమని, వారు మూటాముల్లె సర్దుకుని హైదరాబాద్ వెళ్లటానికి సిద్ధంగా ఉన్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ రూ.2.53 లక్షల కోట్లు డీబీటీ ద్వారా పేదల ఖాతాల్లో జమచేశారని.. ఇలా రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తే విషమవుతుందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. నిజానికి.. చంద్రబాబు అంత విషపూరిత రాజకీయనేత దేశంలోనే లేరన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్‌లకు ఎలాగూ ఇక్కడ ఇళ్లు కూడా లేవు కాబట్టి వారు సర్దుకోడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. భీమిలిలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'సిద్ధం' తొలిసభ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమవడంతో పార్టీ క్యాడర్‌కు మరింత నూతనోత్తేజం ఇచ్చిందన్నారు. అదే సమయంలో చంద్రబాబు నిర్వహిస్తున్న సభలకు ప్రజాస్పందన లేదని అంబటి ఎద్దేవా చేశారు. తాను ఇది చేశానని చెప్పుకునే స్థితిలో కూడా ఆయన లేరన్నారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

సీట్లు ప్రకటించుకోలేని మీరు దేనికి సిద్ధం!?

చంద్రబాబు, లోకేశ్‌లను మోయటానికి.. ప్యాకేజీ పుచ్చుకోవడానికి పవన్ సిద్ధంగా ఉన్నారు. అదే సమయంలో సీఎం జగన్ సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకోవడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. మీ సీట్లే ప్రకటించుకోలేని మీరు దేనికి సిద్ధం? పొత్తులతో కట్టకట్టుకుని వస్తున్న మీది కౌరవ సైన్యం.. కానీ, సీఎం జగన్ అర్జునుడిలా మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయబోతున్నారు. ఇది నిజం. వాస్తవానికి.. అందితే జుట్టు అందకపోతే కాళ్లు.. అదే చంద్రబాబు విజన్. ఆయన 53 రోజులు జ్యుడిషియల్ రిమాండ్‌లో జైల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆయన ఆరోగ్యం బాగోలేదంటూ ఆయన, ఆయన ఎల్లో మీడియా గగ్గోలు పెట్టాయి. ఆయనకు ప్రాణాపాయం ఉందంటూ ఘోషించాయి. లోపలుంటే ఏడుపులు, పెడబొబ్బలు.. బయటకొస్తే అరుపులు కేకలు పెట్టడమే ఆయన విజన్. ఎన్నికలకు ముందు అసాధ్యమైనవి కూడా చేస్తానంటూ మేనిఫెస్టో ప్రకటిస్తారు. కానీ, గెలిస్తే ఆ మేనిఫెస్టోని మాయం చేసేస్తారు. అదే ఆయన విజన్. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు. ఆ విషయం ఆయనే చెప్పుకున్నారు. అందుకే ఎలాగైనా అబద్ధాలాడి కోట్లు ఖర్చుపెట్టి సీఎం జగన్‌పై విషంచిమ్మి గెలవాలని కిందామీదా పడుతున్నారు.

దాడుల సంస్కృతి నా చరిత్రలో లేదు..

నా ప్రత్యర్థి టీడీపీ తరఫున పోటీకి సిద్ధమవుతున్న కన్నా లక్ష్మీనారాయణ తొండపి గ్రామం వెళ్తే అక్కడ పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. రాళ్లు నేనే వేయించానని, ఆయనపై హత్యాయత్నం చేయించానని నాపై బురదజల్లే ప్రయత్నం చేశారు. ఆ సంస్కృతి నా చరిత్రలో లేదు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కొనే సత్తా ఉన్న పార్టీలో నేనున్నాను. అంబోతు రాంబాబు రొళ్లేయించారు.. అధికారంలోకి వచ్చాక ముక్కుతాడు వేస్తాను అని చంద్రబాబు అంటున్నారు. నువ్వు అధికారంలోకి వచ్చేది లేదు.. మేం మళ్లీ అధికారంలోకి వస్తాం. నువ్వు ఎక్కడున్నా పట్టుకుని నీ చేతిపై 'ఆంబోతులకు అవుల్ని సప్లై చేసే రాజకీయవేత్త' అని పచ్చబొట్టు వేయిస్తా.. జాగ్రత్త.

క్లుప్తంగా...

ఏపీ శకటానికి బహుమతి అందించిన కేంద్రమంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకల్లో భాగంగా కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రదర్శించిన శకటానికి, సాంస్కృతిక ప్రదర్శనలకు లభించిన తృతీయ బహుమతులను కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్ భట్ మంగళవారం అందించారు. పరేడ్‌లో పాల్గొన్న శకటాలకు నిర్వహించిన జ్యూరీ ఎంపికలు, దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాభిప్రాయ ఎంపికల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన శకటాలకు రిపబ్లిక్ డే క్యాంపులో రక్షణ శాఖ బహుమతుల ప్రదానం చేసింది. పీపుల్స్ చాయిస్ విభాగంలో ఏపీ శకటం గెలిచిన తృతీయ బహుమతిని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, సమాచార శాఖ జేడీ కిరణ్‌కుమార్ స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ శకటంపై ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా డిజిటల్ విద్యాబోధన, నాడు–నేడు, ఇంగ్లిష్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఆంగ్ల మాధ్యమంలో బోధన నేపథ్యంతో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ శకటం పరేడ్‌లో అందరినీ ఆకట్టుకుంది.

నేటి నుంచి జేఎల్ పోస్టులకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: గత నెలలో ఏపీపీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని సర్వీస్ కమిషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. బుధవారం నుంచి ఫిబ్రవరి 20వరకు అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. నోటిఫికేషన్ పూర్తి వివరాలు, పోస్టుల సంఖ్య, అర్హతలు, వేతనం తదితర వివరాలు https://psc.ap.gov.inలో ఉంచామన్నారు.

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా

ఏపీ మైన్స్ అండ్ జియాలజీ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తాత్కాలిక జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

'స్కిల్' కేసులో అప్రూవర్ పిటిషన్‌పై విచారణ 2వ తేదీకి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో అప్రూవర్ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఫిబ్రవరి రెండో తేదీకి వాయిదా వేసింది. 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పన్నాగంతో పాల్పడిన ఈ కుంభకోణం కేసులో అప్రూవర్‌గా మారతానని నిందితుడు (ఏ13)గా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ కాంత్ షా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఈ కేసులో నిందితుడు (ఏ2)గా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి, చంద్రబాబు మిత్రుడు లక్ష్మీనారాయణ న్యాయస్థానంలో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టాల్సి ఉంది. కాగా, విచారణను వాయిదా వేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. ఇప్పటికే చంద్రకాంత్ షా అప్రూవర్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు చంద్రబాబు తరఫు న్యాయవాదులు పలుమార్లు వాయిదా కోరారు. కాగా, మళ్లీ లక్ష్మీనారాయణ పిటిషన్‌పై కూడా విచారణను వాయిదా వేయాలని వారు కోరడం గమనార్హం. చంద్రబాబు తరఫు న్యాయవాదుల వినతిపై న్యాయస్థానం ఈ కేసు విచారణను ఫిబ్రవరి 2కి వాయిదా వేసింది.

'ఇండియా లేబర్ లైన్'ను సద్వినియోగం చేసుకోండి

- విజయవాడ ప్రచారోద్యమంలో లేబర్ డిప్యూటీ కమిషనర్ ఆషారాణి

సాక్షి, అమరావతి : అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన 'ఇండియా లేబర్ లైన్ 1-800-833-9020ను సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ. ఆషారాణి పిలుపునిచ్చారు. ఇండియా లేబర్ హెల్ప్‌లైన్ ప్రచారోద్యమంలో భాగంగా మంగళవారం విజయవాడలో తన కార్యాలయం వద్ద మొబైల్ వ్యాన్ క్యాంపెయిన్‌ను ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది నవంబరు నుంచి ఇండియా లేబర్ హెల్ప్‌లైన్‌ను విజయవాడ, గుంటూరులో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులను గుర్తించి వారందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు వివరించి వాటిని వారికి అందించాలన్నదే హెల్ప్‌లైన్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

10వేల మందికి అవగాహన

ఇండియా లేబర్ లైన్ స్టేట్ కోఆర్డినేటర్ ఎ. మాధవరావు మాట్లాడుతూ.. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మొబైల్ క్యాంపెయిన్ విజయవాడ, గుంటూరు నగరాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల వేతనాలు, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. సుమారు 10వేల మంది అసంఘటిత రంగ కార్మికులను కలిసి అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు బి. కిషోర్, రాజేష్, ఔట్‌డోర్ లెర్నింగ్ సెంటర్ కోఆర్డినేటర్ ఎం. అన్నామనీ మాట్లాడారు.

అంబేడ్కర్ మోనోగ్రాఫ్ విడుదల



తపాలా శాఖ రూపొందించిన మోనోగ్రాఫ్ విడుదల చేస్తున్న రాములు, రాజశేఖర్ తదితరులు

సాక్షి, అమరావతి: తపాలా శాఖ రూపొందించిన 'ట్రయల్ ఆఫ్ విజిట్ ఆఫ్ బాబాసాహెబ్ అంబేడ్కర్ టు ఏపీ–1944' మోనోగ్రాఫ్‌ను ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మంగళవారం విడుదల చేశారు. అంబేద్కర్ 1944వ సంవత్సరం సెప్టెంబర్ చివరి వారంలో కోస్తా ఆంధ్రలో విశాఖ, అనకాపల్లి, తుని, కాకినాడ, రామచంద్రాపురం, రాజమహేంద్రవరం, పాలకొల్లు, పెంటపాడు, గుడివాడ, ఏలూరును సందర్శించి తన ప్రసంగాలతో ఎందరో యువతను చైతన్యవంతులను చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ సందర్శనల జ్ఞాపకార్థం 10 ప్రత్యేక తపాల కవర్లను విడుదల చేసింది. వీటితో పాటు అంబేద్కర్‌పై ఉన్నత స్థాయి అధికారులు, పరిశోధకులు, ప్రొఫెసర్లు రచించిన అరుదైన విషయాలను సంకలనం చేస్తూ మోనోగ్రాఫ్‌ను తీసుకువచ్చింది. తపాల శాఖ డైరెక్టర్ సందేశ్ మహదేవప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ (విజయవాడ) జి.శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

45 మంది ఆర్ఐల బదిలీ

సాక్షి, అమరావతి: ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో 45 మంది రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లను (ఆర్ఐలను) ప్రభుత్వం బదిలీ చేసింది. మల్టీ జోనల్ విధానంలో వారిని బదిలీ చేస్తూ మంగళవారం పోలీస్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

అదనపు వసతుల కల్పనకు రూ.10 కోట్లు

రాష్ట్రంలో క్యాన్సర్ వైద్య సేవల పరిపుష్టికి ప్రభుత్వం చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్యాన్సర్ వైద్య సేవలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కర్నూల్‌లో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అదనపు వసతుల కల్పన కోసం రూ.10 కోట్లకు పరిపాలన అనుమతులను ఇచ్చింది. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెంటివ్, కంట్రోల్ క్యాన్సర్, డయాబెటీస్, కార్డియో వ్యాస్కులర్ డిసీజెస్, స్ట్రోక్స్(ఎన్‌పీసీడీసీఎస్) కింద రూ.90 కోట్లతో కర్నూల్ జీజీహెచ్‌లో స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆస్పత్రి భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అధునాతన వైద్య పరికరాలను సైతం ప్రభుత్వం సమకూరుస్తోంది. ఈ ఆస్పత్రిలో అదనపు వసతుల కల్పన కోసం మరో రూ.10 కోట్లను వెచ్చిస్తున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మరోసారి స్పీకర్ నోటీసులు

- ఫిబ్రవరి 5లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- 8న విచారణ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ తరఫున శాసనసభకు ఎన్నికై టీడీపీలోకి ఫిరాయించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిపై అనర్హత వేటు వేయాలని ఆ పార్టీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దాఖలు చేసిన పిటిషన్లపై ఆ ఎమ్మెల్యేలకు స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం మరోసారి నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 5వ తేదీలోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించారు. ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలతో పాటు అనర్హత పిటిషన్ దాఖలు చేసిన చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజును కూడా ఫిబ్రవరి 8న స్పీకర్ విచారించనున్నారు. ఐదుగురి వివరణ తీసుకుని.. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోనున్నారు. టీడీపీ నుంచి శాసనసభకు ఎన్నికై.. ఆ పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీకి దూరమైన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని టీడీపీ విప్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా స్పీకర్ తమ్మినేని స్పందించారు. ఆ నలుగురు ఎమ్మెల్యేలకు కూడా ఇదే రీతిలో నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా...

16న తిరుమలలో రథసప్తమి



తిరుమల: ఫిబ్రవరి 16న తిరుమలలో రథసప్తమిని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఆ రోజు మలయప్ప స్వామి వారు సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం స్వామి వారికి చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ పర్వదినం కారణంగా ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల పొడిగింపు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాలకు నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 27 వరకు విశాఖపట్నం-సికింద్రాబాద్ (08579), ఫిబ్రవరి 8 నుంచి మార్చి 28 వరకు సికింద్రాబాద్-విశాఖపట్నం (08580), ఫిబ్ర వరి 5 నుంచి మార్చి 25 వరకు విశాఖపట్నం-తిరుపతి (08583), ఫిబ్రవరి 6 నుంచి మార్చి 26 వరకు తిరుపతి-విశాఖపట్నం (08584), ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు విశాఖపట్నం-బెంగళూరు (08543), ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 1 వరకు బెంగళూరు-విశాఖపట్నం (08544), ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు భువనేశ్వర్-తిరుపతి (02809), ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు తిరుపతి-భువనేశ్వర్ (02810), ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 29 వరకు పాట్నా-సికింద్రాబాద్ (03253), ఫిబ్రవరి 7 నుంచి మే 1 వరకు హైదరాబాద్-పాట్నా (07255), ఫిబ్రవరి 9 నుంచి ఏప్రిల్ 26 వరకు సికింద్రాబాద్-పాట్నా (07256), ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 25 వరకు ధనాపూర్-సికింద్రాబాద్ (03225), ఫిబ్రవరి 4 నుంచి ఏప్రిల్ 28 వరకు సికింద్రాబాద్-ధనాపూర్ (03226), ఫిబ్రవరి 7 నుంచి ఏప్రిల్ 28 వరకు బెంగళూరు-ధనాపూర్ (03242) రైళ్లను పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

విజయవాడ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): సౌత్ ఈస్టర్న్ రైల్వేలోని పలు సెక్షన్లలో జరుగుతున్న నిర్వహణ పనుల కారణంగా విజయవాడ డివిజన్ మీదుగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఫిబ్రవరి 2న నర్సాపూర్-హుబ్లీ (17225), ఫిబ్రవరి 3న హుబ్లీ-నర్సాపూర్ (17226), హుబ్లీ-గుంతకల్లు (07337), గుంతకల్లు-హుబ్లీ (07338), బల్గెవి-కాజీపేట (07335), ఫిబ్రవరి 4న కాజీపేట-బల్గెవి (07336) రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

బోయలపల్లెలో కాకతీయ శాసనం గుర్తింపు



యర్రగొండపాలెం: ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం, బోయలపల్లెలోని ఎగువ చెరువు తూము వద్ద 12వ శతాబ్దపు నాటి కాకతీయ శాసనాన్ని గుర్తించినట్టు చారిత్రక పరిశోధకుడు శ్రీనివాస ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ శాసన ఫొటోలను ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపించగా, ఆయన శాసనాన్ని పరిశీలించి కాకతీయ సామంతరాజు గంగయ సాహిణీ శాసనంగా నిర్ధారించారని ఆయన తెలిపారు.

గ్రామ పంచాయతీలకు గ్రేడ్ -5 కార్యదర్శులు



గ్రేడ్ 1-4 కార్యదర్శుల తరహాలో డీడీవో బాధ్యతలు

- సచివాలయాలు, పంచాయతీల మధ్య మరింత సమన్వయం
- నేడు రాష్ట్ర మంత్రివర్గ భేటీలో చర్చకు రానున్న ప్రతిపాదనలు
- పంచాయతీ వ్యవస్థలో పాలనాపరంగా కీలక మార్పులు
- రెగ్యులర్ ఉద్యోగుల నెలవారీ జీతాల బిల్లుల అధికారం సర్పంచ్‌లకు

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీలు, సచివాలయాల మధ్య మరింత సమన్వయం తెస్తూ పాలనాపరంగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా ఒక పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండేలా ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శుల హోదాలో పని చేస్తున్న వారికి అవకాశం కల్పించనుంది. మిగిలిన నాలుగు కేటగిరీ పంచాయతీ కార్యదర్శుల తరహాలోనే వారికి డీడీవో అధికారాలను కల్పించనున్నారు. గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఆయా పంచాయతీల బాధ్యతలను అప్పగించనున్నారు. ఈమేరకు సిద్ధం చేసిన ప్రతిపాదనలు బుధవారం మంత్రివర్గ సమావేశంలో తుది ఆమోదం కోసం చర్చకు రానున్నాయి.

సచివాలయాలతో పాటు గ్రేడ్ – 5 కార్యదర్శుల నియామకం

2019లో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుకు ముందు గ్రామ పంచాయతీల్లో గ్రేడ్ 1, 2, 3, 4 కేటగిరీ పంచాయతీ కార్యదర్శులు మాత్రమే విధులు నిర్వహించారు. చిన్నవైతే మూడు నాలుగు పంచాయతీలకు కలిపి ఒకే కార్యదర్శి బాధ్యతలు నిర్వహించేవారు. పంచాయతీరాజ్ శాఖ దీన్ని క్లస్టర్ పంచాయతీ విధానంగా వ్యవహరిస్తోంది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున సచివాలయాల వ్యవస్థతోపాటు గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల నియామకాన్ని కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. నాటి నుంచి గ్రేడ్ – 1 పంచాయతీ కార్యదర్శి మొదలు కొత్తగా నియమితులైన గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శి వరకు ఆయా సచివాలయాల్లో కార్యదర్శి హోదాలోనే విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయాల ద్వారా అందజేసే 545 రకాల ప్రభుత్వ సేవలతో సహా ప్రతి కార్యక్రమాన్ని వారికే అప్పగించారు. పంచాయతీ వ్యవస్థకు సంబంధించిన కార్యకలాపాలు మాత్రం పాత క్లస్టర్ విధానంలోనే కొనసాగుతున్నాయి.

మిగతా కార్యదర్శుల మాదిరిగానే..

సచివాలయాల ఏర్పాటు సమయంలో గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులకు మిగిలిన నాలుగు కేటగిరీ ఉద్యోగుల మాదిరిగానే జాబ్‌చార్టు నిర్ధారించినా ప్రొబేషన్ ఖరారు కానందున పంచాయతీ బిల్లులు తయారీ లాంటి డీడీవో అధికారాలను మాత్రం పూర్తి స్థాయిలో అప్పగించలేదు. ఇప్పుడు సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులకు కూడా 1–4 గ్రేడ్ కేటగిరీ పంచాయతీ కార్యదర్శుల తరహాలోనే అన్ని రకాల డీడీవో అధికారాలు దక్కుతాయి. తద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా ఒక కార్యదర్శిని కేటాయించడం ద్వారా పంచాయతీల కార్యకలాపాల నిర్వహణలో వేగం పెరిగే అవకాశం ఉంటుంది.

సర్పంచ్‌లకూ అదనపు అధికారాలు!

ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రేడ్ – 1 మొదలు గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులకు అదనపు అధికారాలు దక్కడంతో పాటు సర్పంచ్‌లకు కూడా మరిన్ని అధికారాలు లభించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. పంచాయతీ రెగ్యులర్ ఉద్యోగుల (010 పద్దు ఉద్యోగులు) నెలవారీ జీతాల బిల్లులను ప్రతిపాదించే అధికారం కార్యదర్శులతో పాటు సర్పంచ్‌లకు ఉమ్మడిగా మేకర్, చెక్కర్ హోదాలో లభించనుంది. రాష్ట్రంలో 500 పైబడి జనాభా ఉండే ప్రతి గ్రామ పంచాయతీకీ సచివాలయ కార్యదర్శిగానూ, పంచాయతీ కార్యదర్శిగానూ ఒక్కరే కొనసాగనున్నారు. ఆయా పంచాయతీల పరిమాణాన్ని బట్టి కార్యదర్శులకు బాధ్యతలు కేటాయిస్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెలకొల్పిన సచివాలయాల వ్యవస్థ ద్వారా కొత్తగా ఉద్యోగాలు పొందిన వేలాది మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు తమ కు చిన్న పంచాయతీల బాధ్యతలు కూడా అప్పగించాలని చాలా కాలంగా కోరుతున్నారు. ఇప్పుడు వారికి కోరిక నెరవేరుతుండటంతో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో.. పులొచ్చింది!

- కొత్తగూడెంలో దూడను చంపి తినేసిన పెద్ద పులి
- భయంతో చెట్టెక్కి కూర్చున్న రైతు
- తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల ప్రజల్లో భయాందోళన





చెట్టెక్కిన బాలసుందరం, పులి పాదముద్ర

ద్వారకాతిరుమల: పెద్ద పులి.. కొద్ది రోజులుగా తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలను భయకంపితులను చేస్తోంది. తాజాగా మంగళవారం తెల్లవారుజామున ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం రామసింగవరం పంచాయతీ, కొత్తగూడెంలోకి వచ్చిన పెద్ద పులి ఒక దూడను చంపి తినేసింది. వివరాల్లోకి వెళితే.. కొత్తగూడెం గ్రామానికి చెందిన రైతు ముక్కవల్లి బాలసుందరం గేదెల నుంచి పాలు తీసేందుకు తెల్లవారుజామున తన తోటలోకి వెళ్లాడు. అప్పటికే అక్కడ కట్టేసి ఉన్న గేదెలు, దూడలు బెదిరిపోయి అరుస్తుండడాన్ని గమనించాడు. వాటిలో ఒక గేదె దూడ లేకపోవడాన్ని గుర్తించాడు. దూడ కోసం వెతుకుతుండగా సమీప పొదల్లోంచి పులి గాండ్రింపులు వినబడడంతో వెంటనే అక్కడున్న జీడి మామిడి చెట్టెక్కి కూర్చున్నాడు. ఏం చేయాలో పాలుపోక తన వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారా స్థానిక రైతులకు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. ఆనోటా ఈనోటా చుట్టుపక్కల గ్రామాలకు సైతం ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో పెద్ద ఎత్తున ప్రజలు అక్కడికి చేరుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్‌వో నాగరాజు, జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో ఎ.వెంకట సుబ్బయ్య, ఏలూరు సబ్ డీఎఫ్‌వో ఆర్.శ్రీదేవి, ఏలూరు ఎఫ్ఆర్‌వో ఎస్‌వీకే కుమార్, నూజివీడు ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పులి జాడలు, దూడ రక్తం, ఎముకలు వారికి కనిపించాయి. పులి పరిసర ప్రాంతాల్లోనే ఉన్న ట్లు నిర్ధారించిన అధికారులు దాని కోసం గా లించారు. అవసరాన్ని బట్టి బోను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను అమర్చారు. గ్రామస్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెంలో టాంటాం వేయించారు. ఘటనపై రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఆరా తీయగా, పులి రామసింగవరం అడవిలోకి వెళ్లిపోయిందని ఆయన తెలిపారు.

చంద్రబాబు పచ్చి మోసకారి, ఊసరవెల్లి

మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన



నరసన్నపేట: చంద్రబాబు పచ్చి మోసకారి అని, అవసరముంటే ఒకలా.. అవసరం తీరాక మరోలా వ్యవహరించగలిగే ఊసరవెల్లి అని నరసన్నపేట ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో అధికారానికి బాబు వచ్చారని, నమ్మిన వారిని నట్టేట ముంచడంలో ఆయన మహా ఘనుడన్నారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం ఉర్లాంలో ఆసరా ఉత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. పేదలను, నిరుద్యోగులను మోసం చేశారని దుయ్యబట్టారు.

ఏసీబీ వలలో జిల్లా మలేరియా అధికారి

- పీఆర్సీ అరియర్స్ బిల్లులో 25 శాతం లంచం అడిగిన డీఎంవో జ్ఞానశ్రీ
- ఆమెతో పాటు.. అసిస్టెంట్ జిల్లా అధికారి శీనయ్య అరెస్టు





డీఎంవో జ్ఞానశ్రీ, ఏడీఎంవో శీనయ్య

ఒంగోలు టౌన్: పీఆర్సీ అరియర్స్ బిల్లు మంజూరు చేసేందుకు 25 శాతం లంచం డిమాండ్ చేసిన ప్రకాశం జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, ఆమెకు సహకరించిన అసిస్టెంట్ జిల్లా అధికారి శీనయ్యను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ వల్లూరి శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని దోర్నాల పీహెచ్‌సీలో మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఇజ్రాయిల్‌కు 2015–21 పీఆర్సీ అరియర్స్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని జిల్లా మలేరియా అధికారిణి జ్ఞానశ్రీని పలుమార్లు కలిసి విన్నవించుకున్నా పట్టించుకోలేదు. పెండింగ్ బిల్లులో 25 శాతం లంచం ఇస్తే తాను బిల్లు మంజూరు చేస్తానని డిమాండ్ చేశారు. దాంతో ఇజ్రాయిల్ తనకు రావాల్సిన అరియర్స్‌తో పాటు..తన అర్హతల ప్రకారం పదోన్నతి కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలతో స్పందించిన రీజినల్ డైరెక్టర్, ఇజ్రాయిల్ అరియర్స్ డబ్బులు ఎందుకు మంజూరు చేయలేదో వివరణ ఇవ్వాల్సిందిగా డీఎంఓకు మెమో ఇచ్చారు. అలాగే కోర్టులో కౌంటర్ దాఖలు చేసేందుకు గానూ రిమార్క్స్ అడిగారు. ఈ క్రమంలో అనివార్య పరిస్థితుల్లో ఇజ్రాయిల్ అరియర్స్ పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తూ సంతకం చేశారు. బిల్లు డబ్బులు బ్యాంకులో జమ అయిన వెంటనే తనకు లంచం డబ్బులు ఇవ్వాలని కోరారు. ఈనెల 10వ తేదీ అరియర్స్ తాలుకు రూ.16,83,103 బ్యాంకులో జమయ్యాయి. జిల్లా కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ జరిగిన మీటింగ్‌కు హాజరయ్యేందుకు ఇజ్రాయిల్ ఒంగోలుకు వచ్చారు. మీటింగ్ అయిపోయాక తన ఇంటికి వచ్చి కలవాలని డీఎంఓ జ్ఞానశ్రీ అతడిని ఆదేశించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి శీనయ్యను ఇందుకు పురమాయించారు. దాంతో ఇద్దరూ కలిసి జ్ఞానశ్రీ ఇంటికి బయలు దేరారు. మార్గమధ్యలో ఉండగా ఫోన్ చేసిన డీఎంఓ తాను ఇంట్లో లేనని, వర్మాస్ హోటల్‌కు వచ్చి కలవాలని చెప్పారు. అక్కడ బిల్లుల డబ్బులు బ్యాంకులో పడ్డాయి కనుక ముందుగా చెప్పిన ప్రకారం తనకు బిల్లు మొత్తంలో 25 శాతం రూ.4 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. అతడి డైరీలో ఉన్న చెక్‌బుక్కును చూసి ఆమె చెక్కు రాసివ్వాలని డిమాండ్ చేశారు. చెక్ చెల్లదని చెప్పడంతో ఏటీఎం, పేటీఎంల ద్వారా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. అయితే రూ.4 లక్షలు ఇవ్వలేనని బతిమాలు కోవడంతో చివరికి రూ.1.40 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అనంతరం ఇజ్రాయిల్ ఏసీబీని ఆశ్రయించారు. మంగళవారం జ్ఞానశ్రీకి డబ్బులు ఇస్తానని చెప్పడంతో వాటిని తీసుకునేందుకు అసిస్టెంట్ మలేరియా అధికారి శీనయ్యను సమీపంలోని సూపర్ బజార్ వద్దకు పంపించారు. అక్కడ ఇజ్రాయిల్ నుంచి డబ్బులు తీసుకుంటున్న శీనయ్యను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత జిల్లా మలేరియా కార్యాలయానికెళ్లి డీఎంవో జ్ఞానశ్రీని కూడా అదుపులోకి తీసుకున్నారు.

విమానం ల్యాండింగ్‌లో అంతరాయం

ఉలిక్కిపడిన ఇండిగో విమాన ప్రయాణికులు

విమానాశ్రయం(గన్నవరం): హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ల్యాండింగ్ సమయంలో ప్రయాణికులు భయాందోళనకు గురైన ఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఇండిగో సంస్థకు చెందిన ఏటీఆర్ 72-600 విమానం హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో ఉదయం 11 గంటలకు ఇక్కడికి చేరుకుంది. రన్ వేపై దిగేందుకు దగ్గరగా వచ్చిన సమయంలో పైలెట్లు ఒక్కసారిగా విమానాన్ని తిరిగి గాల్లోకి లేపడంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. ఐదు నిమిషాల వ్యవధిలో విమానాన్ని తిరిగి సురక్షితంగా రన్‌వేపై ల్యాండింగ్ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే రన్‌వేపై ల్యాండింగ్ అయ్యే ప్రాంతం కంటే ముందుకు విమానం రావడంతో పైలెట్లు భద్రత ప్రమాణాల్లో భాగంగా వెంటనే టేకాఫ్ తీసుకున్నట్లు ఎయిర్‌పోర్ట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే విమానంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కూడా ఉన్నారు.

సెర్ప్ ఉద్యోగులు ఆందోళనలు విరమించాలి

కాకర్ల వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పే స్కేల్ అమలు తదితర డిమాండ్లతో ధర్నా చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు తమ ఆందోళనలు విరమించాలంటూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సెర్ప్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆయా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులతో ఇప్పటికే చర్చలు జరిపారని, ఉద్యోగుల డిమాండ్లను పరిశీలించి తగు సూచనలు ఇవ్వవలసిందిగా మంత్రి వర్గ ఉపసంఘానికి నివేదిస్తామని సజ్జల హామీ ఇచ్చారని వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సెర్ప్ ఉద్యోగులంటే ప్రత్యేకమైన అభిమానం ఉందని.. అందుకే సెర్ప్ పరిధిలో పని చేసే 27 వేల మందికిపైగా వీవోఏల గౌరవ వేతనాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3000 నుంచి ఒక్కసారిగా ఎనిమిది వేలకు పెంచారని గుర్తు చేశారు. అలాగే సెర్ప్ పరిధిలో పనిచేసే మిగతా ఉద్యోగులకు జీతాలను కూడా 23 శాతం పెంచారని గుర్తు చేశారు. ఇంత మంచి చేసిన ముఖ్యమంత్రికీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ధర్నాలు ఆందోళనలు చేయడం సముచితం కాదని.. ఆందోళన విరమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మైనర్‌ను మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: ప్రేమ పేరుతో మైనర్‌కు దగ్గరై.. ఆమెను గర్భవతిని చేసిన ఆటో డ్రైవర్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ వాంబేకాలనీకి చెందిన 15 ఏళ్ల బాలిక వన్‌టౌన్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పని చేసేది. రోజూ దుకాణానికి వెళ్లి వచ్చే క్రమంలో పాయకాపురానికి చెందిన ఆటో డ్రైవర్ సురేంద్రతో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించి శారీరకంగా దగ్గరయ్యాడు. గర్భం దాల్చిన తరువాత మొహం చాటేశాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. 2017 ఫిబ్రవరి 4వ తేదీన వెలుగు చూసిన ఈ ఘటనపై నున్న పోలీసులు కేసు నమోదు చేసి సురేంద్రను కోర్టులో హాజరు పరిచారు. బాధితురాలి తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి వాదనలు వినిపించారు. 17 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు సురేంద్రకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 30 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలి కుటుంబానికి నష్టపరిహారంగా మరో రూ. 4 లక్షలు కూడా చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు దుష్టశక్తులు ఏకమవుతున్నాయి

ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జాన్ బెన్నీ లింగం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని కూల్చడానికి దుష్ట శక్తులన్నీ ఏకమవుతున్నాయని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జాన్ బెన్నీ లింగం కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ కోర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో దైవ సేవకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్రైస్తవులపై విషం కక్కుతూ గతంలో ఎన్నో వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అటువంటివారు ఈ రోజున ఓట్ల కోసం క్రైస్తవ నాయకుల సమావేశాలు ఏర్పాటు చేయడం వారి నీచబుద్ధికి నిదర్శనమన్నారు కాంగ్రెస్ పార్టీకి చెందిన షర్మిల భర్త అనిల్ కుమార్ రాష్ట్రంలోని క్రైస్తవులను నమ్మించి 50 వేల మందికిపైబడి పాస్టర్ల దగ్గర నుంచి మందిర నిర్మాణాల కోసం విరాళాలను సేకరించి వారికి మొండి చెయ్యి చూపించారని వివరించారు. బ్రదర్ అనిల్ కుమార్, షర్మిల కలిసి క్రైస్తవ ఓట్లను కొల్లగొట్టేందుకు డబ్బులు ఎరగావేసి ముందుకొస్తున్నారని, వారిని తిప్పికొట్టి మళ్లీ జగనన్న ప్రభుత్వం కోసం ప్రతి క్రైస్తవుడు కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ సువార్తకురాలు డాక్టర్ విమలారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మంచి ప్రార్థనాపరులని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న వీరుడని కొనియాడారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.99 కోట్లు

- 648 గ్రాముల బంగారం, 5.610 కిలోల వెండి
- భారీగా విదేశీ కరెన్సీ నోట్లు లభ్యం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.2.99 కోట్ల నగదు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో మంగళవారం కానుకల లెక్కింపు నిర్వహించారు. 20 రోజుల్లో రూ. 2,99,68,935 నగదుతో పాటు 648 గ్రాముల బంగారం, 5.610 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు. యూఎస్‌కి చెందిన 542 డాలర్లు, కెనడాకు చెందిన వంద డాలర్లు, యూఏఈకి చెందిన 105 దిర్హమ్స్, సౌత్ ఆఫ్రికాకు చెందిన 100 రాన్డ్‌లు, ఖతార్‌కు చెందిన 55 రియాల్స్, సింగపూర్‌కు చెందిన 35 డాలర్లతో పాటు ఇతర దేశాలకు చెందిన డాలర్లు భారీగానే కానుకలుగా అందాయి. ఈ-హుండీ ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రూ.67,230 కానుకలుగా సమర్పించారు. కానుకల లెక్కింపును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య పర్యవేక్షించారు.



ఇంద్రకీలాద్రిపై కానుకల లెక్కింపు

మధ్యంతర బడ్జెట్ – ఈ ఐదింటిపై ఆశలొద్దు!

కేంద్ర బడ్జెట్ పేరు వినగానే మధ్య తరగతి ప్రజల్లో ఒకింత ఉత్సుకత మొదలవడం సహజం. పన్ను శ్లాబులు తగ్గిస్తారనో, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే చర్యలేవో తీసుకుంటారనో ఆశ పడుతుంటారు. మహిళలు, యువత కోసం ప్రత్యేక పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందేమోనని ఎదురు చూస్తుంటారు. మధ్యంతర బడ్జెట్ అయినా సామాన్య ప్రజానీకం మొదలు కార్పొరేట్ వర్గాల దాకా అందరి అంచనాలు భారీగానే ఉన్నాయి. మూడు, నాలుగు నెలల్లో ఎన్నికలు ఉండటంతో ఎన్నికల తాయిలాలు బడ్జెట్‌లో కనిపించవచ్చని అందరి అంచనా. అయితే ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టే 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఒక ఐదు అంశాలపై ఆశలు పెట్టుకోకపోవడమే ఉత్తమం అని వారు సెలవిస్తున్నారు. ఆ ఐదేంటో ఓసారి చూసేద్దాం.

– సాక్షి, నేషనల్ డెస్క్

1. ప్రభుత్వ విధానపర నిర్ణయాలు

త్వరలో లోక్‌సభ ఎన్నికలున్నాయి. విపక్షాల 'ఇండియా' కూటమి గెలిస్తే ఈ మధ్యంతర బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యాలను కొత్త ప్రభుత్వం నెరవేరుస్తుందన్న గ్యారెంటీ లేదు. అందుకే దీర్ఘకాలిక ఆర్థిక సంస్కరణల జోలికి వెళ్లకుండా ఇప్పటి పద్దుల సంగతే చూడాలని ప్రభుత్వం భావిస్తోందట. అందుకే ప్రభుత్వం ఎలాంటి నూతన ప్రతిష్టాత్మక పథకాలను ప్రారంభించదల్చుకోలేదని కొందరు ఆర్థిక వేత్తలు అంచనావేస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏమీ ఉండబోవని ఇప్పటికే విత్త మంత్రి నిర్మల సెలవివ్వడం గమనార్హం. ప్రస్తుత ఖర్చుల మీద మాత్రమే దృష్టిపెడతామని ఆమె ప్రకటించారు.

2. పన్ను మినహాయింపులు

పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భాల్లో మాత్రమే పన్ను శ్లాబుల్లో మార్పుల వంటి కీలక నిర్ణయాలను ప్రభుత్వాలు ప్రకటించడం చూశాం. ఇది మధ్యంతర బడ్జెట్ కాబట్టి పన్ను శ్రేణుల్లో సవరణలు ఆశించలేమని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. అంటే పన్ను శ్లాబుల్లో మార్పులు రావాలంటే కొత్త ప్రభుత్వం కొలువుతీరాక వచ్చే పూర్తి బడ్జెట్ దాకా వేచి ఉండక తప్పదు.

3. నూతన సంక్షేమ పథకాలు

కొత్త సంక్షేమ పథకానికి రూపకల్పన చేయాలంటే చాలా సమయం పడుతుంది. మూడోసారి హ్యాట్రిక్ కొట్టి కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడంపై దృష్టిపెట్టిన బీజేపీ.. కొత్త పథకాలను పట్టించుకోదనే వాదన ఉంది. నూతన సంక్షేమ పథక రచనకు విస్తృతస్థాయి సంప్రదింపులు జరగాలి. ఎన్డీఏ కూటమికి అంత వ్యవధిలేదని మూడోసారి గెలిచాక వాటి సంగతి చూసుకుందామనే ధోరణి బీజేపీలో కనిపిస్తోందని ఒక రాజకీయ విశ్లేషకుడు అంచనావేశారు. కొత్త సంక్షేమ పథకం ప్రకటించి అమలుచేయాలంటే అందుకు తగ్గ ఆర్థికవనరులనూ సమకూర్చుకోవాల్సిందే. అంటే పూర్తి బడ్జెట్ స్థాయిలో కేటాయింపులు జరగాలి. మధ్యంతర బడ్జెట్‌లో అది సాధ్యమేనా అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. అందుకే కొత్త సంక్షేమ పథకాల పాట బీజేపీ పాడదని మాట వినిపిస్తోంది.

4. ద్రవ్యలోటు కట్టడి చర్యలు

ద్రవ్యలోటును తగ్గించుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవడం వంటి చర్యలకు ఉపక్రమించాలి. ఆ పని చేయాలంటే సంబంధిత అన్ని శాఖలతో విస్తృతస్థాయి సంప్రతింపులు అవసరం. అత్యంత కఠిన ఆర్థిక క్రమశిక్షణ పేరుతో ద్రవ్యలోటు కట్టడి చర్యలకు దిగితే దాని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. సార్వత్రిక ఎన్నికలపై పూర్తిగా దృష్టిపెట్టే సర్కార్ మళ్లీ ద్రవ్యలోటు అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటుందా లేదా అనేది తెలియాల్సిఉంది. ద్రవ్యలోటు భారాన్ని దింపేందుకు మధ్యంతర బడ్జెట్ సరైన వేదిక కాదనే భావన ఉండొచ్చు.

5. నూతన ఆర్థిక విధానాలు

చాలా నెలలుగా అమలవుతోన్న ఆర్థిక విధానాల్లో సమూల మార్పులు తెస్తూ ప్రకటించే నూతన ఆర్థిక విధానాలు వ్యవస్థను ఒక్కసారిగా కుదుపునకు గురిచేస్తుంది. ఇలాంటి ప్రయోగాలు సాధారణంగా పూర్తిస్థాయి బడ్జెట్‌లోనే చేస్తారు. మధ్యంతర బడ్జెట్‌కు ఈ ఫార్ములా నప్పదు అనే అభిప్రాయం ఒకటి ఉంది. దీర్ఘకాలిక ప్రణాళికలు, సంబంధిత రంగాల సంస్థలతో చర్చోపచర్చల తర్వాతే మామూలుగా ఇలాంటి నూతన ఆర్థిక విధానాలను ప్రకటిస్తారు. నూతన ఆర్థిక విధానాలు ప్రకటిస్తే స్టాక్ మార్కెట్లు స్పందించడం సర్వసాధారణం. సానుకూలమో, ప్రతికూలమో, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోవడమో.. ఇంకేదైనా జరగొచ్చు. ఇలాంటి సాహసోపేత నిర్ణయాల అమలుకు మధ్యంతర బడ్జెట్‌ను ప్రభుత్వం వాడుకుంటుందో లేదో వేచి చూడాల్సిందే.

అయినా కొన్ని అంచనాలు..



1. పెట్రోల్, డీజిల్ ధరలను కిందకు దించుతారని ఆశలూ ఎక్కువయ్యాయి. అధిక పెట్రో ధరల కారణంగా ప్రభుత్వ చమురు రిటైల్ కంపెనీలు ఇటీవలికాలంలో అధిక లాభాలను కళ్లజూశాయి. ఈ లాభాలను పౌరులకు కాస్తంత మళ్లించే యోచన ఉందట. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ. 5–10వరకు తగ్గించవచ్చని అనుకుంటున్నారు. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం తగ్గించడం, విద్యుత్ వాహనాలకు రాయితీ పొడిగింపు వంటి ప్రకటనలు బడ్జెట్ రోజు వెలువడొచ్చని భావిస్తున్నారు.

2. పట్టణవాసులు భారీ లబ్ధి చేకూరేలా నివాస గృహాలపై తక్కువ వడ్డీకే రుణాలు అందించవచ్చని భావిస్తున్నారు. సబ్సిడీతో పీఎం ఆవాస్ యోజన తరహా కొత్త పథకం తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా పథకం అమలుచేస్తే బాగుంటుందని మంత్రి గతంలో వ్యాఖ్యానించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

3. దేశవ్యాప్తంగా అమలవుతున్న కేంద్ర పథకం పీఎం– కిసాన్ కింద ఇచ్చే నగదు మొత్తాన్ని మరింత పెంచుతారని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇంతకంటే ఎక్కువ మొత్తం ఇస్తున్నాయి. అందుకే పీఎం–కిసాన్ నగదు సాయాన్ని అధికం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని వార్తలొచ్చాయి. ఈ ఆలోచన బడ్జెట్‌లో ఆచరణాత్మకం అవుతుందో లేదో చూడాలి. పీఎం కిసాన్ మొత్తాన్ని దాదాపు రూ.9,000కు పెంచే వీలుందని సమాచారం.

4. గత బడ్జెట్‌లో మధ్యతరగతి కుటుంబాలకు పన్ను రిబేట్‌ను ఏకంగా రూ.7,00,000 పెంచడం వంటి చాలా కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. దీంతో ఈసారి అలాంటి కలలనే మధ్యతరగతి కుటుంబాలు కంటున్నాయి. ఆదాయంపై స్టాండర్డ్ డిడక్షన్ (ప్రామాణిక తగ్గింపు) ప్రస్తుతం రూ. 50 వేలుగా ఉంది. కొత్త, పాత పన్ను విధానాల్లో ఈ డిడక్షన్‌ను రూ.1,00,000కు పెంచాలని మధ్యాదాయ వర్గాలు అభిలషిస్తున్నాయి..

5. బ్యాంకు ఖాతాదారులకు పన్ను మినహాయింపులు పెరగొచ్చని మరో అంచనా. వీరి సేవింగ్స్ ఖాతా వడ్డీపైనా స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ.50,000కు పెంచుతారని ఆశిస్తున్నారు.

6. ఆదాయపు పన్ను చట్టంలో ముఖ్యమైనదైన సెక్షన్–80సీ కింద ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇస్తున్నారు. పొదుపు పథకాల్లో పెట్టుబడులు, జీవిత బీమా చందా చెల్లింపులు, ట్యూషన్ ఫీజులు, గృహ రుణాల చెల్లింపులు, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు అన్నీ దీని కిందికే వస్తాయి. కాబట్టి ఈ మొత్తాన్ని రూ. 3,00,000కు పెంచాలనే డిమాండ్లు ఎక్కువయ్యాయి.





నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

రేపు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ • ఫిబ్రవరి 9 వరకు జరగనున్న సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కానుండగా, తొలి రోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తొలిసారి పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రారంభోపాన్యాసం చేయనున్నారు. ఈసారి ఆర్థిక సర్వే నివేదికను విడుదలచేయట్లేదని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. గురువారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. తొలి రెండు రోజులు ఉభయసభల్లో జీరో అవర్, క్వశ్చన్ అవర్‌ను ఇప్పటికే రద్దు చేస్తూ బులిటెన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఆ తర్వాత రాజ్యసభ, లోక్‌సభలో దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటుచేసిన నేపథ్యంలో సాంకేతికంగా రాష్ట్రపతిపాలనలో ఉన్న ఆ ప్రాంతానికి సంబంధించిన జమ్మూకశ్మీర్ బడ్జెట్‌నూ ఆర్థిక మంత్రి నిర్మల లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

వాడీవేడిగా చర్చలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు కేంద్రాన్ని నిలదీసేందుకు విపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. నిరుద్యోగిత, అధిక ధరలు, ఆర్థిక అసమానతల కారణంగా రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు, జాతుల ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్ అంశాలపై మోదీ సర్కార్‌ను విపక్షాలు నిలదీయనున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం అంశం సైతం ప్రధానంగా విపక్షాలు ప్రస్తావించవచ్చు. ఢిల్లీలో మద్యం కేసులో ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై, భూమికి ఉద్యోగం కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్‌పై ఈడీ, సీబీఐ కేసులనూ విపక్షాలు పార్లమెంట్‌లో లేవనెత్తనున్నాయి. జార్ఖండ్ సీఎంసోరెన్‌పై, తమిళనాడులో డీఎంకే నేతలపై ఈడీ, సీబీఐ వరుస దాడులను విపక్షాలు పార్లమెంట్‌లో ప్రధానంగా ప్రస్తావించనున్నాయి. పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన కేంద్ర నిధులను మోదీ సర్కార్ మంజూరుచేయకుండా ఆపేస్తోందని, ఈ అంశంలో కేంద్రాన్ని నిలదీస్తానని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుదీప్ బంధోపాధ్యాయ్ చెప్పారు.

14 మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేత

గత పార్లమెంట్ సమావేశాల్లో సస్పెండ్ అయిన వారిలో 14 మంది విపక్ష సభ్యులు ఈసారి సెషన్‌లో పాల్గొననున్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. సమావేశాల్లోకి రాకుండా గతంలో వీరిపై విధించిన నిషేధ కేసును సభాహక్కుల కమిటీలకు పంపామని, మా అభ్యర్థనతో ఆ కమిటీల చైర్మన్లు వీరి సస్పెన్షన్‌ను ఎత్తేశారని మంత్రి వెల్లడించారు. సస్పెన్షన్ ఎత్తేసిన 14 మందిలో 11 మంది రాజ్యసభ, ముగ్గురు లోక్‌సభ సభ్యులున్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో భద్రతా వైఫల్యం అంశాన్ని ఎత్తిచూపుతూ లోక్‌సభ, రాజ్యసభ లోపల ప్లకార్డులు పట్టుకుని నినదించినందుకు కేంద్రం ఫిర్యాదుతో 100 లోక్‌సభ, 46 రాజ్యసభ సభ్యులు సస్పెన్షన్‌కు గురైన విషయం తెల్సిందే. ప్రతి ఒక్కరి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సభాపతులను కోరామన్నారు. వీరిలో 14 మంది క్షమాపణలు చెప్పడంతో వారికి మాత్రమే ఈ సెషన్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. బుధవారం నుంచి మొదలయ్యే పార్లమెంట్ ఇరు సభలకు తమ సభ్యులు ఎలాంటి ప్లకార్డులు తీసుకురారని విపక్ష పార్టీలు సమాచారం ఇచ్చాయని మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.

మణిపూర్‌లో మళ్లీ హింస.. ఇద్దరు మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో తాజాగా జరిగిన హింసాత్మక ఘటనలో ఇద్దరు గ్రామ వలంటీర్లు ప్రాణాలు కోల్పోయారు. ఇంఫాల్ వెస్ట్–కంగ్‌పోక్పి జిల్లాల సరిహద్దుల్లోని కడంగ్‌బంద్ గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సాయుధ దుండగులు వలంటీర్లపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులైన మరో ఇద్దరిని ఇంఫాల్‌కు తరలించామన్నారు. రెండు గ్రామాల వలంటీర్ల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయ న్నారు.

ఏ చర్చకైనా సిద్ధం

అఖిలపక్ష భేటీలో స్పష్టంచేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రతి అంశాన్ని చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్రం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ హాజరయ్యారు. ఈ భేటీకి కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీ(యూ), బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, తృణమూల్ కాంగ్రెస్, టీడీపీల పక్షనేతలు హాజరయ్యారు. కాంగ్రెస్ తరఫున కె.సురేశ్, ప్రమోద్ తివారీ, ఎన్సీపీ తరఫున శరద్ పవార్, తృణమూల్ తరఫున సుదీప్ బంధోపాధ్యాయ్, డీఎంకే తరఫున టీఆర్ బాలు, శివసేన తరఫున రాహుల్ శెవాలె, సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎస్‌టీ హసన్, జేడీ(యూ) తరఫున రామ్‌నాథ్ ఠాకూర్ తదితరులు హాజరయ్యారు. ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రభుత్వానికి అన్ని పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రులు ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా దేశం ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, రాష్ట్రాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని విపక్ష పార్టీల నేతలు కోరారు.

అస్సాంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా అక్కడి పోలీసుల హింసాత్మక దాడికి పాల్పడ్డారని, యాత్రను సజావుగా సాగనివ్వలేదని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అఖిలపక్ష భేటీలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని తివారీ ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై ప్రభుత్వం తన వైఖరిని తేటతెల్లం చేయాలని పలువురు విపక్ష సభ్యులు పట్టుబట్టారు.

తేజస్వీ యాదవ్‌ను ప్రశ్నించిన ఈడీ

పట్నా: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాదాపు 8 గంటలపాటు ప్రశ్నించారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు పట్నాలోని ఈడీ కార్యాలయం లోపలికి వెళ్లిన తేజస్వీ యాదవ్ రాత్రి 8 గంటల సమయంలో బయటకు వచ్చారు. విచారణాధికారులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు



ఇస్లామాబాద్: ఫిబ్రవరి 8న జరిగే ఎన్నికల్లో విజయం సాధించి, మళ్లీ అధికార పగ్గాలు చేపట్టాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(71)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికార పత్రాల లీకేజీ కేసులో ఆయనతో పాటు మాజీ విదేశాంగ మంత్రి మహ్మూద్ ఖురేషీకి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి అబ్దుల్ హస్నత్ మంగళవారం తీర్పు వెలువరించారు. రావల్పిండిలోని అడియాలా జైలులో కేసు విచారణ జరిగింది. అవినీతి ఆరోపణలపై ఇప్పటికే ఇమ్రాన్ మూడేళ్ల జైలు శిక్ష అనుభవించారు. ఒకవైపు, ఆయన పార్టీ ఎన్నికల గుర్తు క్రికెట్ బ్యాట్‌ను వాడరాదంటూ ఎన్నికల సంఘం నిషేధం విధించగా మరోవైపు ఇమ్రాన్, ఖురేషిలతోపాటు పార్టీకి చెందిన ఇతర ముఖ్య నేతల నామినేషన్ పత్రాలు సైతం తిరస్కరణకు గురయ్యాయి. గత ఏడాది ఆగస్టులో తోషఖానా అవినీతి కేసును విచారించిన కోర్టు ఇమ్రాన్ ఖాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ 2022 మార్చి 7వ తేదీన జరిగిన బహిరంగ సభలో ఒక లెటర్‌ను ప్రజలకు చూపుతూ..తన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాజకీయ విరోధులు ఓ విదేశంతో చేతులు కలిపారనేందుకు సాక్ష్యం ఇదేనని పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని రోజుల తర్వాత అమెరికా ప్రభుత్వం తనపై కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అనంతరం ఆయన పదవీచ్యుతుడయ్యారు. పాక్ మాజీ రాయబారి అమెరికా ఉన్నతాధికారితో జరిపిన భేటీకి సంబంధించిన ఆ పత్రాన్ని ఇమ్రాన్ బహిరంగంగా చూపడాన్ని రహస్య పత్రాల లీకేజీ నేరంగా పేర్కొంటూ గత ఏడాది ఆగస్టులో ఇమ్రాన్‌తోపాటు అప్పటి విదేశాంగ మంత్రి ఖురేషిపై కేసు నమోదైంది. మరో 9 రోజుల్లో ఎన్నికలు జరగనున్న సమయంలో ఇమ్రాన్, ఖురేషిలు జైలులోనే ఉన్నారు. తాజా తీర్పుతో వీరిద్దరూ అయిదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోనున్నారు.

నితీశ్‌తో ఇక పని లేదు: రాహుల్



పూర్ణియా(బిహార్): బిహార్ ప్రజలకు సామాజిక న్యాయం అందించేందుకు మహాఘట్‌బంధన్ పోరాటం కొనసాగిస్తుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఈ విషయంలో తమ కూటమికి సీఎం నితీశ్‌కుమార్‌తో ఇక అవసరమే లేదన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారం బిహార్‌లోని పూర్ణియా జిల్లాలో ప్రవేశించింది. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. 'పెద్ద సంఖ్యలో ఉన్న వెనుకబడిన వర్గాల ప్రజలకు ఏ రంగంలోనూ సరైన ప్రాతినిథ్యం లభించడం లేదు. మీడియాలో సైతం వారికి అన్యాయమే జరుగుతోంది. రిపోర్టర్ల స్థాయి నుంచి పైకి ఎదిగిన వారు చాలా అరుదు'అని చెప్పారు. 'దళిత, ఓబీసీ, గిరిజనజనాభా వివరాలు కచ్చితంగా నిర్ధారణ కావాలంటే కుల గణన అవసరం ఎంతో ఉంది. ఇది ఎక్స్ రే వంటిది. దీని తర్వాత ఎంఆర్ఐకి వెళతాం'అని రాహుల్ అన్నారు. బిహార్ రాజకీయ పరిణామాలను వివరిస్తూ రాహుల్.. 'మహాఘట్‌బంధన్‌లో కీలక భాగస్వామిగా ఉన్న ఆర్జేడీ, కాంగ్రెస్‌లు కుల గణన సర్వే చేపడతామన్న హామీ అమలు కోసం నితీశ్‌పై రాజీలేని ఒత్తిడి పెంచాయి. ఇది ఇష్టం లేని నితీశ్ భయపడ్డారు. కులగణనకు పూర్తి వ్యతిరేకమైన బీజేపీ సాయంతో ఆయన బయటపడ్డారు. తరచూ కూటములను మార్చే అలవాటున్న నితీశ్ ఏ మాత్రం కష్టపడాల్సి వచ్చినా వెంటనే తేలిగ్గా యూటర్న్ తీసుకుంటారు'అని పేర్కొన్నారు. కులగణన విషయంలో తమకు ఎలాంటి భయమూ లేదన్నారు. మణిపూర్‌లో పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ.. అక్కడ వాతావరణం అంతర్యుద్ధాన్ని తలపిస్తోందన్నారు. అతలాకుతలమవుతున్న ఆ రాష్ట్రానికి ప్రధాని మోదీ ఇప్పటికీ వెళ్లనేలేదని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ర్యాలీనుద్దేశించి వర్చువల్‌గా మాట్లాడారు.

ఐఐటీ మద్రాస్‌కు రూ. 110 కోట్ల విరాళం

సాక్షి, చెన్నై: ఐఐటీ మద్రాస్‌కు ఆ విద్యాసంస్థ పూర్వ విద్యార్థి ఒకరు భారీ విరాళం ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఐఐటీలో ప్రత్యేకంగా డేటా సైన్స్, కృత్రిమ మేథ(ఏఐ) స్కూల్ ఏర్పాటుకు ఐగేట్ సంస్థ సహవ్యవస్థాపకుడు, ఐఐటీ మద్రాస్ పూర్వవిద్యార్థి సునీల్ వాధ్వానీ రూ. 110 కోట్లు విరాళంగా అందజేశారు. సునీల్ వాధ్వాని అమెరికాలో పలు ప్రముఖ ఐటీ కంపెనీలకు సహ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. ఈయన 1974లో ఐఐటీ మద్రాస్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు.

తోటి టీచర్లను కాల్చి చంపాడు!

గోధా(జార్ఖండ్): అనుమానాస్పద ప్రేమ వ్యవహారం ఇద్దరు టీచర్లను బలిగొంది. జార్ఖండ్‌లోని గోధా జిల్లా పరియాహాట్ ప్రాంతంలోని ఛాత్రా అప్‌గ్రేడెడ్ స్కూల్‌లో ఈ కాల్పుల ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే స్కూల్‌లో పాఠాలు చెప్పే ఆదర్శ్ సింగ్, రవి రంజన్‌లతో సుజాత మిశ్రా అనే టీచర్ ప్రేమాయణం కొనసాగిస్తోంది. ఈ వివాదం ముదిరి మంగళవారం ఉదయం పాఠశాల వేళలోనే ఒక తరగతి గదిలో ఆదర్శ్ సింగ్, సుజాతలను రవి దేశవాళీ పిస్టల్‌తో కాల్చిచంపాడు. తర్వాత రవి తనను తాను కాల్చుకున్నా ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలిలో రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తుచేస్తున్నట్లు జిల్లా ఎస్పీ నాథూ సింగ్ మీనా చెప్పారు.

సోరెన్ ఢిల్లీ నివాసంలో ఈడీ సోదాలు

- రూ.36 లక్షలతోపాటు, బీఎండబ్ల్యూ కారు, కీలక పత్రాలు స్వాధీనం
- 30 గంటల తర్వాత రాంచీలో ప్రత్యక్షమైన జార్ఖండ్ సీఎం

న్యూఢిల్లీ/రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నివాసంలో ఈడీ అధికారులు మంగళవారం సోదాలు జరిపారు. రోజంతా జరిపిన తనిఖీల్లో రూ.36 లక్షల నగదుతోపాటు, బీఎండబ్ల్యూ కారు, కీలక పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూకుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ప్రశ్నించేందుకు ఈడీ బృందం సోమవారం ఉదయం ఢిల్లీలోని హేమంత్ నివాసానికి వెళ్లింది. అక్కడ ఆయన లేకపోవడంతో 13 గంటలపాటు వేచి చూశారు. ఫలితం లేకపోవడంతో సీఎం సోరెన్ కనిపించకుండా పోయారంటూ అధికారులు ప్రకటించారు. అరెస్ట్ భయంతోనే ఆయన పారిపోయారంటూ బీజేపీ ఎద్దేవా చేసింది. ఈ నెల 27న అధికారిక కార్యక్రమాలన్నిటినీ రద్దు చేసుకున్న సోరెన్ రాంచీ నుంచి ఢిల్లీకి వెళ్లారు. అనంతరం ఆయన ఎక్కడున్నదీ ఎవరికీ తెలియలేదు. దాదాపు 30 గంటల సస్పెన్స్ అనంతరం సోరెన్ మంగళవారం రాంచీలో ప్రత్యక్షమయ్యారు. తమ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. సోరెన్ భార్య కల్పన సైతం ఈ సమావేశంలో పాల్గొనడంపై ఊహాగానాలు వెల్లువెత్తాయి. తనను ఈడీ అరెస్ట్ చేస్తే భార్యను సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని హేమంత్ ప్లాన్ చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది.


రాంచీలో ప్రత్యక్షమైన సోరెన్

ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

నేలకొరిగిన ముగ్గురు జవాన్లు..మరో 15 మందికి గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగారు. మరో 15 మంది జవాన్లు గాయపడ్డారు. ఆరుగురు మావోయిస్టులు కూడా మృతి చెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. మావోయిస్టులకు గట్టిపట్టున్న అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని టేకులగూడెం వద్ద భద్రతా బలగాలు సోమవారం కొత్తగా క్యాంప్‌ను ఏర్పాటు చేశాయి. స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా రిజర్వు గార్డులు, కోబ్రా దళం జొనగూడ–అలిగూడ గ్రామాల సమీపంలో మంగళవారం గాలింపు జరుపుతుండగా మావోయిస్టులు అకస్మాత్తుగా కాల్పులకు దిగారు. బలగాలు దీటుగా స్పందించాయి. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా వారిలో ఇద్దరు కోబ్రా 201వ బెటాలియన్‌కు, ఒకరు సీఆర్‌పీఎఫ్ 150వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. బలగాల కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు సైతం మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాలను మావోయిస్టులు తమ వెంట తీసుకెళ్లారు. . 2021లో ఇదే టేకులగూడెం ప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 23 మంది జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే.

బీజేపీ నేత హత్య కేసు.. 15 మంది పీఎఫ్ఐ కార్యకర్తలకు మరణ శిక్ష

అలప్పుజ: 2021లో జరిగిన బీజేపీ ఓబీసీ విభాగం నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)కు చెందిన 15 మంది కార్యకర్తలకు కేరళ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ నెల 20వ తేదీన విచారణ ముగించిన మవెలిక్కర అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వీజీ శ్రీదేవి మంగళవారం ఈ మేరకు తీర్పు ఇచ్చినట్లు స్పెషల్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ జి.పడికల్ వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 15 మందినీ కోర్టు దోషిగా తేల్చిందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న శ్రీనివాసన్‌ను 2021 డిసెంబర్ 19వ తేదీన ఆయన ఇంట్లో తల్లి, భార్య, కుమార్తె కళ్లెదుటే పీఎఫ్ఐ కార్యకర్తలు మారణాయుధాలతో దారుణంగా చంపారు. మొత్తం 15 మంది దోషుల్లో 8 మంది ప్రత్యక్షంగా హత్యలో పాల్గొనగా, నలుగురు అక్కడే ఉండి ఇతరులు రాకుండా కాపలాకాశారు. మరో ముగ్గురు హత్యకు కుట్ర పన్నినట్లు కోర్టు గుర్తించిందని ప్రాసిక్యూటర్ చెప్పారు. పోలీసులు తమ ముందుకు తీసుకువచ్చిన 14 మంది దోషులకు మరణ శిక్ష విధిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న మరో దోషికి, కోర్టు ముందుకు తీసుకొచ్చాక మరణ శిక్షను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. దోషులపై ఇతర సెక్షన్ల కింద కూడా కేసులు నమోదయ్యాయి. ఈ తీర్పుపై శ్రీనివాసన్ కుటుంబంతోపాటు బీజేపీ హర్షం వ్యక్తం చేసింది.

ఇండియా కూటమికి మొదటి షాక్

చండీగఢ్: చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో టాప్ మూడు పోస్టులను బీజేపీ కైవసం చేసుకోవడంతో ఉమ్మడిగా బరిలోకి దిగిన ఇండియా కూటమి పార్టీలు కాంగ్రెస్, ఆప్‌లకు ఎదురు దెబ్బ తగిలింది. మేయర్ పదవి బీజేపీ అభ్యర్థికి దక్కిందని తెలియగానే బ్యాలెట్ పేపర్ల టాంపరింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్లు చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ హౌస్‌లో గలాటా సృష్టించారు. తర్వాతి దశలో సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు జరిగే ఎన్నికల్లో పాల్గొనబోమని ప్రకటించారు. ఈ ఎన్నికను పట్టపగలే జరిగిన మోసంగా ఆప్ చీఫ్ కేజ్రీవాల్ అభివర్ణించారు. కాంగ్రెస్, ఆప్‌లకు చెందిన 8 ఓట్లను చెల్లనివిగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఆప్ పంజాబ్ హర్యానా హైకోర్టును ఆశ్రయించింది. మేయర్ పదవికి జరిగిన పోటీలో బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకార్ చేతిలో ఆప్‌కు చెందిన కుల్దీప్ కుమార్ ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు పోటీ పడిన సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను సైతం బీజేపీ అభ్యర్థులే గెలుచుకున్నారు. ప్రతిపక్షాల బహిష్కరణ నిర్ణయం నేపథ్యంలో మిగతా రెండు పదవులు సైతం బీజేపీ ఖాతాలోనే జమ కానున్నాయి. 36 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో బీజేపీకి 14 మంది, ఆప్‌నకు 13 మంది, కాంగ్రెస్‌కు ఏడుగురు కౌన్సిలర్లున్నారు. బీజేపీకి చెందిన చండీగఢ్ ఎంపీ కిరణ్ ఖేర్‌కు ఎక్స్ అఫీషియో సభ్యురాలి హోదాలో ఓటింగ్ హక్కుంది.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం ౹ 31 ౹ జనవరి ౹ 2024



హోం గార్డ్స్‌కు యూనిఫాం

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే హోం గార్డులకు సీపీ టి.కె.రాణా మంగళవారం యూనిఫాం అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.10 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.40 అడుగుల వద్ద ఉంది.



నేటి నుంచి నవదిన ప్రార్థనలు

గుణదల: ఫిబ్రవరి 9 నుంచి గుణదల మేరి మాత ఉత్సవాలు జరగనున్నాయి. బుధవారం నవదిన ప్రార్థనలు ప్రారంభమవుతాయని పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ జయరాజు తెలిపారు.

మెట్ట పొలం.. కోలాహలం



ఈ చిత్రంలోని రైతు పేరు కొలను నాగరాజు. గన్నవరం మండలంలోని తెంపల్లి స్వగ్రామం. గ్రామంలో అతనికి రెండున్నర ఎకరాల మెట్ట పొలం ఉంది. గతంలో వర్షమే పంటల సాగుకు ఆధారం. ప్రకృతి అనుకూలించి వర్షాలు కురిస్తేనే దిగుబడులు చేతికి అందేవి. వర్షం పడకపోతే వేసిన విత్తు మొలకదశలోనే ఎండిపోయేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెచ్చిన వైఎస్సార్ జలకళ పథకం అతని బతుకును మార్చింది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే బోరు వేయించింది. కేసింగ్ పైపుతో పాటు విద్యుత్ మోటారు అందజేసింది. విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా ఇచ్చింది. ఇప్పుడు వర్షాలపై ఆధార పడక బోరునీటితో పంటలు పండిస్తున్నారు. ముఖ్యమంత్రి జగనన్న వల్లే తమ బతుకులో వెలుగులు నిండాయని ఆ రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జలకళ పథకం బోరు తవ్వుతుండగా పొంగుతున్న నీరు

- పేద రైతులకు వరంలా 'వైఎస్సార్ జలకళ'
- బోర్ల తవ్వకంతో పాటు విద్యుత్, పంపుసెట్లు సరఫరా
- ఒక్కొక్క రైతుకు సుమారు రూ.4 లక్షల వరకు లబ్ధి
- ఎన్టీఆర్ జిల్లాలో 2,548 బోర్ల ఏర్పాటు పూర్తి
- కృష్ణా జిల్లాలో 431 బోర్ల కింద వ్యవసాయం

సాక్షి, మచిలీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం మెట్ట పొలాలకు పచ్చందాలు అద్దుతోంది. సిరుల పంటలు పండించేలా చర్యలు చేపట్టి రైతులకు అన్ని విధాలా అండగా ఉంటోంది. వర్షాలపై ఆధారపడిన రైతులకు వరుణుడి కోసం వేచిచూసే కష్టాలు తప్పించేందుకు వైఎస్సార్ జల కళ పథకాన్ని తెచ్చింది. లక్షల రూపాయలు వెచ్చించి బోర్లు వేయించుకోలేని చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో బోర్లు వేసి జల సిరులు కురిపిస్తోంది. బోర్లతో పాటు విద్యుత్ మోటార్లు, విద్యుత్ కనెక్షన్లూ మంజూరు చేస్తోంది. ఈ పథకం కింద ఒక్కొక్క రైతుకు సుమారు రూ.4 లక్షల వరకు ప్రయోజనం చేకూరుతోంది.

రైతులకు వరం

వైఎస్సార్ జలకళ రైతులకు వరంగా మారింది. కృష్ణా జిల్లాలో 842 బోర్లకు వీఆర్వోలు అనుమతి ఇవ్వగా, 431 బోర్ల కింద ఇప్పటికే వ్యవసాయం జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు నాలుగు వేల బోర్లకు వీఆర్వోల నుంచి అనుమతి లభించింది. 2,548 బోర్ల ఏర్పాటు పూర్తయింది. ఏపీడీ స్థాయిలో దరఖాస్తు చేసున్న తరువాత గనుల శాఖ అధికారులు తనిఖీ చేసి ధ్రువీకరించాక బోర్లు వేస్తున్నారు. ఏపీడీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పారదర్శకంగా పనులు సాగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 85 శాతం భూగర్భ జలాల అభివృద్ధి పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని వ్యవసాయ బోర్లు 90 శాతం వరకు విజయవంతంగా పని చేస్తున్నాయి.

ఉచితంగా విద్యుత్ కనెక్షన్

వైఎస్సార్ జలకళ కింద తవ్విన వ్యవసాయ బోర్లకు కూడా ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. దీంతో రైతులు విద్యుత్ కనెక్షన్ దరఖాస్తు, మంజూరు కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

నాడు.. నేడు

గత ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ జలసిరి కింద టీడీపీ కార్యకర్తల పొలాల్లో మాత్రమే బోర్లు వేశారు. వాటికి విద్యుత్ కనెక్షన్, పంపుసెట్ల ఊసే లేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా రైతులకు బోర్లు మంజూరు చేస్తోంది. బోరు తవ్వకం మొదలు పొలంలో నీరు పారించే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటోంది. విద్యుత్ కనెక్షన్‌తోపాటు మోటారును సైతం ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది. బోర్లు తవ్వేందుకు అవసరమైన రిగ్గులను అందుబాటులోకి తెచ్చింది.



జలకళ బోరు తవ్వకాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

జగనన్న ఇచ్చిన వరం



నాది మెట్ట పొలం. వర్షం వస్తేనే పంట. లేకపోతే పంట చేతికి రాకుండానే ఎండిపోయేది. బోరు వేసుకోవాలని చాలా సార్లు అనుకున్నా. ఆర్థిక ఇబ్బందులు కారణంగా సాధ్యపడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాకు వరంలా వైఎస్సార్ జలకళ పథకం అమలుచేస్తున్నారు. బోరు వేయడంతో పాటు మోటార్, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చారు. దీంతో పామాయిల్ సాగుచేసుకుంటున్నా. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– మరీదు రాంబాబు, బిళ్లనపల్లి గ్రామం, బాపులపాడు మండలం

పేద రైతులకు ఎంతో మేలు



వైఎస్సార్ జలకళ చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు చేకూర్చుతోంది. బోర్లు వేయడంతో పాటు విద్యుత్ మోటార్, విద్యుత్ కనెక్షన్ కూడా ఉచితంగా ఇస్తున్నాం. ఈ పథకం మెట్ట పొలాలు కళకళలాడేలా చేస్తోంది. రైతులు వర్షాల కోసం ఎదురు చూడకుండా బోరు ఆధారంగా పంటలు సాగు చేసుకుంటున్నారు.

– జి.వి.సూర్యనారాయణ, డ్వామా పీడీ

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో నాగఫణి శర్మ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ టీటీ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఇ.త్రిమూర్తి మంగళవారం తెలిపారు. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ (చినకాకాని) విద్యార్థులు ఎ.నితిన్‌అరాస్, జి.అభినవ్‌చౌదరి, కాటూరి మెడికల్ కాలేజీ (చినకొండ్రుపాడు) విద్యార్థులు కె.అఖిల్, ఎ.నవీన్‌సాయిరామ్, గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ (శ్రీకాకుళం) విద్యార్థి పి.జస్వంత్ జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకు చెన్నైలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా యూనివర్సిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. జట్టును వర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి అభినందించారు.

ప్రతి విద్యార్థీ సైన్స్ ఫెయిర్‌ను సందర్శించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ సమీపంలో పోరంకి రోడ్డులోని మురళీ రిసార్టులో జరుగుతున్న దక్షిణ భారతస్థాయి సైన్స్ ఫెయిర్‌ను ప్రతి విద్యార్థీ సందర్శించాలని కృష్ణా డీఈఓ తాహేరా సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన 240 ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో ఎన్టీఆర్ జిల్లా తరఫున జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ పాల్గొంటున్నారని, మరిన్ని వివరాలకు 98665 28299 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు

గన్నవరం: ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు గన్నవరంలో క్రీడా ప్రాంగణాలు సిద్ధమవుతున్నాయి. గురువారం జరిగే కృష్ణా జిల్లా స్థాయి క్రీడా సంబరాలు కోసం స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం సిద్ధమైంది. ఇక్కడ కబడ్డీ, కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పురుషులు, మహిళల జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కబడ్డీ పోటీలకు నాలుగు కోర్టులను సిద్ధంచేశారు. రెండు క్రీడా పోటీలు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానంచేస్తారు. క్రీడాకారులకు భోజనం సదుపాయం కల్పించామని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. పోటీల నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఎంపీడీఓ పి.సత్య కుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రజాభద్రతకు భరోసా

- కృష్ణా జిల్లాలో తగ్గిన నేరాలు
- ప్రజల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు
- సమస్యలతో పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తే పరిష్కారానికి కృషి
- మూడేళ్లుగా తగ్గుముఖం పట్టిన నేరాలు

సాక్షి, మచిలీపట్నం: కృష్ణా జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాంతి భద్రత చర్యల కారణంగా ప్రజలకు రక్షణ పెరిగింది. స్వేచ్ఛా వాతావరణం ఏర్పడింది. ఎలాంటి ఘటనలు జరిగినా పోలీసు వ్యవస్థ వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపడుతోంది. న్యాయం కోసం పోలీసు స్టేషన్లను ఆశ్రయించిన బాధితులకు అండగా నిలుస్తోంది. ఏదైన ఘటన జరిగి, సమాచారం అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నిందితులను పట్టుకునేందుకు కావాల్సిన చర్యలు చేపడుతున్నారు. నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు కోర్టులో హాజరు పరిచి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారు. గత ఏడాది జూలైలో మచిలీపట్నంలో జరిగిన మహిళా డాక్టర్ దారుణ హత్య కేసును పోలీసులు ఐదారు రోజుల్లోనే ఛేదించారు. నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల చర్యల ఫలితంగా మూడేళ్లుగా జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. పౌరులకు భద్రత లభించింది.

తగ్గుముఖం పట్టిన నేరాలు

శాంతి భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా పోలీసులు అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా ఉంటున్నారు. నేరాల నియంత్రణతో పాటు నిందితులను పట్టుకోవడం, బాధితులకు న్యాయం చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. న్యాయం, రక్షణ, పోలీసు సేవల్లో సిఫార్సులు, వివక్ష లేకుండా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా నేరాలు తగ్గుముఖం పట్టాయి. 2021లో 8,636 ఘటనలపై కేసులు నమోదయ్యాయి. 2022లో 6,747, 2023లో 6,294 మాత్రమే కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా హత్యలతో పాటు లైంగికదాడులు, దోపిడీ, దొంగతనాలు, మోసాలు, ఇతర నేరాలు కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రతి సోమవారం పోలీసు స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నారు.

క్రైం రేటు తగ్గుముఖం



నేర నియంత్రణ చర్యలు పెరగడంతో క్రైం రేట్ తగ్గుతూ వస్తోంది. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా ప్రభుత్వం తెచ్చిన స్పందన కార్యక్రమానికి వచ్చి చెప్పుకొంటున్నారు. తక్షణం వారికి న్యాయంచేస్తున్నాం. దిశ యాప్ వల్ల బాధిత మహిళలు తమ సమస్య చెప్పిన వెంటనే పోలీసు సిబ్బంది అప్రమత్తమై సేవలు అందిస్తున్నారు. దిశా యాప్ వల్ల నేరం జరకుండానే అడ్డుకున్న ఘటనలు చాలా ఉన్నాయి.

–ఆర్.శ్రీహరిబాబు, ఏఎస్పీ, కృష్ణా

భద్రతతో ధైర్యంగా ఉన్నాం



శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉంటున్నారు. ప్రభుత్వ చర్యలతో ధైర్యం పెరిగింది. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే కొంత అభద్రతాభావం ఉండేది. ఇప్పుడు ఆ భయం లేదు. షాపింగ్, ఇతర అవసరాలకు భయం లేకుండా బయటకు వస్తున్నాం.

– ఒడుగు జ్యోతి, గృహిణి, భాస్కరపురం

పోలీసు సేవలు అభినందనీయం



ఇటీవలే మా స్నేహితుడి రూ.22 వేల సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగలించాడు. సమీపంలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాం. ఐఎంఈఐ నంబరు ఇస్తే వెంటనే స్పందించి, దాని ఆధారంగా ఫోన్ రికవరీ చేసి ఇచ్చారు. పోలీసు సేవలు అభినందనీయం.

– చొప్పర కృష్ణారావు, మచిలీపట్నం

మహాత్మాగాంధీ చూపిన మార్గంలో నడుద్దాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గంలో పయనించి ప్రజలకు సేవలు అందిద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. జాతిపిత చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జాతి సమగ్రత, ఐక్యతను పెంపొందించేందుకు పూజ్య బాపూజీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. నిత్యం అహింసాయుత మార్గంలో సత్యమే పరమావధిగా జీవించిన మహనీయుడు మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనించి ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేద్దామన్నారు. పేద, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా బాపూజీ ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం



విజయవాడ కల్చరల్: విజయవాడ ఆకాశవాణి కేంద్రం ప్రోగ్రాం హెడ్‌గా బి.వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి సిబ్బంది అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణలో అపారమైన అనుభవం కలిగిన వెంకటేశ్వర్లు ప్రోగ్రాం హెడ్‌గా బాధ్యతలు స్వీకరించడంపై సంస్థ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సిబ్బంది సహకారంతో విజయవాడ కేంద్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం డీడీజీ సోమేశ్వరరావు, వార్తా విభాగం ఏడీ వెంపటి సాయి, ఆకాశవాణి దూరదర్శన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చుండూరి మాణిక్యాలరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ హాస్య నాటికల పోటీలు



విజయవాడ కల్చరల్: తమ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జాతీయ హాస్యనాటిక పోటీలు జరుగుతాయని సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు తెలిపారు. బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో నాటిక పోటీలు జరుగుతాయని తెలిపారు. తొలి రోజు నాన్నా నేనే గెలిచా, ట్రీట్‌మెంట్, రెండో రోజు చూపులు కలసిన శుభవేళ, రంగు పడుద్ది, ఏడనున్నాడో ఎక్కడున్నాడో, మూడో రోజు కపిరాజు, పక్కింటి మొగుడు, బూడిద, కలిసుంటే, నాలుగో రోజు ఇంకానా, ప్రత్యేక ప్రదర్శనగా న్యూబాంబే టైలర్ నాటికను ప్రదర్శిస్తారని వివరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి భాస్కర శర్మ మాట్లాడుతూ.. 29 ఏళ్లుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2024 సంవత్సరానికి సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్‌కు జంధ్యాల స్మారక పురస్కారం, రంగస్థల నటి గుడివాడ లహరికి రావి కొండలరావు, రాధాకుమారి పురస్కారం, శనగల కబీర్‌దాసు పురస్కారాన్ని నాటక రచయిత దీర్ఘాసి విజయభాస్కర్‌కు ప్రదానం చేస్తామని తెలిపారు. సుమధుర కళానికేతన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సి.దాస్, బోడి ఆంజనేయరాజు, సంస్థ సహాయ కార్యదర్శి డాక్టర్ కైలాసరావు పాల్గొన్నారు.

కొల్లు రవీంద్రవి సిగ్గుమాలిన రాజకీయాలు

- నాపై అడ్డగోలు విమర్శలు చేస్తారా?
- కుమ్మరులను మోసం చేసింది నీవు కాదా
- విలేకర్ల సమావేశంలో కొల్లు రవీంద్రపై బందరు ఎమ్మెల్యే పేర్ని నాని ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న పేర్ని నాని

మచిలీపట్నం టౌన్: టీడీపీ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నారని, భూదందాలకు పాల్పడిన ఆయన ఇప్పుడు తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కొల్లు రవీంద్ర చేసిన ఆరోపణలను ఘాటుగా తిప్పికొట్టారు. 'మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని గుమ్మటాలచెరువులో ప్లాట్లు వేసి వేలాది రూపాయలకు అమ్ముకున్నది నీవు కాదా' అని రవీంద్రను ప్రశ్నించారు. విజయవాడ రోడ్డులోని కుమ్మరిగూడెంలో ఇటుక బట్టీలు, కుమ్మరుల కాలనీని పూర్తిగా తొలగించాలని కుమ్మరులను మానసికంగా ఇబ్బందులకు గురిచేసింది నిజం కాదా అని పేర్ని నాని ప్రశ్నించారు. గుమ్మటాల చెరువులో టీడీపీకి చెందిన కౌన్సిలర్లు ప్రధాన భూమిక పోషించి ప్లాట్లు వేసి పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేసిన వైనాన్ని జలాల్‌పేట, ఇనుగుదురుపేట, కవేశా ప్రాంత ప్రజలు మర్చిపోతారా అని అన్నారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు వచ్చిన అప్పటి దళిత కమిషనర్ పీజే సంపత్‌కుమార్‌పై దాడికి ప్రయత్నిస్తే పోలీసుల సాయంతో ఆయన బయటపడ్డ విషయం అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు.

జగన్ అండగా ఉన్నారు

కుమ్మరిగూడెం తొలగించేందుకు రవీంద్ర ప్రయత్నిస్తే ఆ ప్రాంత ప్రజలు అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నారని నాని గుర్తు చేశారు. బీసీ.. బీసీ అంటూనే రవీంద్ర తమను బజారుపాలు చేశారని వారు విన్నవిస్తే తాను, నాని అండగా ఉంటామని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభయమిచ్చారన్నారు. రవీంద్ర దాష్టీకానికి, దౌర్జన్యానికి వ్యతిరేకంగా కుమ్మరులు పోరాటం చేస్తే వారికి అండగా ఉన్నామన్నారు. కుమ్మరిగూడెం వాసులకు ఇప్పటికీ తాను, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు అండగా ఉన్నామన్నారు. అప్పట్లో కుమ్మరులపైకి తహసీల్దార్‌ను పంపిస్తే వారు కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వారికి సహకరిస్తున్న తనను అరెస్ట్ చేసి గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ నగర్ వద్ద టీడీపీ వారు శ్మశాన స్థలంలో ప్లాట్లు వేసి అమ్ముకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు.

నీది అవివేకం

పోర్టు నిర్మాణ పనుల్లో భాగంగా చేస్తున్న డ్రెడ్జింగ్ ద్వారా వస్తున్న మట్టిని కలెక్టర్ కార్యాలయంలో, జగనన్న కాలనీల్లో మెరక చేసేందుకు వినియోగిస్తుంటే మట్టిని దోచుకుంటున్నట్లు విమర్శించటం రవీంద్ర అవివేకానికి నిదర్శనమని నాని అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ మినహా మట్టికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయటం లేదని ఈ విషయం కలెక్టర్, ఆర్డీఓలకు తెలుసునన్నారు. 'ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ద్వారా జరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ పనులను నీవే తీసుకోవచ్చు కదా' అని కొల్లు రవీంద్రను పేర్ని నాని ప్రశ్నించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ కౌన్సిలర్ చిటికిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహనతో ఉండాలి
- ఎన్నికల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే సార్వత్రిక ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాలు, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచనల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియలో భాగాలైన పోలింగ్, ఎంసీసీ, ఐటీ అప్లికేషన్స్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతి అంశం కీలకమేనన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిక్షణలో వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పొంది నియోజకవర్గస్థాయిలో ఆయా బృందాలకు సమగ్ర శిక్షణ అందించాలని పేర్కొన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా సంబంధిత అధికారులు తమ వంతు బాధ్యతలను నిర్వర్తించాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఆయా బృందాలకు ఏఏ తేదీలలో శిక్షణ అందించాలో ఆ మేరకు సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి అందజేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు సమావేశ మందిరంతో పాటు తగిన మౌలిక వసతులు సమకూర్చుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా కంప్యూటర్, స్టాండ్ బై జనరేటర్ విద్యుత్ సౌకర్యం, తాగునీరు, టాయిలెట్లు ఉండేలా సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్తించాల్సి ఉంటుందని సూచించారు. శిక్షణ సమయంలో ఎన్నికల కమిషన్ సూచనలు, మార్గదర్శకాలను శిక్షణ సామగ్రితో పాటు అందించాల్సి ఉంటుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విధులపై పూర్తిస్థాయి అవగాహనతో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల విధులపై అన్ని అంశాలపై అధికారులు స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించవచ్చునన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తు కార్యాచరణపై కలెక్టర్ ఢిల్లీరావు దిశానిర్దేశం చేశారు. నాలుగు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలలో రాష్ట్ర స్థాయిలో జిల్లా నుంచి శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్ ఆయా అంశాల్లో ఎన్నికల మార్గదర్శకాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో ఎస్.వి. నాగేశ్వరరావు, ఆర్డీఓ కె.మాధవి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్.దుర్గాప్రసాద్, విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ చక్రపాణి, జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే



భవానీపురం(విజయవాడపశ్చిమ): కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు మంగళవారం నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు 14 రోజులపాటు ఇంటింటా సర్వే జరుగుతుందని వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ పద్మావతి తెలిపారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమం 'స్పర్శ' మంగళవారం ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లు 'స్పర్శ'లో పాల్గొని సర్వే చేస్తారన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, నూనె పూసినట్లు మెరుపు మాదిరి ఉండే మచ్చలతో ఉన్న వ్యక్తులను గుర్తిస్తారని చెప్పారు. అనంతరం వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో పరీక్షలు నిర్వహించి కుష్ఠు వ్యాధిని నిర్ధారిస్తారని తెలిపారు. తర్వాత వారికి ఎండీటీ బహుళ ఔషధ చికిత్స పద్ధతి ద్వారా 6 నుంచి 8 నెలలు మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 13 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు, ఎంసీఆర్ పాదరక్షలను అందజేశారు. కార్యక్రమంలో లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్, డీఎల్ఓ డాక్టర్ ఉషారాణి, డీఐఓ అమృతం, డీఎంఓ డాక్టర్ మోతి బాబు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మాధవి, లెప్రసీ స్వచ్ఛంద సంస్థల తరుపున రాధిక, డీపీఎంఓ ప్రతాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, గొల్లపూడి గ్రామ పంచాయతీ ఈఓ స్వరూపరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ ముఠా సభ్యులు

ఇబ్రహీంపట్నం: చోరీ ముఠా సభ్యులను ఇబ్రహీంపట్నం పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.3 లక్షల విలువైన 5 బైక్‌లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంకు చెందిన పుట్టా రాజు, కుంచం వెంకట్, నల్లమోతు కానూష్, గుడ్లవల్లేరుకు చెందిన బడుగు భవానీప్రసాద్, మరో బాలనేరస్తుడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో బైక్‌లపై రెక్కీ నిర్వహించి తాళంవేసిన ఇళ్లు, ఇంటిముందు నిలిపిన బైక్‌లు, దేవాలయాల్లో వెండి, బంగారం వస్తువులు చోరీ చేసేవారు. సీపీ టీకే రాణా సూచనల మేరకు ఏసీపీ హనుమంతరావు, సీఐ ఎం.సత్యనారాయణ, క్రైం ఎస్‌ఐ వెంకటేశ్వరరావు నిఘా ఉంచి గాజులపేట వద్ద అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

- నాణ్యత ముఖ్యం
- ఎగుమతులకు డిమాండ్
- మామిడి తోటల్లో యాజమాన్య చర్యలు

కంకిపాడు: సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మామిడి పంట అధిక దిగుబడికి వీలుంటుంది. నాణ్యత బాగుంటేనే మార్కెట్‌లో మామిడి ధర ఆశాజనకంగా ఉంటుంది. ఎగుమతి స్థాయికి దిగుబడి సాధిస్తే సాగు లాభదాయకంగా ఉంటుంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంట సంరక్షణ చర్యలు తీసుకోవాలని అంటున్నారు జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి. మామిడి రైతులకు చేసిన సూచనలు ఆమె మాటల్లోనే..

కృష్ణా జిల్లాలోని 6,950 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. బాపులపాడు, గన్నవరం, అవనిగడ్డ ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్నాయి. బాపులపాడు మండలంలో 3,473 ఎకరాలు, గన్నవరం 2,219, అవనిగడ్డ 1138 ఎకరాల్లో సాగు జరుగుతోంది.

పూతలు ఆలస్యం

గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు అధికంగా కురిశాయి. ఈ కారణంగా డిసెంబర్‌లో రావాల్సిన మామిడి పూతలు జనవరిలో మొదలయ్యాయి. ప్రస్తుతానికి బాపులపాడులో 65 శాతం, గన్నవరం 90, అవనిగడ్డ 30 శాతం పూతలు నమోదయ్యాయి. నల్లమట్టి నేలలు, బరువు నేల, నేల తేమశాతం ఎక్కువగా ఉండటంతో అవనిగడ్డ ప్రాంతంలో పూతలు మరింత ఆలస్యమవుతాయి. గన్నవరం పరిసరాల్లో పూతతో పాటుగా తేనె మంచు పురుగు ఉధృతి గుర్తించారు.



మామిడి చెట్లకు పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి జ్యోతి

గతేడాది పంట ఆశాజనకంగా ఉన్నా, ఈ పురుగు వ్యాప్తితో కాయలపై నల్ల జిగురు, బంక ఏర్పడి సరైన ధర దక్కలేదు.

సంరక్షించుకోవాలి

ప్రస్తుతం మామిడి పూతను సంరక్షించుకోవడం, పంటను పురుగుల నుంచి కూడా కాపాడుకోవాల్సిన అవసరముంది. ప్రధానంగా తేనె మంచు పురుగు, తామర పురుగు కనిపిస్తోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పంట చేతికి ఒకేసారి వస్తుంది. మార్కెట్‌లో సరైన ధర పలకాలంటే కాయ నాణ్యతపై దృష్టి పెట్టాలి. అవనిగడ్డ ప్రాంతంలో పండు ఈగ పంటకు నష్టం కలిగిస్తోంది. దీని దృష్ట్యా రైతాంగం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- తేనె మంచు పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు లీటరునీటికి లేదా థైయామితాక్సం 0.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగు చెట్టు బెరడులో నివాసముంటుంది. చెట్టు కాండం, కొమ్మలు, రెమ్మలు, ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి.
- పక్షి కన్ను తెగులు నివారణకు క్లోరోథాలోనిల్, థైయోఫెనేట్ మెథైల్ కానీ పిచికారీ చేయాలి. ఒకసారి పిచికారీ చేసి, మూడు రోజులు తర్వాత వేపనూనె 1500 పీపీఎం 5 మిల్లీలీటర్లు లేదా వేప కషాయం పిచికారీ చేసుకోవాలి. గానుగ సబ్బు ద్రావణం, వేప సబ్బు ద్రావణం, కూడా తెల్లపూత దశలో వాడుకోవచ్చు. వేపనూనె తెల్లపూత దశలో వాడకూడదు. బెట్ట పరిస్థితులు ఎదుర్కొనడానికి పిందెలు గోళీ సైజు, నిమ్మకాయ సైజు నుంచి పెరిగే వరకూ వారానికో సారి తోటలకు నీటి తడులు ఇవ్వాలి.
- పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలి.

నూజివీడు మామిడి పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయి. ఎండుపుల్ల ఉంటే విరిచేసుకోవాలి. ఎండుపుల్లలో పురుగుల అవశేషాలు, గుడ్లు ఉంటాయి. వాటిని విరిచేస్తే పంటకు జరిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చు. పురుగు మందులు 15–20 రోజులకోసారి పిచికారీ చేయడం, మధ్యలో అవసరం ఉంటే వేపనూనె/గానుగ సబ్బు ద్రావణం/ పంట దశను బట్టి పిచికారీ చేయాలి.

కాయలకు కవర్లు కట్టడం ఉత్తమం

అవకాశం ఉన్నంత వరకూ కాయలకు కవర్లు కట్టడం ఉత్తమం. కాయలు నిమ్మకాయ సైజు రాగానే ఫ్రూట్ కవర్లు కట్టాలి. తెగుళ్ల నుంచి కాయలను రక్షించుకోవచ్చు. నాణ్యమైన పంట దిగుబడులను మార్కెట్‌కు తరలించటానికి ఈ కవర్లు దోహదపడతాయి.

సకాలంలో గుర్తించాలి

ప్రస్తుతం మామిడిలో పూత, పురుగు ఉధృతి కనిపిస్తోంది. దీన్ని సకాలంలో గుర్తించి యాజమాన్య చర్యలు చేపట్టాలి. పంట సంరక్షణతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించాలి. ఎగుమతులకు అనువుగా పంట ఉంటే ఆశించిన ధర దక్కుతుంది. సాగు లాభదాయకంగా ఉంటుంది. తోటల వద్దకే ఎగుమతి వ్యాపారులు వచ్చి పంట ప్రీమియం ధరకు కొనుగోలు చేస్తారు. నాణ్యతపై దృష్టి పెట్టాలి.

–జె.జ్యోతి,
జిల్లా ఉద్యానశాఖ అధికారి, కృష్ణా జిల్లా

జేఎన్‌టీయూ జూడో జట్టు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జేఎన్‌టీయూ కాకినాడ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన యూనివర్సిటీ జూడో సెంట్రల్ జోన్ టోర్నమెంట్, జట్టు ఎంపిక మంగళవారం స్థానిక పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో జరిగింది. జేఎన్‌టీయూ పరిధిలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. యూనివర్సిటీ జట్టుకు పురుషుల విభాగానికి ఐదుగురు, మహిళల విభాగానికి ఇద్దరు ఎంపికయ్యారు. వీరు ఫిబ్రవరి నాలుగు, ఐదో తేదీల్లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో గురునానక్ దేవి విశ్వవిద్యాలయం జరిగే సౌత్ – వెస్ట్ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జట్టుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, వివిధ కళాశాలల పీడీలు రఘు, కె.సత్యనారాయణ, ఎస్.పవన్‌సందీప్, విక్టర్ తదితరులు హాజరయ్యారు.

మర్యాదపూర్వక కలయిక



సీపీ రాణాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశాల్‌గున్ని, మోకా సత్తిబాబు, వి.అజిత

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ నుంచి విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలకు బదిలీ అయిన డీసీపీలు విశాల్‌గున్ని, మోకా సత్తిబాబు, వి.అజిత పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేశారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీగా విశాల్‌గున్ని, విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డీసీపీగా మోకా సత్తిబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా వి.అజిత బదిలీ అయిన విషయం తెలిసిందే. వీరికి సీపీ రాణా వీడ్కోలు పలికారు.

బాలల హక్కుల పరిరక్షణలో ఆదర్శంగా ఉందాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలులో జిల్లాను ఆదర్శంగా నిలపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. బాలలకు ఎదురయ్యే సమస్యల నుంచి విముక్తి కల్పించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గవర్నర్‌పేటలోని స్వర్ణప్యాలెస్ హోటల్‌లో మంగళవారం స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యాన జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ బాలబాలికలపై జరుగుతున్న లైంగిక, సామాజిక హింసను నిరోధించడానికి అమలు చేస్తున్న చట్టాలపై సంబంధిత శాఖల అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. బాలికలపై జరిగే లైంగిక హింసను నిరోధించడానికి పోక్సో చట్టంలోని నిబంధనలను అధికారులు తప్పకుండా అమలు చేయాలన్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే జరగడానికి అవకాశాలున్న మూలాలను గుర్తించి వాటిని నిరోధించగలిగితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. నేరానికి పాల్పడినా, ప్రయత్నించినా, యత్నవిఫలమైనా ఈ చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేసేలా పోక్సో చట్టాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. లైంగిక నేరాల కేసుల పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. జరిగిన వేధింపులు తెలియజేసేలా బాలల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ కె.అప్పారావు మాట్లాడుతూ బాలలకు జీవించడం, రక్షణ పొందడం, అభివృద్ధి చెందడం, భాగస్వామ్యం వంటి అంశాలపై హక్కులను కల్పించారని తెలిపారు. పౌష్టికాహారం, ఆరోగ్యం, సురక్షిత వాతావరణం కల్పించడం, లైంగిక శారీరక మానసిక దోపిడీ వంటి వాటి నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ఏర్పాటు చేసిన చట్టాలను మరింత విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో బాలల సంరక్షణకు బంగారు బాట వేయాలని కోరారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమాదేవి, ఏసీపీ కె.స్రవంతీరాయ్, ఎస్‌సీపీసీఆర్ సభ్యులు జి. సీతారాం, సీడీపీవో జి. మంగమ్మ, సీఆర్‌ఏఎఫ్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ, ఉపవిద్యాశాఖాధికారి వెంకటప్పయ్య, పోలీస్, రెవెన్యూ, విద్య, సాంఘిక సంక్షేమ తదితర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుడికి బీమా మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల మంగళవారం తీర్పు చెప్పారు. కైకలూరుకు చెందిన ముంగర బుల్లెమ్మ భారత ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి 2019లో రూ. 10,93,532కు పాలసీ తీసుకున్నారు.

పాలసీ 2022వ సంవత్సరం వరకు ఫోర్స్‌లో ఉంది. 2021 డిసెంబరు 4వ తేదీన బుల్లెమ్మ మరణించారు. నామినీగా ఉన్న ఆమె కుమారుడు చినకొండలరావు క్లయిమ్ కోసం ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగా తిరస్కరించారు. దీంతో కొండలరావు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడంతో విచారణ చేసిన కమిషన్ సభ్యులు క్లయిమ్ మొత్తం రూ. 10,93,532ను 2022 జనవరి 28 నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ. 75 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఫిర్యాదుదారుడికి ఇన్సూరెన్స్ కంపెనీ తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని పేర్కొన్నారు.

జాతిపితకు నివాళి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం అమరవీరుల దినోత్సవం జరిగింది. డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బందితో కలసి స్వాతంత్ర్య సమరయోధులు, మాతృభూమి కోసం ప్రాణాలను అర్పించిన జవాన్‌లను స్మరించుకుంటు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏటా జనవరి 30న అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. గాంధీ ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం శ్రీకాంత్, పలు బ్రాంచ్‌ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జి.కొండూరు: పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధి కోడూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. జి.కొండూరు మండల పరిధి కోడూరు గ్రామానికి చెందిన మూల్పూరి హరికృష్ణ(32) వివాహమై భార్య, కుమార్తె, కుమారుడితో కొంతకాలంగా హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న హరికృష్ణ వారం క్రితం కుటుంబంతో కోడూరు వచ్చాడు. ఈ క్రమంలో ఆరోగ్య సమస్యలు తీవ్రంకావడంతో సోమవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు హరికృష్ణను విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హరికృష్ణ మంగళవారం మృతి చెందాడు. మృతుడి మేనత్త కొడాలి సావిత్రి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య

చిట్టినగర్ (విజయవాడపశ్చిమ): ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రాజీవ్‌శర్మనగర్‌లో బూడిద నాగమణి, వెంకట సత్యనారాయణ కుటుంబం నివసిస్తోంది. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె దూండీ సత్య రాజేశ్వరి(24) లబ్బీపేటలోని ఓ షాపులో పని చేస్తుంటుంది. నాగమణి వన్‌టౌన్‌లోని ఓ కాలేజీలో స్వీపర్. మంగళవారం నాగమణి కాలేజీ నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి రాజేశ్వరి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కేకలు వేసింది. స్థానికుల సాయంతో లోపలకు వెళ్లగా టీవీ వద్ద 'నాకు బతకడం ఇష్టం లేదంటూ' నోట్ కనిపించింది. దీంతో ఘటనపై నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఇటీవల రాజేశ్వరికి ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నట్లు, ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మేరీమాత పుణ్యక్షేత్రంలో నేటి నుంచి నవదిన ప్రార్థనలు

గుణదల(విజయవాడ తూర్పు): విజయవాడలోని గుణదల మేరిమాత పుణ్యక్షేత్రంలో బుధవారం నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఈ నవదిన ప్రార్థనలు ప్రారంభించనున్నట్లు పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తెలిపారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయం వద్ద బుధవారం సాయంత్రం మేరీమాత పతాక ఆవిష్కరణతో నవదిన ప్రార్థనలు మొదలవుతాయని చెప్పారు. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ సునీల్ రాజు తదితర గురువులు, మఠకన్యలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. పుణ్యక్షేత్రం ఏర్పాటుచేసి నూరు వసంతాలు పూర్తయిన సందర్భంగా విజయవాడ పీఠంలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయి. గుణదల పుణ్యక్షేత్రాన్ని స్థాపించి అభివృద్ధి పరిచిన పలువురు గురువుల జ్ఞాపకార్థం స్మృతివనం ఏర్పాటు చేశారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయం వెనుక కొండ పై రెండో మలుపులో ఏర్పాటు చేసిన ఈ స్మృతివనంలో పూర్వపు పీఠాధిపతులు డొమ్నిక్ గ్రాసి, అబ్రోస్ డి బతిస్తా, ఫాదర్ అర్లాటి, ఫాదర్ బియాంకి స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. నవదిన ప్రార్థనల అనంతరం ఈ స్మృతివనాన్ని ప్రారంభించనున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో అనుమానాస్పద స్థితిలో ముగ్గురి మృతి



ఏటిమొగలో మృతి చెందిన లక్ష్మీకుమారి (ఫైల్)

నాగాయలంక: ఉమ్మడి కృష్ణా జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. నాగాయలంక మండలం ఏటిమొగలో బొడ్డు లక్ష్మీకుమారి (35) అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఆమె తన గృహంలోని వంటింట్లో ఉరివేసుకుని కుళ్లిపోయి వేలాడటం కలకలం రేపింది. నాగాయలంక ఏఎస్‌ఐ తుంగల ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఏటిమొగకు చెందిన బొడ్డు వెంకటేశ్వరరావుకు కోడూరు మండలం పాలకాయతిప్ప గ్రామానికి చెందిన లక్ష్మీకుమారితో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. సాంబశివరావు, చైతన్య మోపిదేవి హాస్టల్లో పదో, ఏడో తరగతి చదువుతున్నారు. భార్యాభర్తలిద్దరూ ఇక్కడ కూలి పనులతో పాటు ఇతర ప్రాంతాలకు పైపనులకు వెళ్తుంటారు. ఇంత వరకూ అతని తల్లిదండ్రుల ఇంటి వద్దే ఉండేవారు. ఈ నెల 3న గ్రామంలోని కొక్కిలిగడ్డ వేణేశ్వరరావు ఇంట్లోకి అద్దెకు వచ్చారు. ఆ తర్వాత ఇద్దరూ పైపనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లి 26వ తేదీన తిరిగొచ్చారు. అదే రోజు రాత్రి ఇంటి బయట భార్యా భర్తలు గొడవ పడుతుంటే ఇరుగుపొరుగు అడగడంతో ఇంట్లోకి వెళ్లిపోయారు. మరుసటి రోజు 11.30 గంటలకు కూడా వారు ఇంటి బయట కూర్చుని మాట్లాడుకోవడం స్థానికురాలు నాగలక్ష్మి చూసింది. సాయంత్రం వేళ లక్ష్మీకుమారిని పిలవగా స్పందన రాకపోవడంతో మళ్లీ పనులకు వెళ్లి ఉంటారని భావించారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో వారి ఇంట్లో నుంచి వాసన రావడం గుర్తించిన నాగలక్ష్మి సచివాలయానికి వెళ్లి వీఆర్వో గాదె కృష్ణప్రసాద్‌కు సమాచారం అందించింది. ఇంటిని పరిశీలించిన వీఆర్వో లోపల లక్ష్మీకుమారి మృతదేహం డీకంపోజ్ స్థితిలో కనబడటంతో నాగాయలంక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అవనిగడ్డ సర్కిల్ ఇనస్పెక్టర్ పి.వెంకట త్రినాథ్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి నేర పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి అక్క లంకె పద్మ, బావ లంకె శ్రీనివాసరావు ఏటిమొగలో మీడియాతో మాట్లాడుతూ లక్ష్మీకుమారి మరణానికి ఆమె భర్త వెంకటేశ్వరరావే కారణమని పేర్కొన్నారు. వారికి గతంలో తామే ప్రేమ వివాహం జరిపామని ఆ సమయంలో రూ.20వేలు కట్నం కూడా ఇచ్చామని, పెళ్లైన కొద్ది కాలానికే చెల్లిని నిత్యం వేధించేవాడని ఆమె విసుగు చెంది గతంలో పోలీసులు, గ్రామపెద్దలను ఆశ్రయించినా ఫలితం లేదని విలపించారు. మూడు రోజుల క్రితమే మరణించినా సమాచారం లేదని ఇంటికి వచ్చి చూడగా దుర్వాసనతో తాడుకు వేలాడుతూ భయానకంగా కనిపించిందని ఆందోళన చెందారు. ఆమె భర్త కనిపించకపోవడంపై కూడా వారు అనుమానం వ్యక్తం చేశారు.

పటమటలో..

పటమట(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన పటమట డొంకరోడ్డులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట డొంకరోడ్డులోని పద్మజ నగర్‌లో నివసించే బంగారు దుర్గ(36) ప్రైవేటుగా డ్రైనేజీల పూడికతీత పనులు చేస్తుంది. ఆమెకు పదేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ముగ్గురు సంతానం. మనస్పర్ధల కారణంగా ఆమె కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పటమట గురునానాక్‌నగర్ సమీపంలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపం సమీపంలో ఉండే ఆమె చెల్లెలి భర్త హరికృష్ణతో కొంతకాలంగా సన్నిహితంగా మెలుగుతోంది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో హరికృష్ణ.. దుర్గ ఇంటికి వచ్చి అక్కడ ఉన్నాడు. సాయంత్రం 4.30 గంటల వేళ హరికృష్ణ రక్తంతో దుర్గ ఇంటిలోనుంచి బయటకువచ్చి గుమ్మంపై కుప్పకూలిపోవడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సమయానికే దుర్గ కూడా ఇంటిలో రక్తమోడుతూ కన్పించింది. ఇద్దరినీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గొంతుపై బలమైన గాయం కావటంతో దుర్గ మృతి చెందిందని, గొంతుపై తీవ్ర గాయాలతో హరికృష్ణ ప్రభుత్వాసుపత్రిలో కొన ఊపిరితో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై పటమట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డీకేఎన్ మోహనరెడ్డి తెలిపారు.

తెన్నేరులో..



మృతుడు బడిపాటి దిలీప్‌కుమార్

కంకిపాడు: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెన్నేరు గ్రామానికి చెందిన బడిపాటి దిలీప్‌కుమార్ (35) కూలి పనులు చేస్తుంటాడు. ఈనెల 29న కూలి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. దిలీప్‌కుమార్ తల్లి బడిపాటి కుమారి ఫంక్షన్‌కు వెళ్లి వచ్చే సరికి అతను ఇంటి వద్ద లేడు. మంగళవారం ఉదయం దిలీప్‌కుమార్‌కు ఫోన్ చేయగా తియ్యలేదు. స్థానికంగా వెదకగా తెన్నేరు రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మినుము పొలాల్లో శవమై పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. 174 సెక్షన్ కింద పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే మా నినాదం

- వీఎంసీ కౌన్సిల్‌లో మేయర్ భాగ్యలక్ష్మి
- పీఎంఏవై – టిడ్కో ఇళ్ల అవకతవకలు, విజిలెన్స్ విచారణపై చర్చ
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం





కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయటమే తమ నినాదమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో మేయర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాభివృద్ధిని గత పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్ల కాలంలో విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని, మూడు సర్కిళ్ల పరిధిలోని 64 డివిజన్లలోనూ తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. సమావేశంలో మొత్తం 121 అంశాలు అజెండాలో ప్రతిపాదన రాగా అందులో 110 అంశాలు ఆమోదం పొందాయి. రెండు అంశాలు ఆఫీస్ రిమార్కుకు పంపారు. రెండు అంశాలను ధ్రువీకరించారు. మూడు అంశాలను విద్యాశాఖకు, ఒక అంశాన్ని సెర్ప్‌కు(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ)కి సిఫార్సు చేస్తూ తీర్మానించారు. రెండు అంశాలు రికార్డు చేయగా, ఒక అంశాన్ని ఆఫీసు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టీడీపీ వర్సెస్ వైఎస్సార్ సీపీ..

ప్రశ్నోత్తరాల సమయంలో టిడ్కో పీఎంఏవై(ప్రదాన మంత్రి ఆవాస యోజన)-ఏపీ హౌసింగ్ టిడ్కో లబ్ధిదారులకు కేటాయింపులపై వచ్చిన ప్రశ్నపై వైఎస్సార్ సీపీ-టీడీపీ మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై గతంలో విజిలెన్స్ విచారణకు కౌన్సిల్ తీర్మానం చేసినా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేకపోవటంతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వివరణ కోరారు. వీఎంసీలోని ఎస్టేట్స్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి ఎన్ని కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.. హైకోర్టు, లోకల్ కోర్టుల వారీగా కేసుల వివరాలను అడిగిన ప్రశ్నపై ఆయా విభాగం అధికారులు కేసుల వివరాలను సభ్యులకు వివరించారు.

ప్రధానాంశాలు..

- ఎన్టీయార్ సర్కిల్ నుంచి పాత చెక్‌పోస్టు వరకు ఉన్న బందరురోడ్డును 100 అడుగుల రోడ్డుగా విస్తరించేందుకు పనులు గతంలో ప్రారంభించి మధ్యలో ఆగిపోయాయని, తిరిగి పనులు ప్రారంభించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆఫీస్ రిమార్కులు కోరుతూ తీర్మానించారు.
- గతంలో టిడ్కో ఇళ్ల నిమిత్తం ప్రభుత్వానికి లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారని, కానీ వారికి ఇళ్ల మంజూరు కానందున తిరిగి వారి సొమ్మును చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదించారు.
- మాజీ కార్పొరేటర్ పాముల మాలకొండయ్య ఆర్థిక పరిస్థితి అంతగా బాగోలేదని, ఆయన ఉండేందుకు నివాసం కూడా లేకపోవటం ఇబ్బందులు పడుతున్నారని, ఆయనకు మానవతా దృక్పథంతో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో ఒక ఇంటిని కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదించారు.
- నగరంలో కుక్కలు, దోమలు, కోతుల బెడద అధికంగా ఉందని వీటిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు చేసిన ప్రతిపాదనపై వీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు.
- సర్కిల్–1 పరిధిలోని ఎర్రకట్ట జంక్షన్ నుంచి లోటస్‌ల్యాండ్ మార్క్ వరకు ఉన్న 5వ లైన్ సీసీ రోడ్డు వేయాలని అందుకు అయ్యే రూ. 60 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానించారు.
- 37వ డివిజన్‌లోని జెండాచెట్టు సెంటర్ నుంచి హిందూ హైస్కూల్ వరకు సుబ్బరామయ్య వీధి బీటీ రోడ్డు వేయటానికి అయ్యే రూ. 62.12 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానించారు.
- సెంట్రల్ నియోజకవర్గం 3వ డివిజన్‌లోని అయోధ్య నగర్‌లో బుడమేరు కట్ట వెంబడి సీకే రోడ్డు నుంచి సూర్యా కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.72.56 లక్షలు నిధులను కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదించారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణను ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న మాస్టర్ ప్లాన్ పనులు, మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనుల గురించి ఈవో, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి వివరించారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



గుణదల(విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమం కోసం పాటు పడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తుందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని నాగార్జుననగర్‌లో 'గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి సఫలమయ్యారన్నారు. పార్టీ అనుసరిస్తున్న విధివిధానాలు ఆమోద యోగ్యంగా ఉన్నాయని వివరించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూనే.. నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేశారు. 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, కోఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. త్యాగరాజ స్వామి పుణ్యతిథి బహుళ పంచమి సందర్భంగా సంగీత విద్వాంసులు నగర సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో త్యాగరాజ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలతో సంగీత కళాశాల నుంచి నగర సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. సంగీత విద్వాంసులు సహితం పల్లకీ మోసి త్యాగరాజ స్వామి పట్ల ఉన్న తమ భక్తిని చాటుకున్నారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, మల్లాది కార్తీక త్రివేణి, భమిడిపాటి శ్రీలలిత, సురేష్, రామలక్ష్మితోపాటు యువ సంగీత కళాకారులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ ఉద్యోగ సంఘం నేతలు విజయవాడ జోన్ చైర్మన్ ఎన్.మహేష్‌కు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో జోన్ చైర్మన్ మహేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన జోన్ చైర్మన్ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు టి.సూరిబాబు, శంకర్, ఏపీఎస్ఎన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురిని అంతర్గత బదిలీలు చేస్తూ ఆలయ ఈవో కేఎస్ రామారావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్ వై. హేమదుర్గాంబ పూజలు, ఫెస్టివల్, ప్రొవిజన్ స్టోర్స్‌తో పాటు ధర్మపథం విధులను కేటాయించారు. కనకదుర్గప్రభ ఎడిటర్ కె. గంగాధర్‌కు అదనంగా పీఆర్వో, ప్రెస్ రిలేషన్ విధులను కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ బి.నాగరాజుకు వేద పాఠశాల, అన్నదానం హాల్ నిర్వహణతో పాటు ప్రసాదం తయారీ స్టోర్స్ బాధ్యతలు అప్పగించారు. ఇక సీనియర్ అసిస్టెంట్ పీవీ రమణకు ప్రసాదం తయారీ కేంద్రం నుంచి ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి, జూనియర్ అసిస్టెంట్ వీఎస్ఎస్ రామ్‌కు పేబిల్స్ విభాగానికి, పి. శ్రీనివాసరావుకు వేద పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. టి. సుబ్రహ్మణ్యంను రికార్డు రూమ్ నుంచి మూడు రోజులు ప్రధాన ఆలయం, మరో మూడు రోజులు ప్రొటోకాల్ విధులు అప్పగించారు. రికార్డు అసిస్టెంట్ కె. రమేష్‌ను సత్రాల నిర్వహణ నుంచి రికార్డు రూమ్ బాధ్యతలు అప్పగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గుణదల (విజయవాడ తూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గుణదలలోని పలు ప్రాంతాలలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ హరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహానాడు రోడ్డు, గణేష్ నగర్, నాగార్జున నగర్, రామచంద్రానగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

ఉత్తమ సేవకు ప్రశంస







కలెక్టర్ ఢిల్లీరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి. ఇందిరాకుమారి ; డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సొంగా వినయ్‌కుమార్ ; డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ యు. శోభ



అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి



జూనియర్ అసిస్టెంట్ పీఎం కబీర్



గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సబిత



జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్



హెడ్‌నర్స్ జి. మార్తమ్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న పలువురు వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు మంగళవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. నగరంలోని తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ డి. వెంకటేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి నివాళులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకు రావడంలో మహాత్మాగాంధీ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ సమీర, డాక్టర్ విద్యాసాగర్, డిప్యూటీ డెమో డాక్టర్ ప్రభాకరరెడ్డి, విజయ్, మహేష్, రామకృష్ణ, సీతాకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి

7వ డివిజన్ పర్యటనలో దేవినేని అవినాష్



సంక్షేమ కరపత్రాలను అందజేస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ ప్రభుత్వ హయాంలోనే తూర్పు నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 7వ డివిజన్ పరిధిలోని అట్లూరి పరమాత్మ వీధి, శివగిరి ప్రాంతాలలో అవినాష్ మంగళవారం పర్యటించారు. నాలుగున్నరేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల గురించి కూడా ఆయన డివిజన్ వాసులకు వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలకు తోక పత్రికలు ఎన్ని అవాస్తవాలను ప్రచారం చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఆపడం ఎవరి తరం కాదని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా ప్రతి హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. కార్పొరేటర్ ఎం.మాధురితో పాటుగా పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి టైలరింగ్ దోహదం



సర్టిఫికెట్లు పొందిన మహిళలతో ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల ఆర్థికాభివృద్ధికి టైలరింగ్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఇన్నర్‌వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శ్రీదేవి అన్నారు. మంగళవారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు కుట్టిన డ్రస్సులు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగటానికి ఎంతో ఉపయోగపడుతుందనే నమ్మకం ఏర్పడిందన్నారు. సమాజంలో మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ఇన్నర్‌వీల్ క్లబ్ పనిచేస్తోందన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు యు.వి.రామరాజు, కె.స్వరూపరాణి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబ పోషణ ఒక్కరితోనే సాధ్యం కాదన్నారు. మహిళలు కుట్టుశిక్షణ లాంటివి నేర్చుకొని కుటుంబపోషణలో వారు కూడా భాగస్వాములు అవ్వడం ద్వారా మరింత సాధికారత ఏర్పడుతుందన్నారు. శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన వస్త్రాలను ప్రదర్శించారు. అనంతరం ఎం.బి.విజ్ఞాన కేంద్రం, బీఆర్‌టీఎస్ రోడ్డు, రాణిగారితోట శిక్షణ కేంద్రాలలో టైలరింగ్ శిక్షణ పొందిన 86 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ దివాస్ ప్రెసిడెంట్ వై.స్వరూప, సెక్రటరీ ఎస్.శిల్ప, టైలరింగ్ టీచర్ పి.గాయత్రి, బి.మల్లేశ్వరి, కె.ఇందిర, ఎస్.కె. ఆషా తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న నిర్వహించబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. సున్నపుబట్టీల సెంటర్ సమీపంలోని రామనర్సయ్య భవన్‌లో పీడీఎస్‌యూ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీల్లో ప్రశ్నించే గొంతులను నొక్కుతూ విద్యను మొత్తం కాషాయికరిస్తూ శాస్త్రీయత లేకుండా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువస్తోందన్నారు. చరిత్ర, సైన్సు తదితర పాఠ్యాంశాలను తొలగిస్తూ మనువాద బ్రాహ్మణీయ పాఠ్యాంశాలను చేర్చుతున్నారని భాస్కర్ చెప్పారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్, సభ్యులు ఆది, మహర్షి, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీనగర్‌కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. స్థానిక 28వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో శానిటేషన్, మురుగు కాలువలో మురుగు పారుదలను స్వయంగా పరిశీలించారు. రోడ్డు మీద ఉన్న మ్యాన్ హోల్ రోడ్డుతో సమానంగా లేకపోవడం గమనించి మ్యాన్ హోల్స్ ఎత్తును పెంచి రోడ్డుకు సమానంగా కట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. రోడ్డు మీద భవన నిర్మాణ వ్యర్థాలను వదిలివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. అలాగే రోడ్డు మార్జిన్స్‌లో ఉన్న పేపర్ బ్లాక్ సమాంతరంగా లేకపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్న దృష్ట్యా సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సిబ్బందిపై చర్యలు..

పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతోపాటు మురుగుకాలువలు పారకపోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, వార్డు హెల్త్ సెక్రటరీ వీరాస్వామిని సస్పెండ్ చేశారు.

గ్రంథాలయాలు.. విజ్ఞానానికి నిలయాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సోమశేఖరరావు తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు ఎంతో జ్ఞాన సంపద లభిస్తోందని ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కె. సోమశేఖరరావు అన్నారు. లైబ్రరీ డెవలప్‌మెంట్‌పై జాతీయ స్థాయి సదస్సు ఆంధ్రలయోల కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానానికి కేంద్రాలన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు గ్రంథాలయాల్లో ఉండే పలు రకాల పుస్తకాలను చదవాలని కోరారు. తద్వారా సామాజిక, చారిత్రక, వైజ్ఞానిక అంశాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా మస్తిష్కం పరిణతి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత ఉద్యోగాలు సాధించేందుకు కావలసిన సిలబస్ గ్రంథాలయాల్లోనే లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జరిగిన లైబ్రరీల అభివృద్ధికి కొనసాగించవలసిన విషయాలను చర్చించారు. లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, రెక్టర్ ఫాదర్ బాలశౌరి, కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణతులాభారం నాటకం



విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని కళాశాలలోని కళావేదికపై తెనాలికి చెందిన వెంకట లక్ష్మీదుర్గా నాట్యమండలి నాటక సంస్థ మంగళవారం ప్రదర్శించిన శ్రీ కృష్ణతులాభారం నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. దీనికి రచన ముత్తరాజు సుబ్బారావు చేయగా శ్రీ కృష్ణుడిగా డాక్టర్ ఏ కోటేశ్వరరావు, నారదునిగా కె. గణేష్ కుమార్, సత్యభామగా రత్నశ్రీ, రుక్మిణిగా కె. విజయదుర్గ వసంతుకునిగా ప్రసాద్‌బాబు నటించారు. కార్యక్రమాలను సిద్ధార్థ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ శివకుమార్ నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు రంగస్థల నటులను ఆత్మీయంగా సత్కరించారు

విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న అతిథులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి. వీరబ్రహ్మాచారి సూచించారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ద్వితీయ స్నాతకోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అన్నారు. కమిషనర్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యలో నూతన సంస్కరణలు తీసుకువస్తోందన్నారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని కావున విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్ఆర్ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్, డాక్టర్ సీ. కృష్ణ, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ తులసి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పీజీ, డిగ్రీ పూర్తి చేసిన 290 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అధ్యక్షతన కళాశాలలో గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. గత సంవత్సర కాలంలో జరిగిన కార్యక్రమాలు, రాబోయే ఏడాది కాలంలో కళాశాల అభివృద్ధికి ఎటువంటి మార్పులు చేర్పులు చేయాలో సమావేశంలో చర్చించారు.

కిటకిటలాడిన దాసాంజనేయస్వామి దేవాలయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వైన్ షాపుల్లో మద్యం సీసాలను కొనుగోలు చేసి వాటిని బ్లాకులో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గవర్నర్‌పేటకు చెందిన ధనుష్, మహేష్ అనే వ్యక్తులు ప్రభుత్వ వైన్‌షాపులో పని చేస్తున్నారు. ఇక్కడ మద్యం సీసాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు బయట విక్రయించేందుకు ప్రయత్నిస్తూ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో సిబ్బంది నిందితులిద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 180 ఎంఎల్ విస్కీ బాటిల్స్ 18 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరు పరిచారు.

10 నుంచి గుప్తా నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నైనవరం ఫ్లై ఓవర్ సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో గుప్తా నవరాత్రి మహోత్సవాలను ఫిబ్రవరి 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9 రోజుల పాటు అమ్మవారు 9 విశేష అలంకారాల్లో పూజలు అందుకోనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు కలశ పూజ, సహస్ర నామార్చన, 8 గంటలకు హోమాలు నిర్వహిస్తారన్నారు.

క్లుప్తంగా...

మూడు రాజ్యసభ సీట్లను గెలుచుకుంటాం

ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, అమరావతి: రాజ్యసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మూడు సీట్లనూ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో చంద్రబాబు కుట్రలు ఫలించవన్నారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నిర్వహించిన వైఎస్ జగన్ నిర్వహించిన 'సిద్ధం' సభకు ఊహించని స్థాయిలో స్పందన లభించిందన్నారు. రానున్న రోజుల్లో ఏలూరు, అనంతపురంతోపాటు నెల్లూరు లేదా ఒంగోలులో సభలు ఉంటుందన్నారు. సీఎం జగన్ కార్యకర్తలను స్వయంగా కలిసి ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారన్నారు.

ప్రత్యేక హోదాపై పార్లమెంట్‌లో చర్చించాలి

- అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యవతి



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీపై ఈ సమావేశాల్లో చర్చించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ సత్యవతి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్వల్పకాలిక చర్చకు అనుమతివ్వాలని కోరారు. మంగళవారం పార్లమెంట్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిల నేతృత్వంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ సత్యవతి హాజరయ్యారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఆవశ్యకతను వివరిస్తూ చర్చకు పట్టుబట్టారు. విభజన చట్టానికి పదేళ్లు పూర్తవుతున్నాయని, కానీ ఇప్పటికీ చాలా హామీలు పూర్తి కాలేదని తెలిపారు. విభజన చట్టానికి కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో ఈ అంశంపై చర్చించి హోదాపై సానుకూలంగా ప్రకటన చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట్‌కు సకాలంలో నిధులు విడుదల చేయాలని, రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కేంద్రాన్ని కోరారు.

'ప్రత్యేక హోదా' ముగిసిన అధ్యాయం కాదు

జై భారత్ జాతీయ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



సీతమ్మధార (విశాఖ ఉత్తర): ప్రత్యేక హోదా, విభజన హామీలు ముగిసిన అధ్యాయాలు కావని, స్వార్థం కోసం ముగించిన అధ్యాయాలు మాత్రమేనని, ప్రజా ఉద్యమాల ద్వారా అందరం కలిసి సాధించుకునేందుకు సరైన సమయం వచ్చిందని జై భారత్ జాతీయ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఇందులో పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, ఆ సమయంలో కేంద్రంలో ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వలేమని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. దానికి రాష్ట్రంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వంత పాడిందని అన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ హోదా అంశంపై ఎన్నడూ మాట్లాడలేదని విమర్శించారు.

గడువులోపు పోలవరం పూర్తి చేసేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

సాక్షి, అమరావతి: పోలవరం బహుళార్థ సాధక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్దిష్ట గడువులోపు పూర్తి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర జలవనరుల శాఖను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. పోలవరం ప్రాజెక్టుకు ఎగువన కాఫర్ డ్యామ్‌ను నిర్మించకుండానే డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై విచారణకు ఆదేశించకపోవడాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ అమలాపురానికి చెందిన న్యాయవాది వి.రమేష్‌చంద్రవర్మ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరిపే అవకాశం ఉంది.

అమరావతే రాజధాని

దగ్గుబాటి పురందేశ్వరి

గుంటూరు మెడికల్: అమరావతే రాజధాని అన్న మాటకు కట్టుబడే అప్పట్లో కేంద్రం రూ.2,500 కోట్లు రాజధాని నిర్మాణానికి కేటాయించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో బీజేపీ విజయసంకల్ప పాదయాత్ర ముగింపు సభ మంగళవారం గుంటూరు హిందూ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా పురందేశ్వరి, ఖాదీ కమిషన్ మెంబర్ లలిత్ షా, నరేంద్రకుమార్ హాజరయ్యారు. పురందేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీకి సమ్మతించి, ఇప్పుడు మడమ తిప్పడం అన్యాయమన్నారు.

ఆదాయం పెరిగినా ఏడుపేనా!?

సాక్షి, అమరావతి: చంద్రబాబు అధికారంలో ఉంటే రాష్ట్రం సర్వనాశనమైనా అంతా బాగున్నట్లు చిత్రీకరించే రామోజీరావు.. సీఎం వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం వృద్ధి చెందుతున్నా.. తిరోగమనంలో ఉన్నట్లు దుష్ప్రచారం చేస్తూ తన కడుపుమంట చల్లార్చుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం రాకపోతే వృద్ధిలేదు, స్థిరాస్తి రంగం దెబ్బతిందని ఆయన పత్రికలో చాటింపు చేస్తూ.. అదే ఆదాయం పెరిగితే మార్కెట్ విలువలను పెంచడంవల్లే ఆదాయం పెరిగినట్లుగా వక్రీకరిస్తూ తన వక్రబుద్ధి చాటుకున్నారు. స్థిరాస్తి రంగం వృద్ధి చెందడంవల్లే ఆదాయం పెరిగిందని రాయడానికి ఈనాడుకు మనసొప్పదు.. చేతులూ రావు. ఎందుకంటే సీఎం కుర్చీలో తన ఆత్మబంధువు చంద్రబాబు లేరు కాబట్టి.

రిజిస్ట్రేషన్లపై రామోజీ ద్వంద్వ రాతలు



కరిగిపోయిన స్థిరాస్తి కల

పొరుగు రాష్ట్రం తెలంగాణలో భారీ వృద్ధి

30-1-2023: ఆంధ్రాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పడిపోయిందని, తెలంగాణలో పెరిగిందని వివిధ అంశాలను ముడిపెడుతూ ఈనాడులో రాసిన కథనం



ఫీజులు పెంచు.. ఖజానా నింపు

29-1-2024: ఆంధ్రాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పెరిగితే వాస్తవాలను వక్రీకరిస్తూ చార్జీలు పెంచారని రాసిన కథనం

వినూత్న చర్యలతో పెరిగిన ఆదాయం



నిజానికి.. కొత్త జిల్లాల ఏర్పాటు, **రిజిస్ట్రేషన్ల** శాఖ వినూత్న మార్పులతో రాష్ట్రం**లో** రిజిస్ట్రేషన్ల ఆదాయం బాగా పెరిగి**ంది.** అయినా ఆ ఘనత ప్రభుత్వానికి ఇవ్వడం మానేసి ప్రభుత్వాన్ని అపహాస్యం చేసేలా కార్టూన్ వేసి ఈనాడు రామోజీ తన కుసంస్కారాన్ని ప్రదర్శించారు. మార్కె**ట్** విలువల్ని పెంచడంవల్లే ఆదాయ**ం** పెరిగిందన్న అడ్డగోలు వాదనకు **దిగారు.** రిజిస్ట్రేషన్ రేట్లు పెంపును శాస్త్రీయంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో కాకుండా 19 శాతం గ్రామాల్లో మాత్రమే చేపట్టిన విషయం తెలిసి కూడా ఆ పత్రిక దాచిపెట్టింది. చంద్రబాబు హయాంలో అన్ని గ్రామాలు, పట్టణాలను **పరిగణన**లోకి తీసుకుని మార్కెట్ **విలువ**ను పెంచారు. అదే సమయంలో **చుక్క**ల భూములు, షరతుగల **భూ**ములు, ఈనాం భూములు **వం**టి లక్షలాది ఎకరాల **భూ**ములపై ఉన్న ఆంక్షలను **ఎత్తి**వేయడంతో అవన్నీ మార్కెట్‌లోకి **రావడం**తో ఇప్పుడు ఆర్థిక లావాదేవీలు **పెరిగి రిజిస్ట్రే**షన్లు పెరిగాయి. 2014–15లో 13.70 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా 2022–23లో 26.25 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. రాష్ట్రంలో పెరిగిన ఆర్థిక వృద్ధి, రియల్ ఎస్టేట్ పెరగడంవల్లే రిజిస్ట్రేషన్లలో ఈ పెరుగుదల సాధ్యమైందనేది సుస్పష్టం. అందుకనుగుణంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా పెరిగింది. కానీ, ఈ విషయాన్ని పక్కనపెట్టి తన పైత్యం, ద్వంద విధానంతో ప్రజలను మభ్య పెట్టేందుకు చార్జీలు పెంచేశారని ఈనాడు అడ్డగోలుగా రాసిపారేసింది.

ప్రజలకు సౌకర్యంగా రిజిస్ట్రేషన్ సేవలు..

నిజానికి రిజిస్ట్రేషన్ల శాఖ వైఎస్ జగన్ హయాంలో అత్యంత ఆధునికతను సంతరించుకుంది. కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను మరింత సౌకర్యవంతం చేసింది. ఇందులో ప్రజలే డాక్యుమెంట్ తయారుచేసుకునే అవకాశాన్ని కల్పించింది. రిజిస్ట్రేషన్ కోసం టైం స్లాట్ బుక్‌చేసే విధానాన్ని తీసుకొచ్చింది. ఈ–స్టాంపింగ్ విధానంవల్ల పెద్దఎత్తున మార్పులు తీసుకొచ్చింది.

ఇక్కడిలా.. తెలంగాణలో మరోలా..

జనవరి 30, 2023 తెలంగాణ ఎడిషన్‌లో ఇదే ఈనాడు 'తరిగిపోయిన స్థిరాస్తి కల' అని రాసింది. తెలంగాణలో రిజిస్ట్రేషన్ ఆదాయం భారీగా వృద్ధి చెందుతోందని, ఏపీలో పెరగడంలేదని అప్పట్లో అడ్డగోలు రాతలు రాసింది. కానీ, ఇప్పుడు అందుకు విరుద్ధంగా మరో కొత్త వితండ వాదాన్ని ఎత్తుకుంది. తెలంగాణలో 2015–16లో రూ.3,786 కోట్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం వస్తే, ఏపీలో 3,585.12 కోట్ల ఆదాయం వచ్చిందని, 2021–22 నాటికి తెలంగాణలో రూ.12,429 కోట్లు ఆదాయం రాగా ఏపీలో రూ.7,345.38 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చిందని అప్పట్లో శోకాలు పెట్టింది. అలాగే, 2019–20లో ఏపీలో రూ.4,886.65 కోట్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం ఉండగా, 2022–23 నాటికి రూ.8,079 కోట్ల ఆదాయం పెరిగిందని అదే ఈనాడు రాసింది.

ఈ మార్పులవల్ల ఆదాయం పెరగడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కానీ, దానికి వక్రభాష్యం చెబుతూ చేతికొచ్చింది రాసేసి తన పెన్నుకు బుర్రలేదని రామోజీ చాటుకున్నారు.

మార్కెట్ విలువలపై పచ్చి అబద్ధాలు

జగన్ పాలనలో తొమ్మిదిసార్లు మార్కెట్ విలువలు పెంచినట్లు పచ్చి అబద్ధాలు రాసింది. వాస్తవానికి ఐదేళ్లలో ఐదుసార్లు మార్కెట్ విలువల్ని సవరించాల్సి వున్నా కేవలం రెండు సాధారణ సవరణలు మాత్రమే చేసింది. మరో మూడుసార్లు ప్రత్యేక రివిజన్‌ను కొన్ని ప్రాంతాల్లో మాత్రమే చేసింది. 90 శాతం గ్రామాల్లో ఈ ఐదేళ్లలో ఒక్కసారి మాత్రమే మార్కెట్ రేట్ల సవరణ జరిగింది. అదే చంద్రబాబు హయాంలో అర్బన్ ప్రాంతంలో ఐదుసార్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసార్లు మార్కెట్ విలువల్ని సవరించారు. ఈ వాస్తవాలకు మసిపూసి ఈనాడు వంకర రాతలు రాసింది.

ఇది పేదల ప్రభుత్వం

- మంగళగిరిలో వైఎస్సార్‌సీపీదే గెలుపు
- రాజ్యసభ ఎంపీ వి.విజయసాయిరెడ్డి



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న విజయసాయిరెడ్డి తదితరులు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, దేశంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని రాజ్యసభ సభ్యుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరులో రూ.8.5 కోట్లతో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రీడా ప్రాంగణాన్ని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవిలతో కలిసి ఎంపీ ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి జిల్లాలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని సీఎం నిర్ణయించినట్లు తెలిపారు. పరిపాలనలో సీఎం జగన్ సామాజిక న్యాయం చేశారని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి నాడు–నేడు కింద వాటిని సీఎం ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. రాష్ట్రంలో సమసమాజ నిర్మాణం కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారని, అధికారానికి దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ప్రోత్సహిస్తూ సామాజిక సాధికార యాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో భూస్థాపితం అయ్యిందని, ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్ర ప్రజలకు ఆ పార్టీ తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంగళగిరిలో చేనేత సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధికంగా ఉన్నారని, దానిలో భాగంగానే ఆ సామాజిక వర్గానికే సీటును సీఎం జగన్ కేటాయించారని తెలిపారు. మంగళగిరిలో స్థానికుడిగా ఉన్న గంజి చిరంజీవి కావాలో.. హైదరాబాద్‌లో ఉండే టీడీపీ అభ్యర్థి కావాలో ప్రజలు తెల్చుకోవాలని అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగదని, కుటుంబం వ్యవహారాల వేరు... రాజకీయాలు వేరని.. ఈ రెండింటిని ముడిపెట్టడం తగదని వ్యాఖ్యానించారు.

175 స్థానాల్లో గెలుపు మాదే: మంత్రి కొట్టు



సింహాచలం: వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని.. విశాఖ సంగివలసలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన 'సిద్ధం' సభకు ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందనే అందుకు నిదర్శనమన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై గుండెల్లో ఉన్న ప్రేమను ఆ సభ ద్వారా ప్రజలు చాటుకున్నారని చెప్పారు. దుర్మార్గమైన పాలనకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని, 14ఏళ్ల పాలనలో ఆయన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు 'రా.. కదలిరా' అంటున్నా.. ఎవరూ కదలి రావటం లేదన్నారు. ప్రజలెవరూ రమ్మంటే వచ్చేయరని, అభిమానం ఉంటేనే వస్తారన్నారు.

ఆలయాల్ని అప్‌గ్రేడ్ చేశాం

రాష్ట్రంలోని పలు ఆలయాలను అప్‌గ్రేడ్ చేశామని, తద్వారా డిప్యూటీ కమిషనర్ పోస్టులను ఎక్కువగా సృష్టించామని మంత్రి సత్యనారాయణ తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తామన్నారు. ఇతర ఉద్యోగులకు కేడర్ స్ట్రెంగ్త్, సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇచ్చేందుకు జిల్లాల వారీగా జాబితాలను ఇప్పటికే తయారు చేశామని చెప్పారు. ఎన్ఎంఆర్‌లకు కూడా రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతి పొందే వీలుంటుందన్నారు. అన్ని ఆలయాల్లో ప్రసాదాల క్వాలిటీని పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే విజయవాడ దుర్గమ్మ ఆలయంలో క్వాలిటీని పెంచామని, భక్తుల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. అన్నప్రసాదాన్ని మరింత మంది భక్తులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజకీయ వ్యభిచారి చంద్రబాబు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజం



సాక్షి, రాజమహేంద్రవరం: తెలంగాణలో ఒక పార్టీ, ఇక్కడ మరొక పార్టీతో జత కట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ వ్యభిచారిగా తయారయ్యారని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విమర్శించారు. రాజమహేంద్రవరంలోని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వెన్నుపోటు పొడవటం, మోసం చేయడం అబద్ధాలు ప్రచారం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా చంద్రబాబు చేసిన హంగామాకు ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ముందుగా ఆ ఘటనకు క్షమాపణలు చెప్పాకే మాట్లాడాలని డిమాండ్ చేశారు. బ్లేడ్ బ్యాచ్ అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, గుండెల మీద చేయి వేసుకుని దీనివెనుక ఎవరున్నారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక సంఘ విద్రోహ శక్తులను అదుపు చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంతోపాటు పేదలకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. టీడీపీ హయాంలో చంద్రబాబు, లోకేశ్, మురళీమోహన్ వంటి వారంతా కలిసి ఇసుకను ఏవిధంగా దోచుకున్నారో, అవినీతి అనకొండలా ఎలా మారారో ప్రజలందరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇసుక విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తోందని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు విమర్శలు చూస్తుంటే దొంగే దొంగ అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. రాజానగరం సైతం ఆ పార్టీ గెలిచే అవకాశం లేదని టీడీపీ సర్వేలో తేలిపోవడంతో ఆ సీటును జనసేనకు తాకట్టు పెట్టారని అన్నారు. దమ్ముంటే రాజానగరం నుంచి తనపై పోటీ చేయాలని చంద్రబాబుకు ఆయన సవాల్ విసిరారు. పొత్తు లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేసే దమ్ముందా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు మద్దతిచ్చిన వారు ఆంధ్రా ద్రోహులే

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పాలసముద్రం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అసంబద్ధంగా చీల్చిన కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చేవారు ఆంధ్రా ద్రోహులేనని డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి స్పష్టంచేశారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండానే మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు ఆదరించరని చెప్పారు. ఆయన మంగళవారం పాలసముద్రం మండల కేంద్రంలో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి పేరునే అదే కాంగ్రెస్ పార్టీ ఎఫ్ఐఆర్‌లో చేర్చి, దారుణానికి పాల్పడిందని అన్నారు. వైఎస్ మరణానంతరం ఆయన బిడ్డలపై కేసులు పెట్టి, ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర ప్రజలు ఛీకొడుతున్నారని తెలిపారు. అటువంటి పార్టీలో వైఎస్ కుమార్తె షర్మిలమ్మ చేరడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజల ఆదరణ పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని షర్మిల విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. టీడీపీకి మేలు చేసేందుకే ఆమె కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తున్నారన్న అనుమానం వ్యక్తంచేశారు. వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసిన కాంగ్రెస్‌తో చేతులు కలిపి సొంత అన్న అయిన సీఎం వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రగతి పథంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను చూసి దేశం మొత్తం గర్వపడుతుంటే తెలంగాణ నుంచి వచ్చిన షర్మిలకు ఇక్కడి అభివృద్ధి కనిపించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఉన్న కోట్లాది అక్కచెల్లెమ్మలు జగనన్నకు అండగా ఉంటారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవడం తథ్యమన్నారు. పొదుపు మహిళల రుణమాఫీ చేస్తానంటూ 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మహిళలను మోసం చేశారని తెలిపారు. చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో డిఫాల్టర్లుగా మిగిలారన్నారు. డ్వాక్రా మహిళలకు టీడీపీ హయాంలో బ్యాంకుల్లో రుణాలిచ్చే పరిస్థితి లేకుండా పోయిందని గుర్తుచేశారు.

'రెడ్ బుక్' కేసు విచారణ 6వ తేదీకి వాయిదా

కౌంటర్ దాఖలుకు మరోసారి గడువు కోరిన లోకేశ్ న్యాయవాదులు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేలా నారా లోకేశ్ అధికారులను బెదిరిస్తున్నారని ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు కుంభకోణాల కేసుల విచారణ సందర్భంగా లోకేశ్‌కు ఇచ్చిన 41ఏ నోటీసులకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని సీఐడీ అధికారులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో బెదిరించిన విషయాన్ని ఆధారాలతో సహా సీఐడీ నివేదించింది. రెడ్ బుక్ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని కోరింది. కాగా, ఈ కేసులో జారీ చేసిన నోటీసులను తీసుకునేందుకు లోకేశ్ సుముఖత చూపలేదు. నోటీసులు అందించేందుకు రెండుసార్లు ఆయన ఇంటికి వెళ్లిన సీఐడీ అధికారులకు అందుబాటులోకి రాలేదు. దీంతో నోటీసులను పోస్టులో లోకేశ్ నివాసానికి పంపారు. ఆ నోటీసులను కూడా తీసుకునేందుకు ఆయన నిరాకరించారు. ఆ తర్వాత నోటీసులను లోకేశ్ మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపినా స్పందించలేదు. ఈ విషయాన్ని కూడా సీఐడీ అధికారులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో న్యాయస్థానం ద్వారా నోటీసులు జారీ చేయాలని కోర్టు రిజిస్ట్రార్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. లోకేశ్ గానీ, ఆయన తరఫు న్యాయవాదులు గానీ విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని గతంలో లోకేశ్ తరఫు న్యాయవాదులు కోరడంతో న్యాయస్థానం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. కాగా, మంగళవారం విచారణకు హాజరైన లోకేశ్ తరఫు న్యాయవాది తాము కౌంటర్ దాఖలు చేసేందుకు మరో వారం రోజులు గడువు కోరడం గమనార్హం. దీంతో న్యాయస్థానం విచారణను ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసింది.

ఉద్యాన వర్సిటీలో కృత్రిమ మేధ

- బోధనలో విప్లవాత్మక మార్పుల దిశగా అడుగులు
- సీఎం వైఎస్ జగన్ సూచనతో ఆచరణలోకి తెస్తున్న ఉద్యాన వర్సిటీ
- మెషిన్ లెర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్ తయారీ, వాడకంపై ప్రత్యేక కోర్సు
- ప్రొటోటైప్ రోబోటిక్ స్ప్రేయర్లను అభివృద్ధి చేసిన వర్సిటీ



యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన రోబోటిక్ స్ప్రేయర్

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగంలోనూ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) కీలక భూమిక పోషించబోతోంది. రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ డేటా, కృత్రిమ మేధ, ఇంటర్నెట్ డేటా, వాతావరణ సమాచార డేటా వంటి డిజిటల్ సాధనాలు రంగప్రవేశం చేయబోతున్నాయి. వ్యవసాయ రంగ భవిష్యత్‌ను పునర్నిర్మించేందుకు ఉపయోగపడే కృత్రిమ మేధస్సుపై యూనివర్సిటీ స్థాయిలో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్రంలోని యూనివర్సిటీలు అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే ఈ దిశగా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టగా.. తాడేపల్లిగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ కృత్రిమ మేధస్సును బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్‌లో ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చబోతోంది. అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డ్రోన్స్ అండ్ రోబోటిక్స్ ఇన్ హార్టికల్చర్ చాప్టర్‌ను ప్రవేశపెట్టారు. ఫార్మ్ పవర్, మెషినరీ అండ్ ప్రాసెసింగ్ ఎక్విప్‌మెంట్‌ను ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి తరగతి గది స్థాయిలో అమలులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రయోజనాలివీ..

వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తోంది. ఏఐ ఆధారిత వ్యవస్థల ద్వారా వాతావరణ స్థితిగతులు, నీటి పారుదల అవసరాలు, పంట ఆరోగ్యం, పోషక స్థాయిలపై కచ్చితమైన డేటా సేకరించడం, విశ్లేషించడం, క్రమబద్ధీకరించడం ద్వారా సమయం, వనరులు ఆదా అవుతాయి. ఏఐ, ప్రొటోటైప్ రోబోటిక్స్, రోబో స్ప్రేయర్లు, అధిక రిజల్యూషన్ కెమెరాలు, సెన్సార్లతో కూడిన డ్రోన్స్ వంటి డిజిటల్ సాధనాల వినియోగం ద్వారా కచ్చితమైన పంట పర్యవేక్షణ, నిర్వహణకు బాటలు వేస్తాయి. మొక్కలలో వ్యాధులు, తెగుళ్లు, పోషకాహార లోపాలను గుర్తించడంతోపాటు సిఫార్సు మేరకు సకాలంలో తగిన నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాలు తగ్గిస్తాయి. విత్తు నుంచి కలుపుతీత, పంటకోత వంటి శ్రమతో కూడిన పనులను మానవ రహితంగా చేయడం ద్వారా ఏళ్ల తరబడి వేధిస్తున్న కూలీల కొరత అధిగమించే అవకాశం ఏర్పడుతుంది. ఏఐ వినియోగం మరింత స్థిరమైన, పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాలను విస్తరించేందుకు దోహదం చేస్తాయి.

సీఎం వైఎస్ జగన్ ఆలోచన మేరకే..



సీఎం వైఎస్ జగన్ సూచన మేరకు వర్సిటీ స్థాయిలో కృత్రిమ మేధను బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్‌లో ఒక పాఠ్యాంశంగా చేర్చబోతున్నాం. ఎన్ఐటీ–టీ, జేఎన్‌యూకే సాంకేతిక సహకారంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆచరణలోకి తీసుకొస్తున్నాం.

– డాక్టర్ తోలేటి జానకిరామ్, వీసీ, ఉద్యాన వర్సిటీ

ప్రొటోటైప్ రోబోట్ స్ప్రేయర్ అభివృద్ధి

ఇప్పటికే రైతులకు ఉపయోగపడే ప్రొటోటైప్ (ప్రాథమిక) రోబోట్ స్ప్రేయర్‌ను వర్సిటీ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు అభివృద్ధి చేశారు. రిమోట్ సెన్సార్‌తో పనిచేసే ఈ స్ప్రేయర్లు కిలో మీటర్ పరిధిలో కనీసం 10–18 గంటల బ్యాటరీ సామర్థ్యంతో ఉపయోగించేలా తీర్చిదిద్దారు. వీటిని పాలీహౌస్‌లలో సాగవుతున్న క్యాప్సికం పంట సాగులో ప్రయోగాత్మకంగా వినియోగించి సత్ఫలితాలను రాబట్టారు. మరోవైపు జేఎన్‌టీయూకే, ఎన్ఐటీల సహకారంతో కృత్రిమ మేధస్సు ద్వారా వంగ పంటలో కీటకాల వర్గీకరణ, గుర్తింపు, నానో జీవ రసాయనాల ద్వారా కీటకాల నియంత్రణ చర్యలపై పరిశోధనా పత్రాలు భారతీయ కీటక శాస్త్ర విభాగ జర్నల్‌లో ప్రచురణకు నోచుకున్నాయి. కీటకాల వర్గీకరణను కృత్రిమ మేధస్సు ద్వారా గుర్తించే ఈ ప్రయత్నంలో 95–98 శాతం కచ్చితత్వం కనిపించిందని నిర్ధారించారు.

క్లుప్తంగా...

సంక్షేమ సారథి జగన్‌ను ఓడించాలా?

చంద్రబాబుపై మంత్రి చెల్లుబోయిన ధ్వజం



సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్ర ప్రజలకు సంక్షేమాన్ని నేరుగా గుమ్మం వద్దకే అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని పిలుపునివ్వడం చంద్రబాబు నీచ బుద్ధికి నిదర్శనమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. నిజంపై నిందలు వేసి, ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. చంద్రబాబు జీవితంలో అన్నీ మోసాలు, కుట్రలు, కుతంత్రాలేనని దుయ్యబట్టారు. వృద్ధులు, రైతులు, మహిళలు, యువతను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. పెత్తందార్లకు కొమ్ము కాసే చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదని చెప్పారు. బాపూజీ సత్యమేవ జయతే అంటే.. చంద్రబాబు అసత్యమేవ జయతే అంటున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ప్రజల సంక్షేమంకంటే ఆయన కొడుకు 'సన్'క్షేమమే ముఖ్యమన్నారు.

బాబు మాటలు నమ్మొద్దు

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తిరుపతి మంగళం (తిరుపతి జిల్లా): చంద్రబాబు నాయుడు మాయమాటలు నమ్మి మరోసారి మహిళలు మోసపోవద్దని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సూచించారు. మంగళవారం తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లో నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. డ్వాక్రా సంఘాల మహిళలకు ఏనాడూ ఒక్క రూపాయి కూడా అందించని చంద్రబాబు అధికారంలోకి వస్తే అక్కచెల్లెమ్మలకు అవి చేస్తా, ఇవి చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను మళ్లీ మోసగించేందుకు పవన్ కళ్యాణ్‌తో జతకట్టి మాయమాటలు చెబుతున్నాడని, వాటిని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. పేద ప్రజలకు జగనన్న మేలు చేశారని నమ్మితే తిరిగి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం రూ.8.05 కోట్ల ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

విభజన సమస్యలపై ప్రధానికి షర్మిల లేఖ

సాక్షి, అమరావతి: ఏపీ విభజన చట్టం, 2014లో పొందుపరిచిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తూ ప్రధాని మోదీకి ఏపీసీసీ చీఫ్ షర్మిల మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రాన్ని ఆదుకునే బాధ్యత కేంద్రానిదేనని, విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగు, భవిత కోసం తాను ఈ లేఖ రాస్తున్నానని పేర్కొన్నారు. నాటి యూపీఏ ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపరిచిన వాగ్దానాలను అమలుపరచాలని, అసంపూర్ణ వాగ్దానాలను రేపటి పార్లమెంట్ బడ్జెట్ సెషన్స్‌లో జరిగే రాష్ట్రపతి ఉపన్యాసంలో పొందుపర్చాలని, వాటిపై ఎన్నికల ముందే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్ల తర్వాత ప్రజలను తీవ్ర నైరాశ్యంలోకి తోసేస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాల అమలుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, స్పెషల్ స్టేటస్, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఈ రెండూ అత్యంత ప్రముఖమైన వాగ్దానాలని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించుకోవాలని కోరారు.

మళ్లీ బీజేపీ గెలిస్తే దేశం కోలుకోదు


సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర: వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలిస్తే దేశం కోలుకోదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత 65 ఏళ్ల పాలనలో దేశం అప్పులు రూ.47 లక్షల కోట్లు ఉండేవని తెలిపారు. అయితే పదేళ్ల బీజేపీ పాలనలో ఏకంగా రూ.116 లక్షల కోట్లకు పెరిగాయన్నారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ పార్టీ అని ఎద్దేవా చేశారు. ప్రాంతీయ పార్టీలు సమాజానికి, రాష్ట్రాలకు చీడపురుగు లాంటివన్నారు. భవిష్యత్ కాంగ్రెస్ దేనన్నారు. ఫిబ్రవరి 1న పీసీసీ చీఫ్ షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఢిల్లీ వెళ్లి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అంశాలు అమలు చేయాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు.

పేదల చెంతకు శ్రీమంతుల చదువులు





ప్రభుత్వ పాఠశాలల్లో 'ఐబీ' విద్య అమలుకు శ్రీకారం • నేడు ఎస్సీఈఆర్టీ, ఐబీ బోర్డు ఒప్పందం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా విధానంలో మరో విప్లవాత్మక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన సహా అనేక సంస్కరణలు తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. ఇప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రైవేటు పాఠశాలల్లో శ్రీమంతుల పిల్లలు చదువుకునే 'ఇంటర్నేషనల్ బాకలారియెట్' (ఐబీ) సిలబస్‌ను కూడా పేద పిల్లలకు చేరువ చేస్తున్నారు. ఐబీ సిలబస్ అమలుపై బుధవారం సాయంత్రం ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ) అధికారులతో ఐబీ ప్రతినిధులు ఒప్పందం చేసుకోనున్నారు. దీంతో మన ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడి నెగ్గేలా తీర్చిదిద్దడంలో మరో కీలక అడుగు పడనుంది.

2024 – 25 విద్యా సంవత్సరంలో ఐబీ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వారిలో బోధన సామర్థ్యం, నైపుణ్యం పెంచేలా ఈ శిక్షణ ఉంటుంది. టీచర్లతో పాటు మండల, జిల్లా విద్యాధికారులు, ఎస్సీఈఆర్టీ, డైట్ సిబ్బంది, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డు సిబ్బందికి 'ఐబీ'పై అవగాహన, సామర్థ్యం పెంచేలా శిక్షణనిస్తారు. దీంతో వారంతా ప్రతిష్టాత్మక ఐబీ గ్లోబల్ టీచర్ నెట్‌వర్క్‌లో భాగమవుతారు. 2025 జూన్ నుంచి ఒకటో తరగతిలో ఐబీ సిలబస్ బోధన ప్రారంభమవుతుంది. ఏటా ఒక్కో తరగతికి ఈ సిలబస్‌ను పెంచుతూ 2035 నాటికి 10వ తరగతి, 2037కి 12వ తరగతిలో అమలు చేస్తారు. పరీక్షల అనంతరం ఐబీ బోర్డు, ఏపీఎస్సీఈఆర్టీ ఉమ్మడిగా సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తాయి. ఈ సర్టిఫికెట్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు సైతం ఉంటుంది.

2019 నుంచే గ్లోబల్ సిటిజన్స్ ప్రణాళిక

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను గ్లోబల్ విద్యార్థులుగా తీర్చిదిద్దే ప్రక్రియను వైఎస్ జగన్ ప్రభుత్వం 2019 నుంచే ప్రారంభించింది. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు ఉత్తమంగా ఎదిగేందుకు 56 నెలల్లో దాదాపు రూ.73 వేల కోట్లు విద్యా సంస్కరణల కోసం వెచ్చించింది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా తీర్చి దిద్దుతోంది. జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద తదితర విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేసి విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసింది. ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రారంభించింది. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. పాఠశాలలను సీబీఎస్ఈ బోర్డుకు అనుసంధానించింది. విద్యార్థులకు బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్ నుంచి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ వరకు 9 వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్‌ను అందిస్తోంది. పిల్లల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో పాటు సులభంగా ఇంగ్లిష్ అర్థమయ్యేలా మార్పులు చేసింది. నాలుగు నుంచి 12వ తరగతి వరకు ఉచిత బైజూస్ కంటెంట్, 8వ తరగతి విద్యార్థులకు, టీచర్లకు బైజూస్ కంటెంట్‌తో ఉచిత ట్యాబ్స్ పంపిణీ చేసింది. హైస్కూల్ స్థాయిలో ప్రతి తరగతి గదిలో డిజిటల్ బోధన కోసం 62 వేల ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలు, ఇంగ్లిష్ ల్యాబ్స్ ఏర్పాటు చేసింది. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించేందుకు మూడో తరగతి నుంచి టోఫెల్ శిక్షణనిస్తోంది. ఐబీ సిలబస్‌ను సులభంగా అర్థం చేసుకునేందుకు, అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునేందుకు ఈ మార్పులు దోహదం చేస్తాయి.

ఐబీ విద్యా బోధనలో ఎన్నో ప్రత్యేకతలు

ఐబీ విద్య ప్రపంచంలోనే అత్యుత్తమ బోధన పద్ధతిగా గుర్తింపు పొందింది. బట్టీ చదువులకు స్వస్తి చెబుతూ థియరీతో పాటు ప్రాక్టికల్ అప్లికేషన్ పద్ధతిలో బోధన సాగుతుంది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది. ప్రస్తుత, భావితరాల అవసరాలకు అనుగుణంగా సిలబస్, బోధన, మూల్యాంకనం ఉంటుంది. చదువుతోపాటు ప్రాక్టికల్స్, విద్యార్థుల్లో నైపుణ్యాల (స్కిల్స్)కు ప్రాధాన్యతనిస్తారు. సంగీతం, నృత్యం, క్రీడలు వంటి ఇతర అంశాల్లోనూ తర్ఫీదు ఇస్తారు. ఇంటర్ డిసిప్లినరీ కాన్సెప్ట్ (వాస్తవిక జీవిత అంశాలు) ఆధారంగా బోధన సాగుతుంది. ఈ సిలబస్‌ను అభ్యసించిన విద్యార్థులు ఇతరులతో పోలిస్తే ప్రపంచంలోని అత్యుత్తమ యూనివర్సిటీల్లో మూడు రెట్లు అధికంగా ప్రవేశాలు పొందుతున్నారు. ప్రపంచస్థాయి ఉద్యోగావకాశాలను సైతం వేగంగా అందుకుంటున్నారు.

టీడీపీ 'ఐ' గేమ్..!


టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారంటూ ఫిర్యాదులు

- ఓట్ల తొలగింపునకు ఫారం-7 నమోదు చేయించేది ఐ టీడీపీ సభ్యులే
- కానీ నేరం వైఎస్సార్‌సీపీపై నెట్టేలా పచ్చపత్రికల ద్వారా దుష్ప్రచారం
- అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా రోజూ వ్యతిరేక వార్తలు
- ఎన్నికల కమిషన్‌కు వివరణ ఇచ్చుకోలేక అధికారుల సతమతం
- నెల్లూరు జిల్లాలో వెలుగులోకి వచ్చిన ఐ–టీడీపీ కుట్రకోణం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు

'ఉదయగిరి మండలం గండిపాళెంలోని 31, 32 పోలింగ్ కేంద్రాల పరిధిలో 42 మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు రాపల్లె శ్రీనివాసులు అనే వ్యక్తి దరఖాస్తు చేశారు. దీనిపై టీడీపీ నాయకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు.'

– ఇది ఈనాడు పత్రికలో వచ్చిన వార్త.



వాస్తవం ఏంటంటే...

గండిపాళెంలో 42 మంది ఓట్ల తొలగింపు కోసం ఫారం-7 ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం నిజమే. కానీ రాపల్లె శ్రీనివాసులు పేరుతో నమోదు చేసింది మాత్రం జిల్లా ఐ టీడీపీ వింగ్‌లో ఉన్న కీలక వ్యక్తి. గండిపాళేనికి చెందిన ఐ టీడీపీ లీడరే రాపల్లె శ్రీనివాసులు పేరుతో ఫారం-7 నమోదు చేయించి ఆ నేరం వైఎస్సార్‌సీపీపై నెట్టేశారు. ఎలక్షన్ కమిషన్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. పచ్చపత్రికలో దీనిపై వార్త కూడా ప్రచురించేశారు. ఆ 42 మంది అసలు స్థానికులు కారు. వ్యాపారాల పేరుతో గత 20 ఏళ్లుగా హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, బెంగళూరు ప్రాంతాల్లో స్థిరపడిన వారే. వారి ఆధార్ కార్డులు పరిశీలించినా స్థానికేతరులని తెలుస్తుంది. కానీ తహసీల్దార్ వాస్తవాలు తెలుసుకోకుండా పచ్చపత్రిక ప్రభావం, స్థానిక టీడీపీ నేతల ఒత్తిడితో రాపల్లె శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు.

ఇరకాటంలో అధికారులు

టీడీపీ చేస్తున్న ఈ పన్నాగంతో అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది. ముందుగా ఐ టీడీపీ సభ్యులు ఫారం-7 దరఖాస్తులు పంపి ఎల్లో మీడియాలో అవి వైఎస్సార్‌సీపీ నాయకులు పంపినట్లుగా కథనాలు రాయిస్తున్నారు. రోజూ అధికారులపై వ్యతిరేక వార్తలు రాయించి వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. నెల రోజులుగా జిల్లాల్లో ఓటర్ల జాబితాలో లోపాలున్నాయంటూ ఎల్లో మీడియాలో నిత్యం వార్తలు వస్తూనే ఉన్నాయి. వాటిపై టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం, వాటిని జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల కమిషన్ పంపి విచారణలు చేయించడం జరుగుతోంది. ఇలా అధికారులపై కొత్తరకం దాడి చేయిస్తున్నారు.

స్వచ్ఛమైన జాబితాలపైనా టీడీపీ కుయుక్తులు

స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలు రూపొందిస్తున్నప్పటికీ దాన్ని అడ్డుకునేందుకు టీడీపీ రకరకాల కుయుక్తులు పన్నుతోంది. తాజాగా టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారంటూ అభూత కల్పన కోసం ఐ టీడీపీ వింగ్‌ను టీడీపీ రంగంలోకి దింపింది. ఆ టీం సభ్యులు టీడీపీ సానుభూతిపరులు అధికంగా ఉన్న గ్రామాలను ఎంచుకుంటున్నారు. ఆ గ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాలలో వ్యాపార నిమిత్తం స్థిరపడి ఉండి టీడీపీ సానుభూతిపరులైన వారిని ఎంపిక చేసుకుని వారి ఓట్లు తొలగించమని, ఈ మెయిల్స్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫారం-7ను నమోదు చేయిస్తున్నారు. వెంటనే స్థానిక టీడీపీ నేతల చేత ఫిర్యాదులు చేయిస్తున్నారు.

చంద్రబాబు విజన్ అంతా విషమే

మంత్రి మేరుగు నాగార్జున ధ్వజం



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకు విజన్ లేదని, ఆయనలో ఉన్నదంతా విషమేనని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. రా..కదలిరా సభల్లో చంద్రబాబు తనది విజన్, జగన్‌మోహన్‌రెడ్డిది పాయిజన్ అంటూ చేసిన ఆరోపణలపై మంత్రి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు, వైఎస్ జగన్‌లో ఎవరి విజన్ ఏమిటో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసన్నారు. చంద్రబాబు విజన్ గొప్పదైతే 14 ఏళ్లు సీఎంగా కొనసాగిన కాలంలో తన విజన్‌తో ఏ అద్భుతమైన పథకాలు సృష్టించారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్ తన విజన్‌తో అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, నాడు-నేడు, జగనన్న చేయూత, జగనన్న చేదోడు, జగనన్న ఆసరా, రైతు భరోసా, నేతన్న నేస్తం, వాహనమిత్ర, ఆరోగ్య భరోసా, ఆరోగ్య సురక్షా వంటి ఎన్నో గొప్ప పథకాలను తీసుకొచ్చారని వివరించారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిట్లోకి తీసుకొచ్చి గాంధీజీ కలలను నిజం చేస్తూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను సీఎం జగన్ సృష్టించారని గుర్తు చేశారు. సీఎం జగన్ పేరు తలుచుకుంటే ఎన్నో పథకాలు గుర్తొస్తాయని, అదే చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చే పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేసే పథకాలపై విషం చిమ్ముతూ కోర్టులకు వెళ్లి అడ్డుకోవడమే చంద్రబాబు, ఆయన విష పత్రికల విజన్ అని విమర్శించారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలిచ్చినా, పేద పిల్లలకు ఇంగ్లిష్ విద్యను నేర్పించాలనుకున్నా, అభివృద్ధి వికేంద్రీకరణతో రాష్ట్రమంతటినీ సమగ్రంగా అభివృద్ధి చేయాలనుకున్నా వాటన్నింటినీ కోర్టులకెక్కి అడ్డుకోవడమే ఆయన నైజమని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ సీఎం జగన్‌కే పట్టం కట్టడం ఖాయమన్నారు. ఎన్నికల శంఖారావం పూరిస్తూ నిర్వహించిన 'సిద్ధం' సభకు తరలివచ్చిన లక్షలాది మంది ప్రజలే అందుకు నిదర్శనమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

బతికున్నోళ్లను చంపేసిన 'పచ్చ'పత్రిక



శాంతిప్రియ

డోన్ (నంద్యాల): సజీవంగా ఉన్న వారిని మృతి చెందారంటూ తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు పత్రిక అధిపతి రామోజీపై సంబంధిత వ్యక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డోన్ పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన కొండవేగు శాంతిప్రియతో పాటు ఆమె భర్త పేర్లు ఓటరు జాబితాలో ఉండడాన్ని ఉదహరిస్తూ వీరు మృతి చెంది రెండు సంవత్సరాలు అయిందంటూ ఈనాడులో తప్పుడు కథనం ప్రచురించడంపై శాంతిప్రియ అవాక్కయ్యారు. ఎక్స్‌బివై 2122539 అనే ఓటరు కార్డుతో 17వ వార్డు 11వ సచివాలయంలో తాను నివశిస్తున్నానని.. అయితే పచ్చపత్రిక ఈనాడులో 'ఆత్మకు ఓట్లు' అనే శీర్షికన తన పేరును ప్రచురించడం దుర్మార్గమైన చర్య అని శాంతిప్రియ మండిపడ్డారు. ఇటీవల కొందరు వ్యక్తులు మృతి చెందారంటూ వారి ఫొటోలను ఈనాడులో ప్రచురించడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

బాబుది దుర్మార్గపు మనస్తత్వం

1,220వ రోజుకు చేరిన బహుజన రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలలో బహుజన నాయకులు

తాడికొండ: ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్న చంద్రబాబు నాయుడిది దుర్మార్గపు మనస్తత్వమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుంటే ఓర్వలేక బాబు అండ్ కో దుష్ప్రచారానికి దిగుతుందని మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,220వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో మంగళవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కులవాదమే అజెండాగా ఏపీలో రాజకీయాలు నడుస్తున్నాయనేందుకు అమరావతి ఉద్యమమే ఓ ఉదాహరణ అన్నారు. ముందస్తు వ్యూహంతో ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి వాటికి పదింతలు ధరలు పెంచి అమ్ముకోవాలని చూసిన ఎన్ఆర్‌ఐలు అంతా ఈ వ్యవహారంలో భాగస్వాములై ఉన్నారన్నారు. మూడు రాజధానుల ద్వారానే ఏపీ అభివృద్ధి జరుగుతుందని నమ్మినందునే గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు భారీ విజయం కట్టబెట్టారన్నారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో చిత్తు'పొత్తాట'

- ఎంపీ సీటు కోసం తాప'త్రయం'
- కొణతాలపై మాటల 'దాడి'
- తానే 'చక్రవర్తి' అంటున్న టీడీపీ నేత
- రూ.50 కోట్లు డిపాజిట్ చేసినట్టు అనుచరుల వద్ద ప్రస్తావన

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సీట్ల కోసం తెలుగుదేశం–జనసేన పార్టీల మధ్య చిత్తుపత్తు(బొమ్మా బొరుసు) ఆట సాగుతోంది. పొత్తు పితలాటకం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే ఇరు పార్టీలు చర్చలు జరపకుండా చెరో రెండు సీట్లకు అభ్యర్థులను ప్రకటించాయి. ఈ మంటలు చల్లారకముందే.. అనకాపల్లి ఎంపీ సీటు కోసం నేతల మధ్య తాపత్రయం పెరిగిపోతోంది. మాటల 'దాడి' జరుగుతోంది. జనసేన నుంచి ఎంపీ సీటు ఆశించి పార్టీలో చేరుతున్న కొణతాల రామకృష్ణపై తాజాగా తెలుగుదేశంలో చేరిన దాడి వర్గం మాటల దాడికి దిగింది. అయితే తమ నేత అధికారికంగా జనసేనలో చేరిన తర్వాత అసలు కథ మొదలవుతుందంటూ కొణతాల వర్గం కౌంటరిస్తోంది. అసలు అనకాపల్లి ఎంపీ సీటుకు తానే 'చక్రవర్తి'నని తెలుగుదేశం నుంచి మరో నేత ఢంకా భజాయించి మరీ చెప్పుకుంటున్నారు. ఇందుకోసం తాను ఇప్పటికే 'సత్య'ప్రమాణంగా రూ.50 కోట్లు డిపాజిట్ చేశానని చెబుతున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ తనకు సీటు ఇవ్వకపోతే డబ్బు తిరిగి ఇవ్వాలని కూడా అధిష్టానం నియమించిన 'సత్య'దూతకు ఇప్పటికే స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో అనుమానం అవసరం లేదని, తన మాటలే 'సత్య'మని ఆ దూత బుజ్జగించినట్టు తెలుస్తోంది.

చీదరింపుల నుంచి చైతన్యం వరకు..

నాడు దీనస్థితిలో ఉన్న మహిళలు నేడు సగర్వంగా జీవిస్తున్నారు. సకాలంలో అప్పు చెల్లించక బ్యాంకర్ల నుంచి చీదరింపులతో వారు అధోగతి పాలయ్యారు. కానీ సీఎం జగన్ ఇచ్చిన ఆసరాతో వారి జీవన విధానం మారిపోయింది. అప్పులన్నీ క్రమంగా కనుమరుగయ్యాయి. ఇప్పుడు డ్వాక్రా సంఘాలన్నీ లావాదేవీలతో కళకళలాడుతున్నాయి. సంఘాలు గాడిన పడటంతో మహిళలు వివిధ రంగాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో సకాలంలో అప్పులు చెల్లిస్తూ అభివృద్ధి బాటన పయనిస్తున్నాయి. ఇప్పుడు మహిళలంతా ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. టైలరింగ్, పాల వ్యాపారం, కిరాణా, కూరగాయలు వ్యాపారంలో దూసుకుపోతున్నారు. వారికి మనస్ఫూర్తిగా కుటుంబ సభ్యుల నుంచి ప్రోత్సాహం లభిస్తోందని ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇదంతా ప్రభుత్వ చలవేనని 'ఆసరా సంబరాల్లో' వెల్లడిస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

కూల్ డ్రింక్స్ షాపు పెట్టుకున్నా



నాకు ఆసరా పథకం కింద ప్రభుత్వం అందజేసిన రూ.2 లక్షలతో కూల్ డ్రింక్స్ దుకాణం పెట్టుకున్నాము. మాకు ఇద్దరు ఆడపిల్లలు. గతంలో నాభర్త చిన్న వెంకట సుబ్బయ్య ప్రైవేటు షాపులో గుమస్తాగా పనిచేసేవారు. ఆ సమయంలో కుటుంబం పోషణ భారమైంది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రూపులో సభ్యురాలిగా చేరాను. దీంతో ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షలు ఎంతో అండగా నిలిచాయి. ఇప్పుడు మా కుటుంబం హాయిగా ఉంది.

– పంట మల్లీశ్వరి, భగత్‌సింగ్ కాలనీ, మార్కాపురం, ప్రకాశం జిల్లా

పంటకు సాయం చేస్తున్నా



నేను కనక దుర్గ స్వయం సహాయక సంఘం సభ్యురాలిని. ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీ చేసి అందిస్తున్న సొమ్మును నేను సొంతంగా వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నాను. ఏడాదికోసారి నాకు రూ.12,607 చొప్పున అందాయి. నాలుగు సంవత్సరాలుగా ఎస్‌హెచ్‌జీ ద్వారా మొత్తం రూ.48వేలు ఆసరా డబ్బు వచ్చింది.డ్వాక్రా రుణమాఫీ సొమ్మును సద్వినియోగంచేసుకోవడం సంతోషంగావుంది.

– శంకరమ్మ, తిమ్మాపురం, వైఎస్సార్ జిల్లా

మా బతుకులు మారాయి



నేను మేదర వృత్తిలో భాగంగా వెదురు కర్రలతో తట్టలు, బుట్టలు, చాపలు అల్లుకొంటూ జీవిస్తుంటాము. మా డ్వాక్రా సంఘం నుంచి నాకు రూ.57,136 ఆసరాగా లబ్ధి చేకూరింది. దీనికి తోడు ముఖ్యమంత్రి అమలు చేసిన చేయూత పథకంలో లబ్ధి పొందాను. దీంతో నా వ్యాపారం మరింత అభివృద్ధి చేసుకోవడానికి వీలు కలిగింది. ఇలాంటి నేత జీవిత కాలం ఉంటే మా జీవితాలు అభివృద్ధి చెందుతాయి.

– రొట్టా సారాకుమారి, 11వవార్డు, సామర్లకోట, కాకినాడ జిల్లా

గర్వంగా జీవిస్తున్నాం



ఈ చిత్రంలో కనిపిస్తున్నామె పేరు ముప్పిరి సుందరమ్మ. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారాంపురంలో ఉంటారు. గతంలో రుణం తీసుకుంటే తిరిగి కట్టడానికి మాత్రమే మా సంపాదన సరిపోయేదని చెబుతోంది. ఆసరా పథకం ద్వారా మా గ్రూపునకు రూ.2.44 లక్షలు రుణమాఫీ చేశారని, విడతకు ఒక్కొక్కరికి రూ.6,100 చొప్పున 4 విడతలుగా రుణమాఫీ జరిగింది. వితంతు పింఛను ప్రతినెలా అందుతున్నాయి. ఇంటి వద్ద చిల్లర కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని చెబుతోంది.

– ముప్పిరి సుందరమ్మ, సీతారాంపురం, ప.గో. జిల్లా

అప్పులు తీర్చేశాం..



ఈమె పేరు పీరమ్మ చిత్తూరు జిల్లా తిరుపతిలోని అశోక్ నగర్‌లో ఉంటోంది. ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ. లక్ష లబ్ధి చేకూరింది. గతంలో మాకు అప్పులుండేవి. ప్రభుత్వం చేసిన ఆ సాయంతో అప్పులు మొత్తం తీర్చేశాము. ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా బతుకుతున్నాము. ఇలాంటి ప్రభుత్వం కలకాలం ఉంటే మహిళలు సగర్వంగా నిలబడతారు.

– పీరమ్మ, అశోక్ నగర్, తిరుపతి

టైలరింగ్‌తో సంపాదిస్తున్నా



ఈమె పేరు కాళ్ల సన్యాసమ్మ. భీమిలి మండలం శింగనబంధ. మణికంఠ గ్రూప్‌లో సభ్యురాలు ఆసరా ద్వారా నాలుగేళ్లలో రూ.40వేలు వచ్చింది. ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధి ద్వారా టైలరింగ్ చేస్తోంది. దీంతో నెలకు రూ. 4 వేలు వరకూ సంపాదిస్తోంది. డిగ్రీ చదువుతున్న కుమారుడు రవీంద్రకు జగనన్న విద్యాదీవెన కింద రూ.60వేలు, వసతి దీవెన కింద రూ.20వేలువచ్చాయి. ఇంతకంటే మేలు చేసిన ప్రభుత్వాలు గతంలో ఎప్పుడూ కనిపించలేదంటోంది.

– కాళ్ల సన్యాసమ్మ, శింగనబంధ, భీమిలి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం 31-1-2024



రెక్కల పురుగు కథ ఏమిటో అడుగు

రెక్కల పురుగులన్నీ సీతాకోక చిలుకలు కావు. కాని సీతాకోకచిలుకలన్నీ రెక్కల పురుగులే. హిమాలయ ప్రాంతాలకు చెందిన మాత్ (రెక్కల పురుగు)లపై తీసిన 'నాక్టర్న్స్' డాక్యుమెంటరీ అమెరికాలో జరిగిన 'సండాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'లో స్పెషల్ జ్యూరీ అవార్డ్ పొందింది. ఇండియా నుంచి అవార్డ్ గెలిచిన డాక్యుమెంటరీ ఇదొక్కటే. డైరెక్టర్ అనుపమ శ్రీనివాసన్ పరిచయం.



అనుపమ శ్రీనివాసన్

అమెరికాలో ప్రతి ఏటా జరిగే సండాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నామినేషన్ పొందడమే పెద్ద గుర్తింపుగా భావిస్తారు. అవార్డు రావడం ఇంకా పెద్ద గౌరవం. ఈ సంవత్సరం ఉటాలో జనవరి 18–28 తేదీల మధ్య జరిగిన ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మన దేశం నుంచి 'వరల్డ్ డాక్యుమెంటరీ కాంపిటీషన్'లో 'నాక్టర్న్స్'లో చోటు సంపాదించడమే కాకుండా 'స్పెషల్ జ్యూరీ అవార్డ్ ఫర్ క్రాఫ్ట్' అవార్డు పొందింది. అనిర్ బన్‌దత్తాతో కలిసి అనుపమా శ్రీనివాసన్ దర్శకత్వం వహించిన ఈ డాక్యుమెంటరీ రెక్కల పురుగుల లోకంలో ప్రేక్షకులను విహరింపచేస్తుంది.

ఢిల్లీ కృత్రిమత్వం నుంచి

'నేను, అనిర్ బన్ దత్త ఢిల్లీలో జీవిస్తుంటాము. రోజూ ఒకే రకమైన ట్రాఫిక్, పొల్యూషన్. ప్రకృతితో మాకు ఏమీ సంబంధం లేదనిపించేది. ఆ సమయంలో మాకు మాన్సీ అనే పర్యావరణ శాస్త్రవేత్త పరిచయం అయ్యింది. హిమాలయాలలో 'మాత్స్' (రెక్కల పురుగులు) మీద పరిశోధన చేస్తున్నానని చెప్పింది. వాతావరణ మార్పుల వల్ల వీటికి కలుగుతున్న నష్టం ఏమిటో ఆమె తెలుసుకుంటోంది. ఇది డాక్యుమెంటరీ చేయాల్సిన విషయం అనుకున్నాం. గత కొన్నేళ్లుగా నేను, అనిర్‌బన్ డాక్యుమెంటరీలు తీస్తున్నాం. మెయిన్‌స్ట్రీమ్ పట్టించుకోని విషయాలను మేం పట్టించుకుంటాం. దీనికి ముందు మేము ఇండో–మయన్మార్ సరిహద్దులోని తోరా అనే పల్లెకు (మణిపూర్‌లో ఉంది) కరెంటు రావడం గురించి డాక్యుమెంటరీ తీశాం. దాని పేరు 'ఫ్లికరింగ్ లైట్స్'. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా కరెంటు లేని పల్లె ఉండటం, దానికి కరెంటు కోసం కొందరు ఎదురు చూడటం, దేశంలోనే ఉన్నా పరాయీకరణ భావన ఎదుర్కొనడం దీనిలో చూపించాం. ఈ డాక్యుమెంటరీకి ఆమ్‌స్టర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు దక్కింది. ఇప్పుడు మాత్స్ గురించి తీసిన 'నాక్టర్న్స్'కు కూడా సండాన్స్ ఫెస్టివల్‌లో అవార్డ్ వచ్చింది. ఇందుకు మాకు చాలా సంతోషంగా ఉంది' అని తెలిపింది అనుపమా శ్రీనివాసన్.

కష్టనష్టాలకు ఓర్చి

'నాక్టర్న్స్' డాక్యుమెంటరీలో రెండే పాత్రలుంటాయి. ఒకటి పర్యావరణ శాస్త్రవేత్త మాన్సీ, రెండు హిమాలయాల స్థానిక బగున్ తెగకు చెందిన బికి అనే గిరిజనుడు. అతని సాయంతో ఆమె రెక్కల పురుగులను అన్వేషణ చేస్తుంటే మేం రికార్డు చేస్తూ వెళ్లాం. సాయంత్రం అయ్యాక మాన్సీ పలచటి తెర కట్టి దాని వెనుక నీలం రంగు బల్బు వెలిగించేది. ఆ తర్వాత కాసేపటికే వేలాది రెక్కల పురుగులు వచ్చి ఆ స్క్రీన్ మీద వాలేవి. వాటి రంగులు, రూపాలు, ఆకారాలు అన్నీ అద్భుతం. అవి తాము మనిషితో కలిసి జీవిస్తున్నామన్నట్టు ఉన్నాయి. మనమే వాటితో కలిసి జీవిస్తున్నాం అన్న ఎరుకలో లేము' అంటుంది అనుపమా శ్రీనివాసన్. 'హిమాలయాల్లో షూటింగ్... అదీ అడవుల్లో అంటే చాలా శ్రమ. అక్కడంతా తేమగా ఉంటుంది. ఏ క్షణమైనా వాన పడొచ్చు. అంతేగాక రాత్రి వేళల్లో విపరీతమైన చలి. జలగలు పట్టి పీక్కుతినాలని చూసేవి. కాని ఇన్ని సమస్యల మధ్య ఆ రెక్కల పురుగుల జీవనం, వాటి కదలికలు ఎంతో ఆసక్తి కలిగించేవి. మా డాక్యుమెంటరీకి అవార్డు రావడానికి కారణం మేము ప్రకృతి ధ్వనులను పరిపూర్ణంగా రికార్డు చేశాం. ఆ ధ్వనుల వల్ల అడవిలో ఉంటూ మాత్స్‌ను చూస్తున్న అనుభూతి కలుగుతుంది' అంది అనుపమా శ్రీనివాసన్.



జాన్వీ కపూర్





సారా అలీఖాన్

యూత్ పల్స్

అసతోమా సద్గమయ ఆధ్యాత్మిక ప్రయాణం ఆనందమయా

యువతకు ప్రయాణం కొత్త కాదు. ఆనందం కొత్త కాదు. అయితే గత కొంతకాలంగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది యువతరం. ఇది గత ప్రయాణాల కంటే భిన్నమైనది. ఇది ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదు, తమలోకి తాము చేసే అంతర్ ప్రయాణం. ఆనందం, ఆధ్యాత్మికం ఏకమైన అద్భుత ప్రయాణం.

ట్రావెల్ ఏజెన్సీ 'స్కైస్కానర్స్' రిపోర్ట్ ప్రకారం ప్రతి ఇద్దరు భారతీయులలో ఒకరు స్పిరిచ్యువల్ హాలిడేస్ కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. వారిలో యువతరమే ఎక్కువ. 'మా ట్రావెల్ ట్రెండ్స్ రిపోర్ట్ 2024 ప్రకారం 18 నుండి 24 సంవత్సరాల మధ్య వయసు గల వారిలో 52 శాతం, 25 నుండి 34 సంవత్సరాల మధ్య వయసుగల వారిలో 59 శాతం ఆధ్యాత్మిక ప్రయాణాలను ప్లాన్ చేసుకుంటున్నారు' అంటున్నాడు ట్రావెల్ అండ్ డెస్టినేషన్ నిపుణుడు మోహిత్ జోషి.

'చిన్నప్పుడు ఆధ్యాత్మిక యాత్రలు ఇష్టపడేవాడిని కాదు. ఇప్పుడు మాత్రం నేనే కాదు నా స్నేహితులు కూడా ఆధ్యాత్మిక యాత్రలకు ప్రాధాన్యత ఇస్తున్నారు' అంటున్నాడు చేతస్‌శర్మ. ఇండోర్‌కు చెందిన 29 సంవత్సరాల చేతస్ శర్మ ఎంటర్‌ప్రెన్యూర్. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆధ్యాత్మిక యాత్ర ప్లాన్ చేస్తుంటాడు.

'తెల్లారిలేస్తే పరుగు అన్నట్లుగా తయారైంది జీవితం. పనిభారం, టెక్నాలజీతో విరామం అంటూ లేకుండా పోయింది. మనసుకు ప్రశాంతత దూరమైంది' అంటున్న చేతస్ శర్మ కొన్ని నెలల క్రితం కేదార్‌నాథ్ వెళ్లాడు. 'అక్కడికి వెళితే ప్రకృతి అందాల పరవశమే కాదు సానుకూల శక్తి మనకు చేరుతుంది' కేదార్‌నాథ్ గురించి అంటాడు శర్మ.

'గత రెండేళ్లలో మిలీనియల్స్, జెన్‌జెడ్‌లో మార్పు వచ్చింది. కోవిడ్ మహమ్మారి తరువాత ఆరోగ్యం, ఆధ్యాత్మికతపై దృష్టి సారించారు' అంటున్నాడు 'ఎస్‌వోటీసీ ట్రావెల్' ప్రెసిడెంట్ అండ్ కంట్రీ హెడ్ డేనియల్ డిసౌజా.

సారా అలీఖాన్, జాన్వీకపూర్ లాంటి యంగ్ సెలబ్రిటీలు కేదార్‌నాథ్, తిరుపతి, ఉజ్జయినిలాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లడం స్పిరిచ్యువల్ టూరిజంపై యంగర్ జెనరేషన్‌లో ఆసక్తిని పెంచుతుంది. సారా మొదటి సినిమా కేదార్‌నాథ్ సబ్జెక్ట్‌తో రూపొందించారు. తాను సందర్శించిన ఆధ్యాత్మిక క్షేత్రాలకు సంబంధించి సారా రెగ్యులర్‌గా స్టోరీలు, వ్లోగ్స్ షేర్ చేస్తుంటుంది.

'స్పిరిచ్యువల్ డెస్టినేషన్స్ కోసం వెదకడం అనేది ఇటీవల యువతరంలో బాగా పెరిగింది' అంటున్నాడు 'మేక్ మై ట్రిప్' చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాజ్ రిషిసింగ్.

పూరీ జగన్నాథ్ హెరిటేజ్ కారిడార్ నుంచి కాశీ–విశ్వనాథ్ కారిడార్ వరకు యూత్–ఫ్రెండ్లీ అకామడేషన్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ట్రావెల్ ఏజెన్సీలు కొత్త ఆఫర్‌లతో ముందుకు వస్తున్నాయి. ఉదాహరణకు థామస్ కుక్ ఇండియా 'స్పిరిచ్యువల్ ప్లస్' టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. రిషికేశ్‌లో డజన్ల కొద్దీ హాస్టల్స్ ఉన్నాయి. ఈ హాస్టల్స్ ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న ప్రదేశాలకు స్కూటర్‌లను అద్దెకు ఇవ్వడమే కాకుండా లైవ్ స్పిరిచువల్ మ్యూజిక్ సెషన్‌లు నిర్వహిస్తున్నాయి. సాధువులతో సంభాషించే అవకాశాన్ని కల్పించే 'డెత్ అండ్ రీబర్త్ వాక్' లాంటివి కూడా ట్రావెల్ ఏజెన్సీల ప్యాకేజీలో భాగం అవుతున్నాయి.

'యంగ్ టూరిస్ట్‌లతో ప్రయాణ స్వభావం మారుతోంది. ఆనందం, ఆధ్యాత్మికతను యువతరం మిళితం చేస్తోంది' అంటున్నాడు 'ఎస్‌వోటీసీ ట్రావెల్' ప్రెసిడెంట్ డిసౌజా. ట్రావెల్ కంపెనీలు యువ పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని వారితో సులభంగా కలిసిపోయే గైడ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి.

'యువతను దృష్టిలో పెట్టుకొని వివిధ బడ్జెట్‌లలో వీఐపీ దర్శనాలు, హెలికాప్టర్ సర్వీసులాంటి ప్రత్యేక సర్వీసులు ప్రవేశపెట్టాం. 2019తో పోల్చితే జెన్‌జెడ్, మిలీనియల్స్‌లో ఆధ్యాత్మిక ప్రయాణ ఆసక్తి పెరిగింది. స్పష్టమైన మార్పు కనిపిస్తోంది' అంటున్నాడు 'థామస్ కుక్' కంట్రీ హెడ్ రాజీవ్ కాలే.

దిల్లీ నుంచి జైపూర్ వరకు



మన దేశంలోని సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైవిధ్యాన్ని ఆస్వాదించడానికి ప్రయాణాలను ఒక మార్గంగా ఎంచుకుంది బాలీవుడ్ యువ నటి సారాఅలీఖాన్. అజ్మీర్ దర్గా నుంచి కేదార్‌నాథ్ వరకు ఎన్నో ఆధ్యాత్మిక ప్రయాణాలు చేసింది. 2016లో దిల్లీ నుంచి జైపూర్ వరకు స్నేహితురాలితో కలిసి చేసిన కారు యాత్ర అద్భుత అనుభవాన్ని మిగిల్చింది. దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారాలను సందర్శిస్తూ ప్రశాంతతని సొంతం చేసుకున్నారు.

కొండంత అండ



యువనటుల ఆధ్యాత్మిక యాత్రల నుంచి యువతలో ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. ఉజ్జాయినిలోని మహాకాలేశ్వర్ ఆలయం, తిరుమల... జాన్వీకపూర్ స్పిరిచ్యువల్ ట్రిప్‌కు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కామెంట్ సెక్షన్‌లో కనిపించే యువత అభిప్రాయాలు ఆధ్యాత్మిక ప్రయాణాల పట్ల వారి ఆసక్తికి అద్దం పడతాయి.

స్ఫూర్తి

వెన్ను విరిగినా వెన్నుదన్నుగా...

'సోల్ ఫ్రీ' ప్రీతి స్ఫూర్తిదాయక జర్నీ

క్రికెటర్‌గా తమిళనాడు రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉండే ప్రీతి శ్రీనివాసన్‌కు 18 ఏళ్ల వయసులో వెన్నుకు పక్షవాతం వచ్చి, వీల్ చెయిర్‌కే పరిమితం అయ్యింది. తనను తాను మెరుగుపరుచుకుంటూ సోల్‌ఫ్రీ ఫౌండేషన్ ద్వారా స్పైనల్‌కార్డ్ సమస్యలతో బాధపడే 2,500 మందికి వెన్నుదన్నుగా నిలిచింది. సోషియాలజీలో పీహెచ్‌డీ చేస్తూ, సైకాలజీలో రాణిస్తూ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటోంది. జీవితంలో ఏదైనా కారణం చేత పడిపోయినప్పుడు తిరిగి నిలబడే శక్తిని పెంచుకోవాలనే స్ఫూర్తిని నింపుతుంది ప్రీతి జీవనం.





ప్రీతి శ్రీనివాసన్

''అథ్లెట్‌గా నాది అద్భుతమైన జీవితం. చెన్నైలో పుట్టి మూడు ఖండాల్లో పెరిగిన నేను జాతీయ స్థాయి స్విమ్మర్ స్థాయికి చేరుకున్నాను. మూడేళ్ల వయసు నుంచే స్విమ్మింగ్ ప్రారంభించాను. నాలుగేళ్ల వయసులో క్రికెట్ ఆడటం స్టార్ట్ చేశాను. ఎనిమిదేళ్ల వయసులో తమిళనాడు అండర్ –19 జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాను. చదువులోనూ ముందంజలో ఉండేదాన్ని. ప్రతిదీ విజయాల బాటగా జీవితం వెళ్లిపోతుంది. వైఫల్యం నీడ కూడా నా జీవితాన్ని తాకలేదు అనుకున్నాను. కానీ, 18 ఏళ్లు వచ్చేసరికి రెప్పపాటులో అంతా మారిపోయింది.

బీచ్‌లో జరిగిన ప్రమాదం..

పుదుచ్చేరి బీచ్‌లో స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేస్తున్న సమయంలో నీటిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా కిందపడిపోయాను. వెన్నెముకకు గాయం కావడంతో మెడ కింది భాగం అంతా కదలిక కోల్పోయింది. అమ్మానాన్నల ప్రేమ, వారి సపోర్ట్‌తో నన్ను నేను మరో మార్గంలో వెతుక్కోవడం మొదలుపెట్టాను.

వందలాది మందికి రెక్కలు

వెన్నుపాము సమస్యలు ఉన్నవారికి పూర్తి చికిత్స, పునరావాసం, వైద్య సంరక్షణ, విద్య, కౌన్సెలింగ్, ఉపాధి అవకాశాలను అందించడానికి 'సోల్‌ఫ్రీ' పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాను. ఈ సంస్థ తిరువణ్ణామలైలో 20 వేల అడుగుల చదరపు అడుగుల విస్తీర్ణంలో తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న 200 మందికి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి కావల్సిన వసతి సదుపాయాలను అందిస్తోంది. సోల్ ఫ్రీలో ఇప్పటి వరకు 2,500 మంది ఆశ్రయం పొందారు.

అడుగడుగునా అవరోధాలే..

ఇప్పుడు నా వయసు 42. కానీ, పద్దెనిమిదేళ్ల వయసులో జరిగిన సంఘటనతో నా గుండె ఆగిపోయినట్టు అనిపించింది. అప్పటి వరకు ఉన్న నా విశేషమైన ఉనికి ఒక్కసారిగా పాతాళానికి పడిపోయినట్టుగా అనిపించింది. అమెరికాలో చదువుకుంటున్న టాప్ స్టూడెంట్స్‌లో నేనూ ఒకదాన్ని. పెద్ద పెద్ద క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడాను. ఫిట్‌గా, అందంగా ఉండేదాన్ని. వేగంగా బంతిని విసిరే సామర్థ్యం ఉన్న నేను చిటికెన వేలును కూడా కదపలేని స్థితికి చేరుకున్నాను. అన్ని విధాలుగా అసాధారణ ప్రతిభ ప్రదర్శించిన నేను అకస్మాత్తుగా నాకు నేను ఆహారం తీసుకోలేని... స్నానం చేయలేని... మంచం నుండి లేవలేని స్థితికి వెళ్లిపోయాను. అమ్మనాన్నలు నన్ను చూసుకోవడానికి వాళ్ల ఉద్యోగాల్ని విడిచిపెట్టారు. వైద్యం కోసం పెద్ద పెద్ద ఆసుపత్రులకు తీసుకెళ్లారు. కాస్త కోలుకున్న తర్వాత బీఎస్సీ సైకాలజీలో చేరడానికి వెళితే, ఇప్పుడు నీకు ఈ చదువు అవసరమా అన్నట్టు ప్రవర్తించిన అక్కడి యాజమాన్య తీరు నన్ను కన్నీరు పెట్టించింది. కానీ, నాన్న నన్ను ప్రోత్సహించారు. ఇంటి దగ్గరే ఉండి డిగ్రీ చదువుకునేలా స్ఫూర్తి నింపారు. ఫిక్షన్ స్టోరీస్, డిగ్రీ బుక్స్ మాత్రమే కాదు ఆధ్యాత్మిక పుస్తకాల వరకు అన్నీ చదివి వినిపించేవారు. నా నొప్పిని అధిగమించడానికి నాన్న నాకు ఎంతో సహాయపడ్డారు. కానీ, నాన్న గుండెపోటుతో మరణించడం ద్వారా విధి నన్ను మరోసారి బలంగా దెబ్బతీసింది. నాలుగు రోజుల తేడాతో అమ్మకూ గుండెపోటు వచ్చి, బైపాస్ సర్జరీ చేయాల్సి వచ్చింది. నా ప్రపంచం మళ్ళీ శూన్యం అయ్యింది. 80 ఏళ్ల అమ్మమ్మ నన్ను చూసుకునేది. కానీ, ఆమె అమ్మ కోసం చెన్నై వెళ్ళాల్సి వచ్చింది. నాకు తినిపించడం, కూర్చోబెట్టడం ఎవరు చేస్తారో తెలియదు. డబ్బు సంపాదించడం ప్రారంభించాల్సి వచ్చింది. జీవితం మళ్లీ కష్టంగా అనిపించింది. అమ్మ, అమ్మమ్మల ఆరోగ్యం సమస్యాత్మకంగానే ఉండేది. ఈ సమయంలో మా ఫ్రెండ్స్ చదువును కంటిన్యూ చేయమన్నారు. బిఎస్సీ సోషియాలజీ తర్వాత సైకాలజీలో ఎంఎస్సీ కూడా పూర్తిచేశాను.



సంరక్షణకు స్థలం

ఈ దేశంలో దివ్యాంగులకు గౌరవంగా జీవించగలిగిన స్థలం ఎక్కడుంది అంటూ చాలా శోధించాను. కానీ, ఎక్కడా అలాంటి పునరావాస కేంద్రాలు, స్థలాలు లేవని తెలిసింది. దీంతో తీవ్ర వైకల్యాలున్న వ్యక్తులకు గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించేందుకు ఓ స్వర్గధామాన్ని నేనే ప్రారంభించాలనుకున్నాను. లాభాపేక్ష లేని సంస్థను నడపడం లేదా ఎవరినుంచైనా ఫండింగ్ తీసుకోవడం అనే ఆలోచన కూడా చేయలేదు. దివ్యాంగుల కోసం ఏదైనా చేయాలని గట్టిగా అనుకున్నాను. సోల్ ఫ్రీ పేరుతో సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించాను. ఇక్కడ వారు తమకు ఇష్టమైన వ్యాపకాల్లో ఆర్నెల్లపాటు శిక్షణనూ పొందుతారు. దీనిని రీ–ఇంజనీరింగ్ అని పిలుస్తున్నాం. మేమందరమూ జీవించాలనే సంకల్పంతో ఈ కేంద్రాన్ని పునరుద్ధరించాను. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు వాళ్ల ఇంటికి వెళ్లి డబ్బు సంపాదించాలన్నది లక్ష్యం. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సంరక్షణను ఉచితంగా అందిస్తున్నాం. మాకు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, హైడ్రోథెరపీ, స్పోర్ట్స్, కౌన్సెలింగ్ సెషన్‌లు, ట్రైనింగ్ సెషన్లు, టైలరింగ్, కంప్యూటర్ క్లాసులు.. ఉన్నాయి. ఇది నా అనుభవపూర్వకమైన ఫ్రేమ్ వర్క్ నుండి పుట్టిన సంపూర్ణ వ్యవస్థ. ఇక్కడ వెన్నెముకకు అయ్యే గాయాలపై అవగాహన కల్పిస్తాం. మంచాన పడి ఉన్నప్పుడు నా జీవితాన్నీ ముగించుకోవాలనుకున్నాను. కానీ, ఇప్పుడు ప్రభుత్వంతో కలిసి దివ్యాంగుల పునరావాసం కోసం కృషి చేస్తున్నాను. వికలాంగుల సంక్షేమ సలహా మండలి సభ్యురాలిగా ఉన్నాను. నాలాంటివారిపై జాలిపడే బదులు సవాల్‌తో అవకాశాలను ఉపయోగించుకోవాలని అర్థం చేసుకున్నాను. ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నప్పుడు ప్రత్యేక సవాళ్లే వస్తాయి. ప్రతిదాంట్లో విజయం సాధించడం పెద్ద విషయం కాదు. వచ్చిన సవాళ్లను అధిగమించడమే గొప్ప. ప్రపంచం నా ముందున్న తలుపులన్నీ మూసివేసింది. కానీ, కొత్త ప్రపంచాన్ని సృష్టించాలనుకున్నాను. సృష్టించాను. ఇప్పుడు పీహెచ్‌డీ చేస్తూ దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తూ నన్ను నేను కొత్తగా చూసుకుంటున్నాను' అని వివరిస్తుంది ప్రీతి శ్రీనివాసన్.

బ్యూటిప్స్

చర్మకాంతికి మేలైనవి..

*** కొబ్బరి నూనె.. బ్రౌన్ షుగర్**

పొడిబారిన, నిస్తేజంగా ఉన్న చర్మానికి కొబ్బరి నూనె ఔషధంలా పనిచేస్తుంది. రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని కొబ్బరి నూనెను ముఖానికి, మెడకు రాసి, వేళ్లతో వలయాకారంలో మసాజ్ చేయాలి. మరుసటి రోజు ఉదయం ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండుసార్లు నూనెలో కొద్దిగా బ్రౌన్ షుగర్ వేసి, కలిపి, ముఖానికి అప్లై చేయాలి. దీని వల్ల నిస్తేజంగా ఉన్న చర్మం కాంతిమంతం అవుతుంది.





*** అలోవెరా**

చర్మకాంతికి మహత్తరంగా పనిచేసే జాబితాలో మొదటి వరసలో ఉంటుంది అలోవెరా. ముడతల నివారణకు పనిచేస్తుంది. అలొవెరా ఆకునుంచి తీసిన జెల్‌ను ముఖానికి, మేనికి పట్టించి 20 నిమిషాల తర్వాత వేడినీటితో కడిగితే పొడిబారే సమస్య దరిచేరదు.



*** పాలు**


నిస్తేజంగా ఉన్న చర్మానికి పాలు మెరుపును తీసుకువస్తాయి. దూదిని పాలలో ముంచి, ముఖానికి, మెడకు రాసి, ఆరిన తర్వాత కడిగేయాలి. పాలు, తేనె, శనగపిండి కలిపి ముఖానికి ప్యాక్ వేసుకొని 20 నిమిషాలు తర్వాత శుభ్రపరుచుకుంటే చర్మకాంతి మెరగవుతుంది.



*** తేనె**

తేనెలో ఔషధ గుణాలు ఎక్కువ. పొడి చర్మ సమస్యకు నివారిణిగా పనిచేస్తుంది. వేళ్లతో తేనెను అద్దుకొని, ముఖానికి రాసుకొని, మృదువుగా మసాజ్ చేసి ఐదు నిమిషాలు వదిలేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.

*** బొప్పాయి**



మృతకణాలను తొలగించడంలో బొప్పాయి ఎంతగానో సహాయపడుతుంది. బొప్పాయి పండు చిన్న ముక్కను గుజ్జు చేయాలి. దీంతో తేనె వేసి కలిపి, ముఖానికి అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

*** నీళ్లు**

ప్రతి రోజూ 8–10 గ్లాసుల నీళ్లు తాగుతుంటే చర్మంలో ఉండే హానికారకాలు తొలగిపోయి చర్మానికి తాజాదనం లభిస్తుంది.



నిజమైన ప్రేమ అవగాహనలో నుంచి పుడుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 31 జనవరి 2024

తప్పెవరిది! శిక్ష అందరికా?

అంతకంతకూ తీవ్రమవుతున్న పాలస్తీనా సంక్షోభం వారం రోజుల్లో అనేక మలుపులు తిరిగింది. దక్షిణాఫ్రికా వేసిన జాతి విధ్వంసం కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) చేసిన ప్రాథమిక నిర్దేశం ఒకవైపు, పాలస్తీనా శరణార్థులకై ఏర్పాటైన ఐరాస సహాయ సంస్థ 'యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ' (అన్‌రా)కు నిధులు ఆపేస్తున్నట్టు అమెరికా, మరో 8 దేశాలు ప్రకటించడం మరోవైపు, అమెరికా శిబిరాలపై డ్రోన్ దాడులు ఇంకోవైపు... ఇలా అనేక పరిణామాలు సంభవించాయి. గాజా యుద్ధానికి దారి తీసిన అక్టోబర్ 7 నాటి 'హమాస్' ఆకస్మిక దాడి, అపహరణలు, హత్యల్లో 'అన్‌రా' సిబ్బంది కొందరు పాలుపంచుకున్నారని ఇజ్రాయెల్ ఆరోపణ. 190 మంది దాకా 'అన్‌రా' ఉద్యోగులు ఇస్లామిక్ జిహాదీ తీవ్రవాదులైన 'హమాస్' వర్గీయులుగానూ వ్యవహరించారని అది అంటోంది. అయితే కొందరు తప్పు చేశారని గాజాలోని లక్షల మందికి ప్రాణాధారాన్ని ఆపేయరాదని ఐరాస అభ్యర్థన.

ఎప్పుడో 1948లో అరబ్ – ఇజ్రాయెలీ యుద్ధం సందర్భంగా దాదాపు 7 లక్షల మంది పాలస్తీనీయులు ఇప్పుడు ఇజ్రాయెల్ అంటున్న ప్రాంతంలోని తమ ఇల్లూ వాకిలీ వదిలేసి పోవాల్సొచ్చింది. ఆ శరణార్థుల సాయానికై 1949లో 'అన్‌రా' ఏర్పాటైంది. గాజా, ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్, లెబనాన్, సిరియా, జోర్డాన్‌లలో విద్య, ఆరోగ్యం, సహాయ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టే ఈ సంస్థ ద్వారా సుమారు 59 లక్షల మంది పాలస్తీనా శరణార్థులు సాయం పొందుతున్నారు. ఇప్పటికే మానవీయ సంక్షోభంలో చిక్కుకున్న గాజాలోని ప్రజానీకానికి తిండి, నీళ్ళు అందిస్తున్నది ప్రధానంగా ఈ సంస్థే. అమెరికా లాంటి పలు దేశాల స్వచ్ఛంద విరాళాలతో నడిచే ఆ సంస్థపై ఆరోపణలు చేసి, నిరూపించకుండానే నిధులు ఆపేస్తే లక్షలాది అమాయకుల పరిస్థితి ఏమిటి?

ఐరాస శరణార్థి సహాయ సంస్థకు నిధులిచ్చే దేశాల మాట అటుంచితే, అసలు సామాన్య పౌరులకు కష్టం వాటిల్లకుండా చేయగలిగినదంతా చేయాలంటూ అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) నిర్దేశించింది. అయినా ఇజ్రాయెల్ పెడచెవిన పెడుతోంది. గాజా ప్రాంతంపై దాడులు కొనసాగిస్తూ, అమాయకుల ఆయువు తీస్తోంది. ఆ మధ్య కొద్దివారాల పాటు గాజాలోని ప్రధాన నగరం నుంచి వెనక్కి తగ్గినట్టే తగ్గిన ఇజ్రాయెల్ సోమవారం మళ్ళీ భీకర దాడులకు దిగింది. ఇజ్రాయెల్ అమానవీయ యుద్ధంలో ఇప్పటికే 26.5 వేల మంది పాలస్తీనీయులు మరణించారు. తీరం వెంట ధ్వంసమైన భవనాల శిథిలాల కింద ఇంకెన్ని వేల మృతదేహాలున్నాయో తెలీదు. అంతకంతకూ క్షుద్రమవుతున్న ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఇక, గాజా ప్రకంపనలు ఇతర చోట్లకూ విస్తరించాయి. ఆదివారం సిరియా సరిహద్దు సమీపంలోని జోర్డాన్ ఈశాన్య ప్రాంతంలో డ్రోన్ దాడులు జరిగాయి. అమెరికా సైనికులు ముగ్గురు మరణించారు.

ఈ దాడులు ఇరాన్ అండతో సిరియా, ఇరాక్‌లలో నడుస్తున్న తీవ్రవాద వర్గాల పని అన్నది అమెరికా మాట. ఆ పాపంలో తమకేమీ భాగం లేదన్నది ఇరాన్ ఖండన. నిజానికి, ఇజ్రాయెల్ – హమాస్‌ల మధ్య యుద్ధం మొదలైనప్పటి నుంచి పశ్చిమాసియాలో పలు ప్రాంతాల్లో ఉన్న అమెరికా సైనిక శిబిరాలపై పదులకొద్దీ దాడులు జరిగాయి. అమెరికాకు ప్రాణనష్టం మాత్రం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్ భీకర ప్రతీకార యుద్ధాన్ని గుడ్డిగా సమర్థిస్తూ వస్తున్న అగ్రరాజ్య విస్తృత రక్షణ వ్యవస్థల్ని దాటుకొని మరీ ఈ దెబ్బ తగలడం గమనార్హం. దాంతో, అమెరికా అధినేత సైతం ఇరాన్ మద్దతున్న తీవ్రవాదవర్గాలపై ప్రతీకార దాడులు చేయాలని హూంకరించారు. అలాగని నేరుగా ఇరాన్‌పై దాడికి దిగలేదు. ఆ దేశాన్ని లక్ష్యంగా చేసుకోవాలని నేతలు కోరినా, అది తేనెతుట్టెపై రాయి వేయడమే. ఆ ప్రాంతంలో దీర్ఘకాలంగా నిలబడి కలబడుతున్న తీవ్రవాద బృందాలే అందుకు సాక్ష్యం.

ప్రాంతీయ పోరాటాల్లో తలదూర్చినప్పుడల్లా తలబొప్పి కడుతూనే ఉందని అగ్రరాజ్యం మర్చిపోకూడదు. పశ్చిమాసియాలో ఇప్పటికే దానికి అనేక శత్రువులున్నారు. ఇరాన్‌పై దుందుడుకుగా ప్రవర్తిస్తే పరిస్థితి చేయి దాటుతుంది. చివరకు ఈ యుద్ధం ప్రపంచ స్థాయిలో పెద్దదవుతుంది. ఇటీవల ఎర్రసముద్రంలోని దాడులతో అస్తుబిస్తు అవుతున్న ప్రపంచ వాణిజ్యానికి అది మరో అశనిపాతం అవుతుంది. అది గ్రహించే అమెరికా అనివార్యంగా సంయమనం చూపాల్సి వచ్చింది. ఇంకోపక్క మరో విడత కాల్పుల విరమణకై అరకొర ప్రయత్నాలు సాగుతున్నా, అవేవీ ఫలించడం లేదు. తాజాగా అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ అధినేత ఆదివారం ప్యారిస్‌లో ఇజ్రాయెల్, ఈజిప్ట్, ఖతార్‌కు చెందిన ఉన్నతాధికారులను కలిశారు. మిగిలిన బందీలను హమాస్ విడుదల చేస్తే, మరొకసారి కాల్పుల విరమణ పాటించేలా చర్చించి, ఒప్పించాలని ప్రయత్నం. కానీ, ఫలితం శూన్యం.

ఇజ్రాయెల్ సైనికచర్యను తప్పుబడుతూ దక్షిణాఫ్రికా వేసిన జాతి విధ్వంసం కేసు తేలేసరికి ఏళ్ళు పడుతుంది. ఈలోగా ఐసీజే గురువారం ఇచ్చిన ప్రాథమిక నిర్దేశం ఏ పక్షం వైపూ మొగ్గకుండా ఆచరణాత్మక ధోరణిలో సాగింది. గాజాలో అత్యవసర ప్రాథమిక సేవలు, మానవతా సాయం అందించాలని టెల్ అవీవ్‌ను కోరింది. అదే సమయంలో హమాస్ చేతిలోని బందీల పట్ల ఆందోళన వెలిబుచ్చుతూ, వారి విడుదలకు పిలుపునిచ్చింది. ఇలాంటి సమతూక ధోరణినే ఆశ్రయిస్తూ అమెరికా, ఐరోపా సమాజం సహా పాశ్చాత్యదేశాలన్నీ చర్చలతో పరిష్కారానికి మనసు పెట్టాలి. అంతు లేని యుద్ధానికి ఇజ్రాయెల్‌ను అనుమతిస్తున్న తమ విధానాలపై పునరాలోచన చేయాలి. ఆచరణాత్మక పరిష్కార మార్గాన్ని అన్వేషించాలి. ఇరుపక్షాలనూ అంగీకరింపజేయాలి. కొందరు తప్పు చేశారని, 'అన్‌రా' నిధులను ఆపి అందరినీ శిక్షించడం శాంతిస్థాపనకు దోహదం చేయదని గ్రహించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: తిథి బ.పంచమి ఉ.8.18, వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: హస్త రా.10.12 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.51 నుండి 12.39 వరకు, అమృత ఘడియలు: ప.3.31 నుండి 5.16 వరకు

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 5.50
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇండో-ఫ్రెంచ్ సంబంధాల్లో నవశకం

విశ్లేషణ

మోహన్ కుమార్

భౌగోళిక-వ్యూహాత్మక అస్థిరతను ఎదుర్కోవాలంటే, సంబంధాల్లో వైవిధ్యం పెంచుకోవాలి. ఈ నేపథ్యంలో భారత గణతంత్ర దినోత్సవాలకు అతిథిగా వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ పర్యటన ఇరుదేశాల సంబంధాలను మరింత దృఢతరం చేస్తుంది. గాజాలో యుద్ధం కారణంగా చాలామంది అసాధ్యం అని భావిస్తున్న ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరోప్ కారిడార్ గురించి ఇరుపక్షాలు ప్రస్తావించాయి. 2030 నాటికి 30,000 మంది భారతీయ విద్యార్థులను స్వీకరించేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది. ఇక 'ఇండో–ఫ్రెంచ్ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్య రోడ్‌మ్యాప్' ఇరుదేశాలనూ కొనుగోలుదారు–విక్రేత సంబంధాన్ని దాటి చూస్తోంది. మోదీ, మెక్రాన్‌ల మధ్య ఉన్న వ్యక్తిగత బంధం వల్ల కూడా ఈ పర్యటన ప్రత్యేకంగా మారింది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తన భారత పర్యటనను ఇటీవలే ముగించారు. ఇది ఇరుదేశాల మధ్య నిర్మాణాత్మకమైన పర్యటనగా మారవచ్చని భావిస్తున్నారు. ఆయన గణతంత్ర దినోత్సవ వేడుకలకు వచ్చిన గౌరవ అతిథి కావడం వల్ల ఈ పర్యటన సందర్భమే... ఆడంబరం, సంకేతాలతో కూడుకుని ఉన్నది. అయితే, ఆయన పర్యటనలో స్పష్టంగా కనిపించని అంశాన్ని చూడటం, భౌగోళిక-వ్యూహాత్మక చిక్కులను పరిశీలించడం చాలా ముఖ్యం.

భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ పరస్పరం చక్కగా కలిసిపోతారు. ఎమ్–ఎమ్ (మోదీ, మెక్రాన్) అంశం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి పలు విషయాలను జోడించింది: నిర్ణయం తీసుకోవడాన్ని వేగవంతం చేసింది, పైగా ఒక దార్శనికతను అందించింది. ఈ క్రమంలో, ఇది బ్యూరోక్రాటిక్ జడత్వాన్ని, అతి భారమైన ఆలోచనలను అధిగమించడంలో సహాయపడింది.

ప్రపంచ వ్యూహాత్మక రాజకీయాల్లో తీవ్రమైన అల్లకల్లోలం నేపథ్యంలో మెక్రాన్ తాజా పర్యటనను చూడాల్సి ఉంటుంది. రెండు ప్రధాన యుద్ధాలు జరుగుతున్నాయి. ఒకటి ఉక్రెయిన్‌లో, మరొకటి గాజాలో. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ కష్టంగా కనిపిస్తోంది. బహుళ పక్ష వాణిజ్య వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, ప్రపంచ వాణిజ్య సంస్థ అవసాన దశలో ఉండటం కారణంగా అంతర్జాతీయ వాణిజ్యం చిందరవందరగా ఉంది. ప్రబల శక్తి అయిన అమెరికా దేశీయ రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటోంది.

కనీవినీ ఎరుగని ఈ భౌగోళిక-వ్యూహాత్మక అస్థిరతను భారతదేశం ఎదుర్కోవాలంటే... నష్ట భయం తగ్గించుకోవాలి, దేశాలతో సంబంధాల్లో వైవిధ్యం పెంచుకోవాలి, బహుళ ఒడంబడికల ఆధారంగా విదేశాంగ విధానాన్ని కొనసాగించాలి. అమెరికా ఎల్లప్పుడూ భారతదేశానికి కీలకమైన వ్యూహాత్మక రక్షణ భాగస్వామిగా ఉంటుంది. అయితే, అది ఎప్పటికప్పుడు, కొన్ని దేశీయ ఒత్తిళ్లకు, చైనా–అమెరికా సంబంధాల స్థితి వంటి బాహ్య కారకాలకు కూడా లోబడి ఉంటుంది. జపాన్‌తో సంబంధాలను చూస్తే, భారతీయ వస్తూత్పత్తిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు బలంగా ఉన్నాయి. కానీ రక్షణ, భద్రతా సహకారం జరిగే అవకాశం కాస్త పరిమితంగా ఉంది. రష్యా విషయానికి వస్తే, ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారతదేశ వైఖరి గురించి సానుకూలంగా వ్యాఖ్యానించారు. ఇతర శక్తులతో తన రక్షణ సంబంధాలను విస్తరించుకోవాలని భారత్ కోరుకోవడాన్ని రష్యా అర్థం చేసుకోగలదని ఆయన చెప్పడం గమనార్హం.

పై దృష్టాంతం ప్రకారం చూస్తే, ఫ్రాన్స్‌తో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం విపరీతమైన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇండో–ఫ్రెంచ్ సంబంధాలు... వ్యూహాత్మక ఏకీభావం, స్వయంప్రతిపత్తి, ఇరు దేశాలలోని అన్ని పార్టీల ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటాయి. అయితే మోదీ, మెక్రాన్‌ల మధ్య ఉన్న అసాధారణమైన వ్యక్తిగత స్నేహసంబంధాలు... ఇండో–ఫ్రెంచ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిజంగా ప్రత్యేకమైనదిగా మార్చింది.



ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, భారత ప్రధాని మోదీ

'బాస్టిల్ డే'(ఫ్రెంచ్ జాతీయ దినోత్సవం) ఉత్సవాల్లో పాల్గొనేందుకు మోదీ గత ఏడాది జూలైలోనే పారిస్‌కు వెళ్లారనీ, అప్పుడే ఇరు నేతలూ వివరణాత్మక పత్రం 'హొరైజన్ 2047'కు అంగీకరించారనీ పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత పర్యటన నుండి కూడా నాటకీయ ప్రకటనలను ఆశించడం అవాస్తవికంగా ఉంటుంది. అయినప్పటికీ ఈ పర్యటన నుండి బయటపడిన అత్యంత ముఖ్యమైన ఫలితం 'ఇండో–ఫ్రెంచ్ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యం కోసం రోడ్‌మ్యాప్'. ఇది క్లాసిఫైడ్ అయినప్పటికీ, ఇందులోని ఆంశాలేమిటో చూచాయగా తెలుస్తున్నాయి. ఈ రోడ్‌మ్యాప్ ఇరుదేశాలనూ కేవలం కొనుగోలుదారు–విక్రేత సంబంధంలో చూడటం లేదు. భారత సాయుధ దళాల రక్షణ అవసరాలు తీర్చడమే గాక, సహ డిజైన్, సహ అభివృద్ధి, సహ ఉత్పత్తికి వీలు కల్పిస్తోంది. అంతేకాకుండా ఇతర స్నేహపూర్వక దేశాలకు నమ్మకమైన రక్షణ సామగ్రిని అందించేందుకూ అంగీకరిస్తోంది.

ఇది ప్రతిష్ఠాత్మకమైన ప్రణాళిక. ఇది 'ఆత్మనిర్భర్ భారత్'కు మాత్రమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి కూడా గణనీయంగా దోహదపడుతుంది. ఫ్రెంచ్ సంస్థ సాఫ్రెన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్‌ల గురించి మాత్రమే కాకుండా రాఫెల్ ఇంజిన్‌ల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల స్థాపనలో పురోగతి గురించి ఉమ్మడి ప్రకటనలో సూచనలు ఉన్నాయి. సాఫ్రెన్, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ సంస్థల మధ్య సమగ్ర భాగస్వామ్యం అనేది 100 శాతం సాంకేతికత బదిలీతో బహుళ-పాత్ర పోషించే హెలికాప్టర్ ఇంజిన్‌ల అభివృద్ధికి ఉద్దేశించబడింది. అదనంగా, స్కార్పెన్ జలాంతర్గాములు భారత్‌లో గణనీయమైన స్వదేశీకరణతో నిర్మించడాన్ని కొనసాగిస్తాయి.

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ భాగస్వామ్యంతో ఎయిర్‌బస్ భారతదేశంలో పౌర హెలికాప్టర్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించనుంది. ఇది రెండు దేశాల ప్రైవేట్ రంగానికీ మొట్టమొదటిది. ఇరుపక్షాలు ఇప్పుడు ఒక ప్రత్యేకమైన ఉమ్మడి ట్రైసర్వీసెస్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నాయి. ఇరుదేశాల సంబంధాల్లో అంతరిక్ష రంగం కూడా ముఖ్య స్థానంలో ఉంది. రెండు దేశాలు ఆరు దశాబ్దాలకు పైగా అంతరిక్ష రంగంలో సహకరించుకున్నాయి. 2023 జూన్‌లో ప్రారంభించిన సంస్థాగత వ్యూహాత్మక అంతరిక్ష సంభాషణ మరింత ముందుకు సాగుతోంది. వాస్తవానికి, రక్షణ అంతరిక్ష భాగస్వామ్యంపై రెండు దేశాల రక్షణ మంత్రిత్వ శాఖల మధ్య అంగీకార లేఖ ఈ ఫలితాలలో ఒకటి. రక్షణ, అంతరిక్షం కలిసి ఈ భాగస్వామ్యాన్ని నడిపిస్తున్నాయి.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, గాజాలో యుద్ధం కారణంగా చాలామంది అసాధ్యం అని భావిస్తున్న ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరోప్ కారిడార్ గురించి ఇరుపక్షాలు ప్రస్తావించాయి. రెండు వైపులా ఈ కార్యక్రమం గురించిన వ్యూహాత్మక ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడమే కాకుండా, ప్రాజెక్ట్ కోసం ప్రత్యేక ప్రతినిధిని మెక్రాన్ నియమించడాన్ని మోదీ స్వాగతించారు. బహుశా, ఈ కీలకమైన ప్రాజెక్ట్‌ను కొనసాగించడానికి భారతదేశం కూడా అదే పని చేయాలి.

వ్యూహాత్మక భాగస్వామ్య కొనసాగింపు... స్పష్టంగా ఆవిష్కరణ, సాంకేతికతలపై ఆధారపడి ఉంటుంది. కృత్రిమ మేధ, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సహకారాన్ని తీవ్రతరం చేయాలని ఇరుపక్షాలూ నిర్ణయించాయి. 2030 నాటికి 30,000 మంది భారతీయ విద్యార్థులను ఫ్రాన్స్ స్వీకరించడం గురించి ఫ్రెంచ్ అధ్యక్షుడు అంగీకరించారు. ఇది చాలావరకు సాధ్యమే. భారతదేశం – యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఇద్దరు నాయకులు తమ దృఢమైన మద్దతును పునరుద్ఘాటిస్తుండటం స్వాగతించదగినది. సాధారణ ఎన్నికల తర్వాత భారతదేశానికి ఈ ఒప్పందం ప్రధాన వాణిజ్య విధాన లక్ష్యాలలో ఒకటిగా ఉండాలి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో భారతదేశం 30పైగా వ్యూహాత్మక భాగస్వామ్యాలను కలిగి ఉంది. వాటిలో కొన్ని పరస్పర అవసరాలపై, రాజకీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయి. కానీ ఇండో–ఫ్రెంచ్ భాగస్వామ్యం మాత్రం పరస్పర ఎంపికపై ఆధారపడి ఉంది. అంతేకాకుండా ఇది ప్రపంచ భౌగోళిక వ్యూహాత్మక సంబంధాలను పునర్నిర్మించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

వ్యాసకర్త ఫ్రాన్స్‌లో భారత మాజీ రాయబారి; ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ డీన్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఇంత పరిజ్ఞానమా?

తమ స్టార్టప్ కంపెనీ న్యూరాలింక్‌లో మొదటి మానవ పేషెంట్‌కు మెదడు మార్పిడి జరిగిందని వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ చెబుతున్నారు. భవిష్యత్తుకు స్వాగతం!

– హసన్ సజ్వానీ, యూఏఈ వ్యాపారవేత్త

పాకిస్తాన్‌లో అంతే!

నవాజ్ షరీఫ్‌కు ఒకప్పుడు పదేళ్ల జైలు శిక్ష పడింది. ఇప్పుడు ఇమ్రాన్ ఖాన్‌కు కూడా పదేళ్ల జైలు శిక్ష పడింది. ఎక్కడ మొదలుపెట్టామో మళ్లీ అక్కడికే వచ్చాం.

– అనస్ మాలిక్, పాకిస్తాన్ జర్నలిస్ట్

కోపిస్తారు ప్రేమిస్తారు...

మెజారిటీ మూకల ఇబ్బందులకు గురైన, సుప్రీంకోర్టు నుంచి బెయిల్ వచ్చేదాకా మెజారిటీ రాజ్యం వల్ల 37 రోజులు జైల్లో గడిపిన ఒక గుజరాతీ ముస్లిం కమెడియన్ (మునవర్ ఫారూఖీ)... వరుసగా రెండు పెద్ద రియాలిటీ షోలలో విజయం సాధించాడు. ఇప్పుడు సూపర్‌స్టార్ అనిపించుకుంటున్నాడు. ఏమిటో, కొన్ని సార్లు ఇండియా చాలా చిత్రమైన దేశం!

– సిద్ధార్థ్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

తగిన మాటలేనా?

అక్రమంగా ఎన్నికయ్యారని అర్థం వచ్చేట్టుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ గురించి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఒడిశాలో చులకనగా మాట్లాడారు. ఒత్తిళ్లు ఉన్నప్పటికీ దీర్ఘకాల మిత్రదేశమైన రష్యాతో మనం స్నేహం నెరపుతున్నప్పుడు ఉత్తి పుణ్యానికి ఇలాంటి మాటలు మాట్లాడటం దేనికి? ఇవి దేశ విదేశాంగ విధానాన్ని బలహీనపరుస్తాయి.

– కన్వల్ సిబాల్, మాజీ దౌత్యవేత్త

గెలిపించుకున్నారు!

చండీగఢ్ మేయర్ ఎన్నికల సారాంశం: కాంగ్రెస్, ఆప్‌కు కలిపి 20 ఓట్లున్నాయి. బీజేపీకి 15 ఓట్లున్నాయి. బీజేపీ అన్ని ఓట్లూ చెల్లి, కూటమి 8 ఓట్లు మాత్రం తిరస్కరణకు గురయ్యాయి. అలా బీజేపీ గెలిచింది. ఇందులో ఏ అపసవ్యతా లేదని ఇప్పటికీ మీరు అనుకుంటున్నారా?

– జాయ్‌దాస్, వ్యాఖ్యాత

దమ్మున్న ఆదర్శజీవి

'రేపు చనిపోతామేమో అన్నట్టుగా బతకాలి; ఎప్పటికీ బతికివుంటామేమో అన్నట్టుగా నేర్చుకోవాలి.' మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గురించి తప్పుగా మాట్లాడటం తేలిక. కానీ ఆయన ఆదర్శాలతో జీవించడం కనీసం ఊహించడానికి కూడా కష్టం. 'బందే మే థా దమ్!' ('లగే రహో మున్నా భాయ్' సినిమా పాటను ఉటంకిస్తూ. దమ్మున్న మనిషి అని అర్థం.) (జనవరి 30 మహాత్ముడి వర్ధంతి.)

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

బుద్ధెటుపోతుంది?

మరో విజయవంతమైన మిషన్‌లో భాగంగా భారతీయ నేవీ 19 మంది పాకిస్తానీ నావికా సిబ్బందినీ, 17 మంది ఇరానియన్లనూ సోమాలియా పైరేట్ల నుంచి రక్షించింది. అదే సమయంలో పాక్ రక్షణ దళాలు ఎన్నికలను రిగ్గింగ్ చేయడంలోనూ, భారత గడ్డ మీదికి తీవ్రవాద దాడులను పురిగొల్పడంలోనూ బిజీగా ఉన్నాయి.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

ఇన్ బాక్స్

నోరులేని వారి గొంతుక

సమాజంలో ఓ వైపు తీవ్రమైన అంటరానితనం, మరోవైపు అణచివేతలు. ఎటువంటి హక్కులు లేకుండా ఊరి అవతల బతకవలసిన దుర్భర పరిస్థితుల్లో ఉన్న దళితుల బతుకులను మార్చడానికి అవిరామంగా కృషిచేశారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. ఈ కృషిలో భాగంగా మూగజీవుల్లాంటి దళితులకు గొంతుక అందించడం కోసం పత్రికలనూ స్థాపించారాయన. అందులో 'మూక్ నాయక్' (నోరులేనివారి నాయకుడు) దినపత్రిక ప్రముఖమైనది.

సరిగ్గా 104 సంవత్సరాల క్రితం 1920 జనవరి 31న అంబేడ్కర్ మూక్ నాయక్ పత్రికను స్థాపించారు. ఇది మరాఠీ భాషలో వచ్చిన పక్షపత్రిక. భారతదేశంలో తీవ్రమైన వివక్షను ఎదుర్కొంటున్న అణగారిన వర్గాల సమస్యలను యావత్తు ప్రపంచానికి తెలియజేయడానికి ఆయన ఎంచుకున్న గొప్ప వాహకం ఈ పత్రిక. దళితుల కోసం ఎవరూ గొంతెత్తని ఆ రోజుల్లో దళితుల కోసం ఏకంగా ఒక పత్రికను స్థాపించి వారి స్థితిగతులను ప్రపంచానికి తెలియజేయడంతోపాటూ దళితులను చైతన్యపరచే వ్యాసాలు రాసి ప్రచురించడం సాహసోపేతమైన చర్యే. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా దాదాపు మూడేళ్లకే ఈ పత్రిక మూతపడింది.

ఆ తరువాత 1927లో 'బహిష్కృత్ భారత్' పత్రికను స్థాపించి తిరిగి అసమానతలపై అక్షర చైతన్యాన్ని రగిలించే రచనలు చేశారు అంబేడ్కర్. ఈ పత్రికా నిర్వహణలోనూ ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దేశంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు మీడియా ప్రధాన వేదిక కావాలని అంబేడ్కర్ అభిప్రాయం. ఆ అభిప్రాయంతోనే పత్రికలు ఏర్పాటు చేసి దళిత జాతికి జరుగుతున్న అన్యాయాలపై కథనాలతో కదలికలు తెచ్చారు. అంబేడ్కర్ కాలంలో లానే నేటికీ కొన్ని ప్రధాన పత్రికల్లో దళితుల సమస్యలకు సముచిత స్థానం దక్కడం లేదు.

21వ శతాబ్దంలో దేశం మునుముందుకు దూసుకుపోతుందని కొందరు చెబుతున్నప్పటికీ... దళితుల జీవితాల్లో మాత్రం ఆశించినంతగా మార్పు రావడంలేదు. దళితుల మీద ప్రేమను ఒలకబోసే కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేస్తున్నాయే తప్ప వాటిని ఆచరణలో పెట్టడంలేదు. అందుకే మూక్ నాయక్ స్ఫూర్తితో దళితులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలి.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా

భువి నుంచి దివికేగిన పాట

సందర్భం

డా॥ ఐ.ఐ. మహ్మద్ హసన్

తెలంగాణ మాగాణంలో పుట్టిన విప్లవ తార గద్దర్. తన ఆట, పాటలను పనిముట్లుగా చేసుకొని ప్రజలను చైతన్యవంతం చేశారు. ప్రభుత్వాల గుండెల్లో గుబులు రేపారు. ఆయన అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. నక్సలైట్ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఆ తర్వాత ఆ ఉద్యమానికి దూరంగా ఉంటూ కూడా తనదైన శైలిలో ప్రజోద్యమాల్లో పనిచేశారు. తొలి, మలి తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. **'అమ్మ తెలంగాణమా ఆకలి కేకల గానమా'** అంటూ తెలంగాణ బతుకు చిత్రాన్నీ, దోపిడీ వ్యవస్థనూ, కళ్ళముందుంచారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో ఊరు ఊరునా, వాడవాడలా ప్రజల్ని చైతన్యం చేయటంలో ప్రధాన భూమిక పోషించింది ఆ పాట. **'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా'** అంటూ కాలికి గజ్జెకట్టి, నడుముకు ధోతి చుట్టి, భుజంపై గొంగడి, చేతిలో కర్ర, ఎర్ర రుమాలుతో తెలంగాణ ప్రాంతం మొత్తం చుట్టిన ఉద్యమవీరుడు గద్దర్. ఆయన అభినవ వాగ్గేయకారుడు. ఆయన ఇప్పుడు విడిచివెళ్లిన పాటను ఎవరు అందుకుంటారనేది ప్రశ్న.

తెలంగాణ సమాజం ప్రస్తుతం 'సంఘర్షణాత్మక స్తబ్దత' వాతావరణంలో ఉంది. అలాంటి స్తబ్దతను ఛేదించాలంటే ఒక గొప్ప కళాకారుడు అవసరం. సామాజిక అసమానతల పైనా, పాలకుల అవినీతి అక్రమాలపైనా పాట ద్వారా యుద్ధం చేయగల గద్దర్‌లాంటి యుద్ధ నౌక ఇప్పుడు అవసరం. **'కిర్రు కిర్రు చెప్పులోయమ్మ'** అన్నా, **'నిండు అమాసనాడు ఓ లచ్చ గుమ్మడి ఆడపిల్ల పుట్టిందని ఓ లచ్చ గుమ్మడి'** అంటూ అసమానతలపై పాటే అస్త్రంగా ఎక్కుపెట్టినా ఆయన ప్రతి పాటా మనల్ని ఆలోచింపజేస్తుంది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికీ, మానవ సంబంధాల గాఢతకూ నిలువెత్తు నిదర్శనం ... **'మల్లె తీగకు పందిరివోలే/ మసక చీకటిలో వెన్నెల వోలె/ నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మ / తోబుట్టిన ఋణం తీర్చుకుంటనే చెల్లెమ్మ'** అంటూ ఆయన రాసిన పాట.



ఒక్కసారి ప్రజా ప్రతినిధిగా గెలిచి కోట్లకు కోట్లు వేనకేసుకొని తరతరాలకు సరిపోయే ఆస్తులను పోగేసుకుంటున్న నాయకులు ఉన్న ఈ కాలంలో... కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసి తన ఆట పాటల ద్వారా అందరి గుండెల్లో చెరగని ముద్ర వేసి వాటిని మనకు వదిలి వెళ్లిపోయారాయన.

అజ్ఞాతంలో ఉన్నప్పుడే ఎన్నోసార్లు ఎన్‌కౌంటర్ నుండి బయటపడ్డారు. కానీ అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలోకి వచ్చాక ఉమ్మడి రాష్ట్రంలో ఆయనపై హత్యా ప్రయత్నం జరిగింది. శరీరంలోకి బుల్లెట్లు దూసుకుపోయినా మృత్యువు నుండి బయటపడి తిరిగి ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన మృతి చెందేనాటికి కూడా వెన్నెముకలో ఒక తూటా అలాగే ఉంది.

సుమారు 5 దశాబ్దాల పాటు సాంస్కృతిక చైతన్యాన్నీ, సామాజిక వైరుధ్యాల మార్పునూ కోరుతూ చేసిన ఆయన పోరాటం అమరం. ఆయనలా ఆలోచింపజేసిన వ్యక్తి బహుశా అరుదనే చెప్పవచ్చు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల మీద ఒక సిద్ధాంతంతో పోరాడిన వారి గురించి మనం చరిత్రలో చదువుకున్నాం. రాజరిక పాలన, నియంతృత్వ విధానాల మీద ప్రజలతో మమేకమై పోరాడిన నాయకులనూ చూశాం. కానీ ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో సామాజిక చైతన్యం ద్వారా రాజకీయ మార్పు తీసుకురావడానికి తన కలాన్నీ, గళాన్నీ ఉపయోగించిన గద్దర్‌లాంటి వ్యక్తులు మాత్రం ఒకరిద్దరే కనిపిస్తారు అంటే అతిశయోక్తి కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎంతగా రాసినా ఒడువని పరిశోధనా వ్యాసం గద్దర్!

వ్యాసకర్త తెలుగు బోధకులు । 99080 59234

(నేడు గద్దర్ జయంతి)

ధర్మ స్వరూపం

మహాభారతానికి కురుపాండవుల కథ దేహం వంటిదనీ, అందులోని శాంతి పర్వం ఆత్మ వంటిదనీ చెబుతారు. కురుక్షేత్ర యుద్ధానంతరం శరతల్పగతుడైన భీష్ముడు ధర్మరాజుకు చేసిన ధర్మప్రబోధమే ఆ ఆత్మ.

రాజధర్మం, ఆపద్ధర్మం, మోక్ష ధర్మం, ధర్మ సూక్ష్మం – ఇట్లా ధర్మం అనేక విధాలుగా ఉన్నది. రాజు ప్రజాహితం కోరి, ఆత్మనిగ్రహం కలిగి, ప్రజాపాలన చేయటం ఉత్తమ రాజధర్మం. కపట ఉద్యోగులు ప్రజలను బాధింపకుండా చూడాలి. ప్రజలను పీడించి అధికంగా పన్నులు వసూలు చేయరాదు.

తల్లి, తండ్రి, గురువు – వీరిని సేవించాలి. వీరిలో తల్లి ఎక్కువ గౌరవనీయురాలు. సత్యం పలకటం అన్ని ధర్మాల్లోకెల్లా మిన్న. అయితే ప్రాణులకు బాధ కలిగించే సత్యం, పాపంతో సమానం. ప్రాణులకు మేలు చేసేది అసత్యమైనా సరే, అదే పరమ ధర్మం. ఇది ధర్మ సూక్ష్మం.

ఆహారం దొరక్క ప్రాణం పోయే స్థితి దాపురించినప్పుడు, ఎలాంటి ఆహారాన్ని అయినా సంకోచించకుండా తిని, ఎట్లయినా ప్రాణాన్ని నిలుపుకోవటమే ఆపద్ధర్మం.

రాగ ద్వేషాలు విడిచి, ప్రియ, అప్రియ విషయాల పట్ల సమభావం కలిగి ఉండటం మోక్ష ధర్మం.

చివరికి ధర్మరాజు ధర్మ స్వరూపం ఏమిటో దానిని వివరింపమని కోరగా, భీష్ముడు చెబుతాడు:

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి,
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్

ఇతరులు ఏవి మనకు చేస్తే, మన మనస్సుకు కష్టం కలుగుతుందో, అవి మనం ఇతరులకు చేయకుండా ఉండటం అన్ని ధర్మాల్లోకెల్లా గొప్ప ధర్మం. ధర్మసారాన్ని ఇంత సులభగ్రాహ్యంగా వివరించటం, ఒక్క భీష్ముల వారికే చెల్లింది.

– దీవి సుబ్బారావు

సాక్షి బిజినెస్
బుధవారం
31-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
802	215
71,140	21,522

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	15,564	▽	64
డోజోన్స్	38,387	△	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,666	△	34
డాక్స్	16,972	△	31
షాంఘై	2,831	▽	53
నికాయ్	36,066	△	39

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,413	▽	102
బంగారం (99.5 స్వచ్ఛత)	62,161	▽	104
వెండి (కిలో)	70,951	▽	420

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.54	107.09
€	యూరో	ఒకటి	89.00	91.36
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.84	57.11
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.07	56.00
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.19	62.63
SAR	సౌదీ రియాల్	పాయింట్లలో	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	పాయింట్లలో	21.71	23.50
¥	చైనా యువాన్	పాయింట్లలో	10.50	12.49

ఎల్‌అండ్‌టీ లాభం అప్

క్యూ3లో రూ. 2,947 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం ఎల్‌అండ్‌టీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం వృద్ధితో రూ. 2,947 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 2,553 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 47,145 కోట్ల నుంచి రూ. 55,966 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో వార్షిక ప్రాతిపదికన 25 శాతం అధికంగా రూ. 75,990 కోట్ల విలువైన కాంట్రాక్టులను పొందింది.

ఆర్డర్ల రికార్డ్

అనిశ్చిత ప్రపంచ వాతావరణం, సరఫరా చైన్ సవాళ్ల నేపథ్యంలోనూ మరోసారి పటిష్ట ఫలితాలు సాధించగలిగినట్లు ఎల్‌అండ్‌టీ చైర్మన్, ఎండీ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి 9 నెలల్లోనే గత పూర్తి ఏడాది(2022–23)కి లభించిన ఆర్డర్ల విలువను అధిగమించినట్లు తెలియజేశారు. విభిన్న విభాగాలలో కార్యకలాపాలు, సామర్థ్యాలు, ఆర్థిక పటిష్టతతోపాటు.. కంపెనీపట్ల కస్టమర్లకు గల విశ్వాసాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్–డిసెంబర్ కాలంలో కంపెనీ మొత్తం ఆర్డర్ల విలువ 49 శాతం జంప్‌చేసి రూ. 2,30,662 కోట్లను తాకాయి. వీటిలో 60 శాతం(రూ. 1,37,894 కోట్లు) అంతర్జాతీయ కాంట్రాక్టులు కావడం గమనార్హం!

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు బీఎస్‌ఈలో 2 శాతం నీరసించి రూ. 3,633 వద్ద ముగిసింది.

బజాజ్ ఫిన్ లాభం జూమ్

క్యూ3లో రూ. 2,158 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22 శాతం జంప్‌చేసి రూ. 2,158 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 1,782 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 21,755 కోట్ల నుంచి రూ. 29,038 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 10,430 కోట్ల నుంచి రూ. 13,922 కోట్లకు బలపడింది. అనుబంధ సంస్థ బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లాభం 33% ఎగసి రూ. 108 కోట్లకు ఎగసింది. బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్ లాభం మాత్రం రూ. 281 కోట్లకు స్వల్పంగా మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు 3 శాతం క్షీణించి రూ. 1,591 వద్ద ముగిసింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,379 కోట్లు

- క్యూ3లో 11 శాతం అప్
- ఆదాయం రూ. 7,215 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాడబొరేటరీస్ (డీఆర్ఎల్) నికర లాభం 11 శాతం పెరిగి రూ. 1,379 కోట్లకు చేరింది. గత క్యూ3లో ఇది రూ. 1,247 కోట్లు. ఇక తాజా సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,770 కోట్ల నుంచి సుమారు 7 శాతం వృద్ధి చెంది రూ. 7,215 కోట్లకు ఎగిసింది. ఉత్తర అమెరికాలో ప్రస్తుతమున్న ఔషధాల మార్కెట్ వాటా పెరగడం, యూరప్ మార్కెట్లో వ్యాపార వృద్ధి తదితర అంశాలు ఇందుకు దోహదపడినట్లు కంపెనీ వెల్లడించింది. కొత్త ఉత్పత్తులు కూడా తోడు కావడంతో మూడో త్రైమాసికంలో పటిష్టమైన ఆర్థిక పనితీరు, అత్యధిక అమ్మకాలు సాధించినట్లు సంస్థ సహ చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. సమీక్షాకాలంలో అమెరికాలో మెనో ల్యాబ్స్ బ్రాండెడ్ పోర్ట్‌ఫోలియోను కొనుగోలు చేసినట్లు మంగళవారమిక్కడ విలేకరులతో వర్చువల్ సమావేశంలో కంపెనీ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ వివరించారు. అలాగే కోయా 302 ఔషధ అభివృద్ధి కోసం కోయా థెరప్యూటిక్స్‌తో చేతులు కలిపినట్లు పేర్కొన్నారు. అటు బాచుపల్లి ప్లాంటులో అమెరికా ఎఫ్‌డీఏ తనిఖీలు పూర్తయ్యాయని, ఎఫ్‌డీఏ వ్యక్తపర్చిన అభ్యంతరాలపై వివరణను సమర్పించామని ఇజ్రేలీ వివరించారు.

మరిన్ని విశేషాలు..

- గ్లోబల్ జనరిక్స్ (జీజీ) వ్యాపార ఆదాయం 7 శాతం వృద్ధి చెంది రూ. 6,301 కోట్లకు చేరింది. కొన్ని మార్కెట్లలో ధరలు తగ్గినప్పటికీ కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, ప్రధాన ఉత్పత్తుల మార్కెట్ వాటా పెరగడం ఇందుకు తోడ్పడ్డాయి. ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్ఏఐ) విభాగ ఆదాయం 1 శాతం వృద్ధి చెంది రూ. 780 కోట్లకు చేరింది.
- గ్లోబల్ జనరిక్స్‌కి సంబంధించి కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఆదాయం 9 శాతం పెరిగి రూ. 3,350 కోట్లకు చేరింది. క్యూ3లో ఉత్తర అమెరికాలో మొత్తం 4 ఉత్పత్తులను కంపెనీ ఆవిష్కరించింది.
- యూరప్ మార్కెట్ 15 శాతం పెరిగి రూ. 500 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో కంపెనీ 6 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టింది.
- భారత మార్కెట్ విషయానికొస్తే 5 శాతం వృద్ధితో ఆదాయం రూ. 1,180 కోట్లకు పెరిగింది. దేశీయంగా క్యూ3లో 3 కొత్త బ్రాండ్లను సంస్థ ప్రవేశపెట్టింది.

మంగళవారం డాక్టర్ రెడ్డీస్ షేరు స్వల్పంగా పెరిగి రూ. 5,846 వద్ద క్లోజయ్యింది.

రామ్‌రాజ్ కాటన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రిషభ్ శెట్టి



చెన్నై: కాంతారా సినిమా నటుడు రిషభ్ శెట్టి ఇక రామ్‌రాజ్ కాటన్ ప్రచారకర్త అవతారమెత్తనున్నారు. ''తన ప్రతిభ తో విభిన్న ప్రేక్షకులను అలరించే సామర్థ్యాలున్న రిషభ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇకపై రామ్‌రాజ్ కంపెనీ తయారు చేస్తున్న ధోతీలు, షర్ట్స్, కుర్తాలకు రిషభ్ ప్రచారం చేస్తారు. దేశీయ మార్కెట్లో రామ్‌రాజ్ బ్రాండ్ ఉనికిని మరింత పటిష్టం చేసే లక్ష్యాల్లో ఇది ఒక భాగం'' అని కంపెనీ ఎండీ అరుణ్ ఈశ్వరన్ తెలిపారు.

ఇంటి వద్దకే ఐకియా ఉత్పత్తులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కస్టమర్లకు మరింత చేరువ అయ్యేందుకు ఫర్నిచర్ దిగ్గజం ఐకియా తాజాగా 62 కొత్త మార్కెట్లలో ఇంటి వద్దకే డెలివరీ సేవలను విస్తరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో ఈ మార్కెట్లు నెలకొన్నాయని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్ వేదికగా 25 శాతం విక్రయాలు నమోదవుతున్నాయి. ఫోన్ ద్వారా ఆర్డర్ ఇస్తే సరుకు డెలివరీ చేసేలా ఫిబ్రవరి 1 నుంచి సేవలను ప్రారంభిస్తామని ఐకియా ఇండియా సీఈవో సుసాన్ పల్వరర్ తెలిపారు.

పడగొట్టిన రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ

- బజాజ్ ద్వయం, ఐటీసీ షేర్లలో విక్రయాలు
- మార్కెట్లలో 'ఫెడ్ పాలసీ' ముందు అప్రమత్తత
- ఒక శాతం నష్టపోయిన సూచీలు



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. క్యూ3 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో బజాజ్ ద్వయం, ఐటీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెడరల్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి(బుధవారం)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా స్టాక్ సూచీలు బుధవారం ఒక శాతం పతనమయ్యాయి. సెన్సెక్స్ 802 పాయింట్లు నష్టపోయి 71,140 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 215 పాయింట్లు క్షీణించి 21,522 వద్ద నిలిచింది. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు అమ్మకాల ఒత్తిడితో రోజంతా నష్టాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 866 పాయింట్లు క్షీణించి 71,076 వద్ద, నిఫ్టీ 236 పాయింట్లు పతనమై 21,502 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లకు మాత్రమే స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, విద్యుత్, ఎఫ్‌ఎంసీజీ, యుటిలిటీ, పారిశ్రామిక రంగాల షేర్లలో విక్రయాలు నెలకొన్నాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ సూచీలు 0.53%, 0.18% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,971 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1003 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ పాలసీ వెల్లడికి ముందు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

ఇతర ముఖ్యాంశాలు...

- జీవితకాల గరిష్ట స్థాయి (రూ.2,918) వద్ద రిలయన్స్ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్‌ఈలో ఈ షేరు 3% నష్టపోయి రూ.2815 వద్ద స్థిరపడింది. మంగళవారం ట్రేడింగ్‌లో 7% ర్యాలీ చేసింది. మరో అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లలోనూ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో ఈ ప్రైవేట్ రంగ దిగ్గజం దాదాపు 1% నష్టపోయి రూ.1444 వద్ద ముగిసింది.
- క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 5% నష్టపోయి రూ.6,815 వద్ద నిలిచింది. షేరు 5% క్షీణతతో మార్కెట్ విలువ రూ. 22,984 కోట్లు హరించుకుపోయి రూ.4.21 లక్షల కోట్లకు దిగివచ్చింది. బజాజ్ ఫైనాన్స్ పతనంతో ఇదే గ్రూప్ చెందిన బజాజ్ ఫిన్‌సర్వ్ షేరూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో ఈ షేరు 3% నష్టపోయి రూ.1591 వద్ద నిలిచింది.
- ఐటీసీ డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోవడంతో షేరు 3% నష్టపోయి రూ.438 వద్ద నిలిచింది.
- లిస్టింగ్ రోజే ఈప్యాక్ డ్యూరబుల్ షేరు 10% నష్టపోయింది. ఇష్యూ ధర (రూ.230)తో బీఎస్‌ఈలో 2% డిస్కౌంట్‌తో రూ.225 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 11% పతనమై రూ.206 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 10% నష్టంతో రూ.208 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,990 కోట్లుగా నమోదైంది.
- మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాటా మోటార్స్–డీవీఆర్‌తో కలుపుకొని టాటా మోటార్స్ కంపెనీ మారుతీ సుజుకీని అధిగమించి ఆటో రంగంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. బుధవారం టాటా మోటార్స్ షేరు 2% పెరిగి రూ.859 వద్ద, టాటా మోటార్స్–డీవీఆర్ షేరు 1.63% లాభపడి రూ.573 వద్ద ముగిశాయి.
- బీఎల్ఎస్ ఈ–సర్వీసెస్ ఐపీఓకు తొలిరోజు 15.63 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.37 కోట్ల షేర్లను జారీ చేయగా 21.41 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ కోటా 49.రెట్లు, సంస్థాగతేతర విభాగం 29.66 రెట్లు, క్యూబీఐ కోటా 2.19 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

నాలుగేళ్లలో రెట్టింపు ఆదాయం

నూజివీడు సీడ్స్ లక్ష్యం • కంపెనీకి 50 ఏళ్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతున్న కొత్త ఉత్పత్తుల ఊతంతో వచ్చే నాలుగైదేళ్లలో ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని విత్తనాల సంస్థ నూజివీడు సీడ్స్ (ఎన్ఎస్ఎల్) నిర్దేశించుకుంది. ప్రస్తుతం కాటన్ సీడ్స్ మార్కెట్లో దాదాపు 16–17 శాతంగా ఉన్న వాటాను 30 శాతానికి చేర్చుకోవాలని భావిస్తోంది. కంపెనీ నెలకొల్పి 50 ఏళ్లయిన సందర్భంగా మంగళవారమిక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎల్ గ్రూప్ చైర్మన్ ఎం. ప్రభాకరరావు ఈ విషయాలు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో నూజివీడు సీడ్స్ ఆదాయం రూ. 1,100 కోట్లుగా ఉంది.



కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ కోసం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై గణనీయంగా వెచ్చిస్తున్నట్లు ప్రభాకరరావు తెలిపారు. తమ ఆదాయాల్లో 5 శాతం పైగా కేటాయిస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 13 ప్రాసెసింగ్ సెంటర్లు, 29 కోల్డ్ స్టోరేజీలు..గిడ్డంగులు ఉన్నట్లు తెలిపారు. 1 లక్ష మంది పైగా రైతుల నుంచి విత్తనాలు సేకరిస్తున్నట్లు, 20 వేల మంది పైచిలుకు రిటైలర్ల ద్వారా దాదాపు 50 లక్షల మంది రైతులకు సేవలు అందిస్తున్నట్లు ప్రభాకరరావు పేర్కొన్నారు. 1973లో మండవ వెంకటరామయ్య ప్రారంభించిన నూజివీడు సీడ్స్‌కి ఒక దశలో కాటన్ సీడ్ మార్కెట్లో మూడో వంతు వాటా దక్కించుకుంది. అప్పట్లో ఏర్పాటైన అనేక విత్తన సంస్థలు కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఎన్ఎస్ఎల్ పటిష్టంగా నిలదొక్కుకుందని ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సీఎస్‌వో శరద్ ఖురానా, డైరెక్టర్ పి. సతీష్ కుమార్, సీఎఫ్‌వో వి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాబ్ పాయింట్

ఆర్ఎఫ్‌సీఎల్‌లో 39 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 39
» **పోస్టుల వివరాలు:** అటెండెంట్ గ్రేడ్1(మెకానికల్)–15,అటెండెంట్ గ్రేడ్1(ఎలక్ట్రికల్)–15, అటెండెంట్ గ్రేడ్1(ఇన్‌స్ట్రుమెంటేషన్)–09.
» **ట్రేడులు:** ఫిట్టర్, డీజిల్ మెకానిక్, మెకానిక్–హెవీ వెహికల్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్.
» **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. ఐటీఐలో జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
» **వయసు:** 31.01.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **బేసిక్ పే:** నెలకు రూ.21,500 నుంచి రూ. 52,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్(ట్రేడ్)టెస్ట్, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, నాగ్‌పూర్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.02.2024
» **వెబ్‌సైట్:** www.rfcl.co.in

ఆర్ఆర్‌బీలో 5,696 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులు

దేశవ్యాప్తంగా రైల్వే శాఖ(రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు) అన్నీ రైల్వే రీజియన్లలో అసిస్టెంట్ లోకో పైలట్(ఏఎల్‌పీ) పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5,696
» **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు,భోపాల్,భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్,సిలిగురి,తిరువనంతపురం, గోరఖ్‌పూర్.
» **కేటగిరీ వారీగా పోస్టులు:** యూఆర్–2499, ఎస్సీ–804, ఎస్టీ–482, ఓబీసీ–1351, ఈడబ్ల్యూఎస్–560, ఎక్స్‌ఎస్ఎం–572.
» **ఆర్ఆర్‌బీ రీజియన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్–238, అజ్మీర్–228, బెంగళూరు–473, భోపాల్–284, భువనేశ్వర్–280, బిలాస్‌పూర్–1316, చండీగఢ్–66, చెన్నై–148, గువాహటి–62, జమ్మూ అండ్ శ్రీనగర్–39, కోల్‌కతా–345, మాల్దా–217, ముంబై–547, ముజఫర్‌పూర్–38, పాట్నా–38, ప్రయాగ్‌రాజ్–286, రాంచీ–153, సికింద్రాబాద్–758, సిలిగురి–67, తిరువనంతపురం–70, గోరఖ్‌పూర్–43.
» **అర్హత:** అభ్యర్థులు మెట్రిక్యులేషన్‌తోపాటు ఐటీఐ(ఫిట్టర్/ఎలక్ట్రీషియన్ /ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/మిల్‌రైట్/మెయింటెనెన్స్ మెకానిక్/మెకానిక్–రేడియో అండ్ టీవీ/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్–మోటార్ వెహికల్/వైర్‌మ్యాన్/ట్రాక్టర్ మెకానిక్/ఆర్మేటర్ అండ్ కాయిల్ వైండర్/మెకానిక్–డీజిల్/హీట్ ఇంజిన్ /టర్నర్/మెషినిస్ట్/రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్)పూర్తిచేసి ఉండాలి. లేదా మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ లేదా ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా చేసినవారు అర్హులే.
» **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:** నెలకు రూ.19,900 నుంచి 63,200.
» **ఎంపిక విధానం:** ఫస్ట్ స్టేజ్ సీబీటీ–1, సెకండ్ స్టేజ్ సీబీటీ–2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** సీబీటీ–1కు 60 నిమిషాల సమయం ఉంటుంది. మొత్తం 75 ప్రశ్నలకు 75 మార్కులు కేటాయించారు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. మ్యాథ్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. సీబీటీ–2లో రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్–ఏ విభాగానికి 90 నిమిషాల వ్యవధి, 100 ప్రశ్నలు, పార్ట్–బి విభాగానికి 60 నిమిషాల వ్యవధి, 75 ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. పార్ట్–ఏలో మ్యాథ్స్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, పార్ట్–బిలో సంబంధిత ట్రేడ్ సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.02.2024.
» **దరఖాస్తులో మార్పులకు అవకాశం:** 20.02.2024 నుంచి 29.02.2024 వరకు.
» **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in

» మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశానికి పలు ఎంట్రన్స్‌లు
» జాతీయ స్థాయిలో క్యాట్, రాష్ట్రంలో ఐసెట్‌కు ప్రాధాన్యం
» ఉమ్మడి ప్రిపరేషన్‌తో మేలంటున్న నిపుణులు

ఎంబీఏకు.. మార్గాలెన్నో!

మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.. సంక్షిప్తంగా ఎంబీఏ! గ్రాడ్యుయేషన్ స్థాయి అభ్యర్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న కోర్సు. దేశంలోని ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐఎంలతోపాటు రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీలు, కాలేజీలు ఎంబీఏను అందిస్తున్నాయి. ఈ కోర్సును పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ రంగంలో కొలువులు దక్కించుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు క్యాట్, ఐసెట్‌తోపాటు మరెన్నో ఎంబీఏ ఎంట్రెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. త్వరలో డిగ్రీ కోర్సులు పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు ఉపయోగపడేలా ముఖ్యమైన ఎంబీఏ ఎంట్రన్స్ టెస్టులు, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



ఆఫ్టర్ డిగ్రీ

ఎంబీఏ అభ్యర్థులు అధికశాతం మంది క్యాట్, ఐసెట్‌లపైనే దృష్టిసారిస్తున్నారు. వీటిలో ఆశించిన ఫలితం రాకుంటే నిరాశకు లోనవుతున్నారు. కానీ.. ఈ పరీక్షల సన్నద్ధతతోనే పలు ఇతర ఎంబీఏ ఎంట్రన్స్ టెస్టులకు పోటీ పడే అవకాశముంది. వాటిలో మంచి స్కోర్‌తో ప్రముఖ బిజినెస్ స్కూల్స్‌లో మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశం పొందొచ్చు అంటున్నారు నిపుణులు. మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ కోసం క్యాట్, ఐసెట్‌తోపాటు సీమ్యాట్, మ్యాట్, ఎక్స్‌ఏటీ, ఎన్‌మ్యాట్ వంటి ఎన్నో ఎంట్రన్స్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రవేశ పరీక్షల సిలబస్ దాదాపు ఒకే విధంగా ఉంటోంది.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)

కామన్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా క్యాట్. జాతీయ స్థాయిలో ఐఐఎంలు, ఇతర ప్రముఖ బిస్కూల్స్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. ఎంబీఏ అభ్యర్థుల తొలి గమ్యంగా నిలుస్తోంది క్యాట్. మొత్తం మూడు విభాగాల్లో ఈ పరీక్ష ఉంటుంది. అవి.. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్; డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్; క్వాంటిటేటివ్ ఎబిలిటీ. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ఆబ్జెక్టివ్ విధానంలో, ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఆయా ఐఐఎంలు నిర్దిష్ట కటాఫ్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి.. తదుపరి దశ(గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ)కు ఎంపిక చేస్తాయి. వాటిలోనూ విజయం సాధిస్తే ఐఐఎంలలో ప్రవేశం లభిస్తుంది.

ఐసెట్

ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్..సంక్షిప్తంగా ఐసెట్. ఇది తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు సుపరిచితమైన ఎంబీఏ ప్రవేశ పరీక్ష. తెలంగాణలో టీఎస్ ఐసెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఐసెట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఉత్తీర్ణత ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లోని ఎంబీఏ కళాశాలల్లో ప్రవేశం పొందొచ్చు. ఐసెట్‌ను మూడు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. అవి.. అనలిటికల్ ఎబిలిటీ, మ్యాథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ. వీటిల్లో డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, అర్థమెటిక్ ఎబిలిటీ, అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ, వొకాబ్యులరీ, బిజినెస్ అండ్ కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఫంక్షనల్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి ఉప విభాగాలుగా ఉంటాయి. ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఐసెట్‌కు ప్రతి ఏటా ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. పరీక్ష మే నెలలో నిర్వహిస్తారు. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

సీమ్యాట్

దేశంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ.. ఏఐసీటీఈ(ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్). ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగే పరీక్ష..కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్). ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో ఏఐసీటీఈ అనుబంధ కళాశాలలు, ఇతర ప్రముఖ బీస్కూల్స్‌లో ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ తదితర పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఈ పరీక్షను మొత్తం అయిదు విభాగాల్లో 400 మార్కులకు నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాజికల్ రీజనింగ్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు–80 మార్కులు; జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–80 మార్కులు; ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 20 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి ఏటా ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. మార్చి/ఏప్రిల్‌ల్లో పరీక్ష ఉంటుంది. సీమ్యాట్ స్కోర్ ఆధారంగా ఆయా బీస్కూల్స్ దరఖాస్తులు ఆహ్వానించి.. మలి దశలో గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించి అడ్మిషన్ కల్పిస్తాయి.

మ్యాట్

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష.. మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్). ఏటా నాలుగు సార్లు ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్‌లో ఈ పరీక్ష జరుగుతుంది. మ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఆరు వందలకు పైగా బిజినెస్ స్కూల్స్ ఎంబీఏ, ఇతర పీజీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి.

ఈ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో(లాంగ్వేజ్ కాంప్రహెన్షన్–40 ప్రశ్నలు; ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్–40 ప్రశ్నలు; మ్యాథమెటికల్ స్కిల్స్–40 ప్రశ్నలు; డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ–40 ప్రశ్నలు; ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్–40 ప్రశ్నలు) ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 200 మార్కులు ఉంటాయి.

✦ వెబ్‌సైట్: https://mat.aima.in

ఎక్స్‌ఏటీ

జాతీయ స్థాయిలో పేరున్న పరీక్ష.. ఎక్స్‌ఏటీ. గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ పేరుతో ఎక్స్‌ఎల్ఆర్ఐ–జంషెడ్‌పూర్.. ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఎక్స్‌ఏటీ స్కోర్ ఆధారంగా ఎక్స్‌ఎల్ఆర్ఐ అనుబంధ కళాశాలలే కాకుండా.. జాతీయ స్థాయిలో మరో 150 ఇన్‌స్టిట్యూట్‌ల్లో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో చేరే వీలుంది. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు ఎక్స్‌ఏటీకి దరఖాస్తుకు అర్హులు. చివరి సంవత్సరం విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షను అయిదు విభాగాల్లో(డెసిషన్ మేకింగ్, వెర్బల్ అండ్ లాజికల్ ఎబిలిటీ; క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్; జనరల్ నాలెడ్జ్; ఎస్సే రైటింగ్) వంద మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది.

✦ వెబ్‌సైట్: https://xatonline.in

ఎన్‌మ్యాట్

జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మరో మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్.. ఎన్‌మ్యాట్(నర్సీమొంజీ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్). తొలుత ముంబైలోని నర్సీమొంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశాలకు ఆ ఇన్‌స్టిట్యూట్ ఎన్‌మ్యాట్‌ను నిర్వహించేది. ప్రస్తుతం జీమ్యాక్ ఆధ్వర్యంలో ఎన్‌మ్యాట్‌ను నిర్వహిస్తున్నారు. ఎన్‌మ్యాట్ స్కోర్ ఆధారంగా భారతదేశంతో పాటు దక్షిణాఫ్రికా, ఫిలిప్పైన్స్, మొరాకోలలోని ఇన్‌స్టిట్యూట్‌లు కూడా మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. పరీక్ష మూడు విభాగాల్లో(లాంగ్వేజ్ స్కిల్స్–36 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ స్కిల్స్–36 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్–36 ప్రశ్నలు) జరుగుతుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

✦ వెబ్‌సైట్:https://mba.com/exams/nmat

ఏటీఎంఏ

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మరో మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్.. ఏఐఎంఏ. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్.. టెస్ట్ ఫర్ మేనేజ్‌మెంట్ పేరుతో ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ఉత్తీర్ణత ద్వారా జాతీయ స్థాయిలో రెండు వందలకుపైగా ప్రముఖ బీస్కూల్స్‌లో ప్రవేశాలకు అర్హత లభిస్తుంది. మొత్తం ఆరు విభాగాల్లో(అనలిటికల్ రీజనింగ్, వెర్బల్ స్కిల్స్, క్వాంటిటేటివ్ స్కిల్స్) పరీక్ష ఉంటుంది. ప్రతి విభాగానికి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 180 ప్రశ్నలకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రతి ఏటా మూడుసార్లు(ఫిబ్రవరి, మే, జూలై) పరీక్ష జరుగుతుంది.

✦ వెబ్‌సైట్: www.atmaaims.com

ఉమ్మడి ప్రిపరేషన్ ఇలా

✦ దేశంలోని ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్‌ల సిలబస్ దాదాపు ఒకే తీరుగా ఉంటోంది. అన్నింటిలోనూ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డెసిషన్ మేకింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాలున్నాయి.
✦ క్వాంటిటేటివ్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి జామెట్రీ, ఆల్‌జీబ్రా, నెంబర్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలపై కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. వాటి ఆధారంగా సమస్యలను సాల్వ్ చేయడం ప్రాక్టీస్ చేయాలి.
✦ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించాలంటే.. ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను సాధన చేయాలి.
✦ లాజికల్ రీజనింగ్‌లో స్కోర్ కోసం స్టేట్‌మెంట్స్, పజిల్స్ సాధన చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా వెన్ డయాగ్రమ్స్, డిడక్షన్, పజిల్స్, లాజికల్ కనెక్టివిటీ, క్యూబ్స్ వంటి వాటిపై పట్టు సాధించాలి.
✦ వెర్బల్ ఎబిలిటీ కోసం విశ్లేషణాత్మక నైపుణ్యం అవసరం. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ నేర్చుకోవాలి. పద ప్రయోగం, వాక్య నిర్మాణ శైలిపై ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
✦ జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్‌లకు సంబంధించి సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంతర్జాతీయ అంశాలపై దృష్టిపెట్టాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.



ఏడో ర్యాంక్‌లో ప్రణయ్

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్ టాప్-100లో భారత్ నుంచి ఏకంగా 12 మంది చోటు సంపాదించారు. తాజా ర్యాంకింగ్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ఒక స్థానం పురోగతి సాధించి ఏడో ర్యాంక్‌కు చేరుకొని భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా లక్ష్య సేన్ (20), శ్రీకాంత్ (24), ప్రియాన్షు (28), కిరణ్ జార్జి (36), సతీశ్ కుమార్ (49), మిథున్ మంజునాథ్ (63), శంకర్ ముత్తుస్వామి (70), సమీర్ వర్మ (77), సాయిప్రణీత్ (91), మెరాబా లువాంగ్ మైస్నమ్ (93), చిరాగ్ సేన్ (99) ఉన్నారు.

తెలుగు టైటాన్స్ ఓటమి నంబర్ 15



ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ పేలవ ప్రదర్శన కొనసాగిస్తూ 15వ పరాజయాన్ని చవిచూసింది. మంగళవారం పట్నాలో పుణేరి పల్టన్‌తో జరిగిన పోరులో పవన్ సెహ్రావత్ నాయకత్వంలోని తెలుగు టైటాన్స్ 29-60తో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పుణేరి ఆల్‌రౌండ్ దెబ్బకు టైటాన్స్ జట్టు నాలుగుసార్లు ఆలౌటైంది. పల్టన్ తరఫున ఆకాశ్ 11 పాయింట్లతో రాణించాడు. టైటాన్స్ ప్లేయర్ సంజీవి అత్యధికంగా 8 పాయింట్లు సాధించాడు.



దీప్తి ... ఇక డీఎస్పీ

క్రికెటర్‌కు రూ. 3 కోట్ల నజరానా కూడా అందించిన యూపీ ప్రభుత్వం

లక్నో: భారత మహిళల క్రికెట్ జట్టులో కీలక సభ్యురాలు దీప్తి శర్మకు సొంతరాష్ట్రం ఉత్తరప్రదేశ్ నుంచి ఉన్నతోద్యోగంతో పాటు రూ.3 కోట్ల నజరానా లభించింది. ఆగ్రాకు చెందిన 26 ఏళ్ల ఈ ఆల్‌రౌండర్‌ను యోగి ఆదిత్యనాథ్ సర్కారు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నియమించింది. కొంతకాలంగా ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తోంది. గతేడాది బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో రజతం నెగ్గిన భారత జట్టు చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచి పసిడి పతకం నెగ్గింది. ఈ రెండు టోర్నీల్లో దీప్తి శర్మ ఆకట్టుకుంది. 2023 డిసెంబర్ నెలకుగాను 'ఐసీసీ మహిళా ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా దీప్తి ఎంపికైంది. అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతో పాటు పలువురు ఉత్తరప్రదేశ్ క్రీడాకారులను రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘనంగా సత్కరించారు. యూపీ అథ్లెట్లు పారుల్ చౌధరీకి డీఎస్పీ పదవితో పాటు రూ. 4 కోట్ల 50 లక్షలు... అన్ను రాణి (జావెలిన్ త్రో)కి రూ.3 కోట్లు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. శిక్షణ కోసం విదేశాల్లో ఉండటంతో ఈ కార్యక్రమానికి పారుల్, అన్ను రాణి హాజరుకాలేకపోయారు. పారా అథ్లెట్లు జతిన్ కుష్వాహ, యశ్ కుమార్‌లకు రూ. 5 లక్షల చొప్పున నజరానా అందజేశారు.

214 పరుగుల తేడాతో...

- న్యూజిలాండ్‌పై భారత్ ఘనవిజయం
- అండర్-19 ప్రపంచకప్ టోర్నీలో వరుసగా నాలుగో గెలుపు
- ముషీర్ ఖాన్ రెండో సెంచరీ
- సౌమీ పాండేకు నాలుగు వికెట్లు


ముషీర్ ఖాన్

బ్లూమ్‌ఫోంటీన్ (దక్షిణాఫ్రికా): సమష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న భారత యువ జట్టు అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమిండియా 'సూపర్ సిక్స్' గ్రూప్-1తొలి మ్యాచ్‌లోనూ చెలరేగింది. న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఉదయ్ సహారణ్ నాయకత్వంలోని భారత జట్టు ఏకంగా 214 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఈ గెలుపుతో భారత్ 'సూపర్ సిక్స్' దశలో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ సెమీఫైనల్‌కు మరింత చేరువైంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 295 పరుగులు సాధించింది. ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (58 బంతుల్లో 52; 6 ఫోర్లు) ఈ టోర్నీలో రెండో అర్ధసెంచరీ చేయగా... ఇంగ్లండ్‌తో రెండో టెస్టు కోసం ఎంపికైన ముంబై క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ సొంత తమ్ముడైన ముషీర్ ఖాన్ మరోసారి మెరిపించాడు. బాధ్యతాయుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న ముషీర్ ఖాన్ (126 బంతుల్లో 131; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ టోర్నీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. ఉదయ్ (34; 2 ఫోర్లు), హైదరాబాద్ క్రికెటర్ అరవెల్లి అవినాష్ రావు (18 బంతుల్లో 17; 2 సిక్స్‌లు), సచిన్ (11 బంతుల్లో 15; 2 ఫోర్లు) కూడా రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మేసన్ క్లార్క్ 62 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 296 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 28.1 ఓవర్లలో కేవలం 81 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. కెప్టెన్ ఆస్కార్ జాక్సన్ (19; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత ఎడంచేతి వాటం స్పిన్నర్ సౌమీ పాండే 19 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా...రాజ్ లింబాని 2 వికెట్లు, ముషీర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. శుక్రవారం జరిగే 'సూపర్ సిక్స్' గ్రూప్-1 చివరిదైన రెండో మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది.

మళ్లీ స్పిన్ పిచ్‌కు సిద్ధమే!

ఇంగ్లండ్ హెడ్ కోచ్ మెకల్లమ్ వ్యాఖ్య


వైజాగ్ ఎయిర్‌పోర్ట్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్, టీమిండియా సారథి రోహిత్ శర్మ

విశాఖపట్నం: రెండో టెస్టులోనూ స్పిన్ పిచ్‌పై సమరానికి సిద్ధమని ఇంగ్లండ్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ అన్నాడు. స్పిన్నర్ టామ్ హార్ట్లీ మాయాజాలంతో హైదరాబాద్ టెస్టులో గెలిచిన ఉత్సాహంతో ఉన్న ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిరీస్‌లో మరో పూర్తిస్థాయి స్పిన్ ట్రాక్ ఎదురైనా... తమ దళంలో అందుబాటులో ఉన్న నలుగురు స్పిన్నర్లతో దీటుగా ఎదుర్కొంటామని కోచ్ చెప్పారు. 'ఒకవేళ తొలి టెస్టులాగే వైజాగ్‌లోని పిచ్ కూడా స్పిన్‌కే అనుకూలిస్తే భయపడం. జట్టులోని స్పిన్నర్లు దీన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటారు. షోయబ్ బషీర్ అబుదాబిలో నిరూపించుకున్నాడు. ప్రస్తుతం ఆడే సిరీస్‌లోనూ రాణించే నైపుణ్యం అతనికి ఉంది. తప్పకుండా ఇక్కడ కూడా అతను ప్రభావం చూపుతాడు' అని మెకల్లమ్ అన్నాడు. .

వైజాగ్ చేరుకున్న ఇరుజట్లు

భారత్, ఇంగ్లండ్ జట్లు మంగళవారం సాయంత్రం వైజాగ్ చేరుకున్నాయి. నేరుగా హైదరాబాద్ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఇరుజట్ల ఆటగాళ్లు అక్కడి నుంచి బస చేసే హోటల్‌కు వెళ్లిపోయారు. అనంతరం ఆటగాళ్లంతా ప్రయాణ బడలిక దృష్ట్యా పూర్తిగా హోటల్ గదులకే పరిమితమయ్యారు. ఫిబ్రవరి 2 నుంచి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రెండో టెస్టు జరుగుతుంది.

శ్రమించి నెగ్గిన గాయత్రి-ట్రెసా జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 74 నిమిషాల్లో 16-21, 21-10, 21-18తో లోక్ లోక్ లుయ్-వింగ్ యంగ్ ఎన్జీ (హాంకాంగ్) జంటపై శ్రమించి గెలిచింది. ప్రీక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టోలతో గాయత్రి-ట్రెసా తలపడతారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో అశ్విని-తనీషా ద్వయం 21-13, 21-17తో లింగ్ ఫాంగ్ హు-జియావో మిన్ లిన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. మరోవైపు భారత ఆటగాళ్లు సమీర్ వర్మ, శంకర్ ముత్తుస్వామి పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు.

భారత్ పరాజయం

మస్కట్: పురుషుల హాకీ 'ఫైవ్-ఎ-సైడ్' ప్రపంచ కప్ టోర్నీలో భారత జట్టు పతకం రేసులో నిలువలేకపోయింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 4-7 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున రహీల్ మొహమ్మద్ (1వ, 7వ, 25వ ని.లో) మూడు గోల్స్ చేయగా... మందీప్ మోర్ (11వ ని.లో) ఒక గోల్ సాధించాడు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన భారత జట్టు 5 నుంచి 8 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌ల్లో భాగంగా కెన్యాతో జరిగిన పోరులో 9-4తో ఘనవిజయం సాధించింది.



ఇస్లామాబాద్‌లో భారత ఆటగాళ్ల ప్రాక్టీస్

2, 3 తేదీల్లో పాకిస్తాన్ జట్టుతో డేవిస్‌కప్ టెన్నిస్ మ్యాచ్



ఇస్లామాబాద్: డేవిస్‌కప్ గ్రూప్-1 ప్లేఆఫ్ పోరులో భాగంగా పాకిస్తాన్ జట్టుతో తలపడేందుకు 1964 తర్వాత భారత జట్టు మళ్లీ పాకిస్తాన్‌లో అడుగు పెట్టింది. రామ్‌కుమార్, శశికుమార్ ముకుంద్, యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ, దిగ్విజయ్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని భారత బృందంలో ఉన్నారు. చివరిసారిగా భారత్, పాక్‌లు 1964లో పాక్ గడ్డపై పోటీపడ్డాయి. 2019లోనూ పాకిస్తాన్‌లో భారత జట్టు పర్యటించాల్సి ఉండగా... ఈ మ్యాచ్‌ను అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) తటస్థ వేదిక కజకిస్తాన్‌కు మార్చింది. ఈ పోరులో భారత్ 4-1తో పాకిస్తాన్‌ను ఓడించింది. ఈసారి మాత్రం పాకిస్తాన్‌లో భారత జట్టు ఆడాల్సిందేనని, వేదిక మార్చడం వీలుకాదని ఐటీఎఫ్ స్పష్టం చేసింది. భారత జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ వ్యక్తిగత కారణాలతో పాకిస్తాన్‌కు వెళ్లలేకపోవడంతో జీషాన్ అలీ ద్విపాత్రాభినయం చేయనున్నాడు. కోచ్‌గా వచ్చిన జీషాన్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గానూ వ్యవహరిస్తాడు.

20 కిలోమీటర్ల నడకలో అక్షదీప్ జాతీయ రికార్డు

మరో ముగ్గురు భారత అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత



చండీగఢ్: జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్ పురుషుల 20 కిలోమీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నమోదైంది. ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన పంజాబ్ అథ్లెట్ అక్షదీప్ సింగ్ మంగళవారం జరిగిన పోటీల్లో 20 కిలోమీటర్ల దూరాన్ని ఒక గంట 19 నిమిషాల 38 సెకన్లలో నడిచి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. ఒక గంట 19 నిమిషాల 55 సెకన్లతో తన పేరిట ఉన్న జాతీయ రికార్డును అక్షదీప్ బద్దలు కొట్టాడు. సూరజ్ పన్వర్ (1గం:19ని.44 సెకన్లు; ఉత్తరాఖండ్) రెండో స్థానంలో, సెర్విన్ సెబాస్టియన్ (1గం:20.03 సెకన్లు; తమిళనాడు) మూడో స్థానంలో, అర్ష్‌ప్రీత్ సింగ్ (1గం:20ని.04 సెకన్లు) నాలుగో స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురు కూడా పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ (1గం:20.10 సెకన్లు) సమయాన్ని అధిగమించారు. దాంతో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత వాకర్ల సంఖ్య ఆరుకు చేరుకుంది. నిబంధనల ప్రకారం ఒలింపిక్స్‌లో రేస్ వాకింగ్‌లో ఒక దేశం నుంచి గరిష్ఠంగా ముగ్గురికి మాత్రమే పోటీపడే వీలుంది. దాంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య జూన్‌లో ట్రయల్స్ నిర్వహించి ఆరుగురి నుంచి ముగ్గురిని ఎంపిక చేస్తుంది.

సినిమా

ఊహా ప్రపంచానికి ఊ



మంచి ఊహలు ఎప్పుడూ బాగుంటాయి. నేరుగా చూడలేని ప్రపంచాలను ఊహించుకున్నప్పుడు ఓ ఆనందం దక్కుతుంది. ఇక కొత్త ప్రపంచాలను సిల్వర్ స్క్రీన్‌పై చూసినప్పుడు కనువిందుగా ఉంటుంది. అలా ఊహా ప్రపంచం నేపథ్యంలోని కథలకు కొందరు స్టార్స్ ఊ అన్నారు. కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులను రా రమ్మంటున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం...

అఖిల్ నెక్ట్స్ సినిమా గురించిన ఓ వార్త అక్కినేని ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగిస్తోంది. అఖిల్ హీరోగా యూవీ క్రియేషన్స్, హోంబలే ఫిలింస్ కలిసి ఓ సోషియో ఫ్యాంటసీ సినిమాను నిర్మించనున్నాయట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని తెలిసింది. ఈ సినిమాతో అనిల్ అనే కొత్త దర్శకుడు పరిచయం అవుతారని భోగట్టా. ఈ మూవీపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

పది సెట్స్‌లో విశ్వంభర

'జగదేకవీరుడు అతిలోక సుందరి' (1990), 'అంజి' (2004) వంటివి చిరంజీవి కెరీర్‌లోని సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్స్. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ జానర్‌ను టచ్ చేశారు చిరంజీవి. ఈ కోవలో 'విశ్వంభర' అనే సినిమా చేస్తున్నారు. దర్శకుడిగా తొలి సినిమా 'బింబిసార'ను సోషియో ఫ్యాంటసీ జానర్‌లో తీసిన వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఈ సినిమా మేజర్ షూటింగ్ అంతా ఓ కల్పిత ప్రాంతంలో జరుగుతుందట. చిత్రీకరణకు తగ్గట్లుగా పదికి పైగా సెట్స్ తయారు చేయిస్తున్నారట. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అవుతారట చిరంజీవి. ఈ చిత్రంలో హనుమంతుని భక్తుడు దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారని, త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఓ చైల్డ్ ఎపిసోడ్ కూడా ఉంటుందట. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 10న ఈ చిత్రం రిలీజ్ డేట్ అనే టాక్ ప్రచారంలోకి వచ్చింది.

కల్కి లోకం

భారతీయ ఇతిహాసాల ఆధారంగా సైంటిఫిక్ అంశాల మేళవింపుతో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్ట్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ఈ సినిమా కథలో ఇతిహాసాల ప్రస్తావన ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయి కాబట్టి ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయని ఊహించవచ్చు. ఓ నాలుగు వందల సంవత్సరాల తర్వాత ఇండియా ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపిస్తాం అన్నట్లుగా ఈ చిత్రదర్శకుడు నాగ్ అశ్విన్ ఇటీవల సందర్భంలో పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా దీపికా పదుకోన్ హీరోయిన్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీ రోల్స్‌లో కనిపిస్తారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 'సలార్' తర్వాత హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'రావణం' అనే మైథలాజికల్ ఫిల్మ్ రానుందని, ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మిస్తారనే వార్తలు గతంలో వచ్చిన సంగతి తెలిసిందే. ఇది కూడా ఊహాజనిత ప్రపంచంలో జరిగే చిత్రం అని టాక్.

ట్రాక్ మారింది

'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల.. వైకుంఠపురములో'... హీరో అల్లు అర్జున్-దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు ఇవి. కమర్షియల్ అంశాలతో రూపొందిన ఈ సినిమాలు మంచి విజయాలు సాధించాయి. ఈ మూడు సినిమాల తర్వాత అల్లు అర్జున్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో నాలుగో సినిమా గురించిన ప్రకటన వెల్లడైంది. కానీ ట్రాక్ మారింది. రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌లో ఈ చిత్రం ఉండదట. ఇది పూర్తి స్థాయి సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ అని, మహాభారతం రిఫరెన్స్ ఈ సినిమాలో ఉంటుందనే టాక్ తెరపైకి వచ్చింది. అల్లు అరవింద్, సూర్యదేవర రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా ఈ సినిమా ప్రారంభం కావడానికి కాస్త సమయం పట్టేలా ఉందని తెలిసింది.

కంగువ ప్రపంచం

'కంగువ' టీజర్ చూస్తున్నప్పుడు ఏదో కొత్త ప్రపంచంలోకి వెళ్తున్నట్లుగా ప్రేక్షకులకు అనిపిస్తుంటుంది. సూర్య హీరోగా నటించిన చిత్రం ఇది. పూర్తి స్థాయి ఫ్యాంటసీ ఫిల్మ్ కాకపోయినప్పటికీ 'కంగువ'లో ఆడియన్స్ ఆశ్చర్యపోయే, అబ్బురపరచే విజువల్స్ చాలానే ఉన్నాయన్నది కోలీవుడ్ టాక్. కథ రీత్యా కాస్త సైంటిఫిక్ టచ్ ఉన్న ఈ సినిమాలో సూర్య పదికి పైగా గెటప్స్‌లో కనిపిస్తారని సమాచారం. దిశా పటానీ, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు శివ దర్శకుడు. కేఈ జ్ఞానవేల్ రాజాతో కలిసి ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మించింది. రెండు భాగాలుగా ఈ సినిమా విడుదల కానుందట. తొలి భాగం ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుంది.

కేరాఫ్ భైరవకోన

గరుడ పురాణంలో మిస్ అయిన ఓ నాలుగు పేజీల కథే 'భైరవకోన' అట. మరి.. ఈ గరుడ పురాణం పూర్తి వివరాలు, ఈ నాలుగు పేజీల మిస్టరీ ఏంటో తెలుసుకోవాలంటే ఫిబ్రవరి 16న థియేటర్స్‌లో విడుదలయ్యే 'ఊరు పేరు భైరవకోన' సినిమా చూడాలి. సందీప్ కిషన్ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ ఇది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రంలో వర్షా బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటించారు.

అఘోరా శంకర్

యంగ్ హీరోల్లో ఒకరైన విశ్వక్ సేన్ చేస్తున్న తాజా చిత్రాల్లో 'గామి' ఒకటి. ఇందులో శంకర్ అనే అఘోరా పాత్రలో విశ్వక్ కనిపిస్తారు. కథ రీత్యా శంకర్‌కు మానవ స్పర్శ తెలియదు. కానీ ఆ స్పర్శను అనుభూతి చెందాలన్నది అతని ఆకాంక్ష. ఈ క్రమంలో ఏం జరుగుతుంది? అనేదే 'గామి' కథ అట. ఈ సినిమాలో అఘోరా ట్రాక్ మాత్రమే కాకుండా మరో స్టోరీ ట్రాక్ కూడా ఉందని చిత్ర యూనిట్ చెబుతోంది. భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్ వర్క్స్ జరుగుతున్న ఈ చిత్రాన్ని దాదాపు నాలుగు సంవత్సరాలుగా తీస్తున్నారు. ఈ సినిమాలో ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయని ఊహించవచ్చు. విద్యాధర కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

జై హనుమాన్

ఈ సంక్రాంతికి 'హను-మాన్' సూపర్ హిట్. అంజనాద్రి అనే ఊహాజనిత ప్రాంతం నేపథ్యంలో ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తేజ సజ్జా హీరో. కె. నిరంజన్‌రెడ్డి నిర్మించారు. కాగా 'హను-మాన్' సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' తీస్తున్నారు ప్రశాంత్ వర్మ. స్క్రిప్ట్ వర్క్ మొదలైంది. 'జై హను-మాన్' సినిమాలో ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ఉండేట్లు కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో నటించే నటీనటులపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

ఇలా ఫ్యాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో మరికొన్ని సినిమాలు రానున్నాయి.


తమన్నా

మరోసారి గ్రీన్ సిగ్నల్

ఓ వైపు సినిమాలు, మరోవైపు వెబ్ సిరీస్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్నారు హీరోయిన్ తమన్నా. 'లెవంత్ హవర్, నవంబర్ స్టోరీ, జీ కర్దా, ఆఖ్రీ సచ్' వంటి పలు వెబ్ సిరీస్‌లలో నటించిన ఆమె తాజాగా మరో వెబ్ సిరీస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'డాక్టర్ అరోరా' ఫేమ్ అర్చిత్ కుమార్ దర్శకత్వం వహించనున్న ఓ వెబ్ సిరీస్‌లో నటించేందుకు తమన్నా ఒప్పుకున్నారు. ఈ సిరీస్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇందులో ఇద్దరు మహిళలు లీడ్ రోల్స్‌లో కనిపిస్తారట. ఒక పాత్రకి తమన్నాని ఎంపిక చేసిన యూనిట్ రెండో లీడ్ కోసం అన్వేషిస్తోంది. ఈ సిరీస్ చిత్రీకరణ మార్చి లేదా ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందట. ఇదిలా ఉంటే తమన్నా నటించిన తమిళ చిత్రం 'ఆరణ్మనై 4' పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. హిందీలో 'వేదా', 'స్త్రీ 2' వంటి చిత్రాలు చేస్తున్నారు.


అర్బాజ్ ఖాన్

ఆరేళ్ల తర్వాత...

చిరంజీవి హీరోగా నటించిన 'జై చిరంజీవ' (2005) చిత్రంతో తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారు బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్ (సల్మాన్ ఖాన్ సోదరుడు). ఆ తర్వాత చాలా గ్యాప్‌తో 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' (2017) సినిమాలో నటించిన ఆయన ఆరేళ్లకు ఇప్పుడు తెలుగు సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జంటగా అప్సర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్న ఈ సినిమాలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు అర్బాజ్ ఖాన్. ఈ సినిమా షూటింగ్‌లో అర్బాజ్ మంగళవారం జాయిన్ అయినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూ- ''వైవిధ్యమైన కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న ఈ న్యూ ఏజ్ సినిమాలో అర్బాజ్ గారి పాత్ర అద్భుతంగా ఉంటుంది'' అన్నారు.

ఆ ప్రేమకు మాటలు రాలేదు


సుహాస్

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఆ కష్టం ఈ మూవీ సక్సెస్ రూపంలో మంచి ఫలితాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం'' అని హీరో సుహాస్ అన్నారు. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో మాట్లాడుతూ- ''2007లో జరిగే కథే ఈ చిత్రం. మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది? అనేది మెయిన్ పాయింట్. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ కథని అద్భుతంగా రాసి, తెరకెక్కించాడు దుష్యంత్. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌లో సినిమా చేస్తున్నానంటే ముందు మా అమ్మా నాన్న నమ్మలేదు.. పోస్టర్ చూపిస్తే నమ్మారు. అమలాపురంలో షూటింగ్ చేసినప్పుడు అక్కడి వాళ్లు మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకున్నారు. వాళ్ల ప్రేమతో మాకు మాటలు రాకుండా చేశారు. ఈ సినిమా చూసి, చాలా బాగుందని అల్లు అరవింద్‌గారు ప్రశంసించారు. ఇక హీరోగా కంటే నటుడిగా పేరు తెచ్చుకోవడమే ఇష్టం. 'ప్రసన్న వదనం', 'కేబుల్ రెడ్డి' చిత్రాలతో పాటు 'దిల్' రాజుగారి బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాను. 'కలర్‌ఫొటో' దర్శకుడు సందీప్‌తో ఓ సినిమా చేయబోతున్నాను'' అన్నారు.